ఆంధ్ర సచిత్ర వారపత్రిక

4-1-80
75 పైసలు



ప్రేమకు మజిలీలుంటాయా?



ప్రేమ-కోర్కె-కామం, ఈ మూడింటికి మధ్య ఉన్న అంతరం ఏమిటి? దేని హద్దులు ఎంతవరకు? వీటిని విడదీసి ఇతమిద్ధంగా నిర్వచించటం సాధ్యమా? ... ఒక యువకుడు తన జీవితంలో ఒకరి తరువాత మరొకరుగా ప్రవేశించిన అయిదుగురు అమ్మాయిల్నీ మనస్ఫూర్తిగా ప్రేమించి కూడా వారికి ఎలా దూరమై పోగలిగాడు? ముక్కుమొహం తెలీని పెద్దమనిషి పిలిచి రాజోచిత సత్కారాలు చేసి కవ్వించే ఆడపిల్లల మధ్య వదిత్తే ఏం చేశాడు? ఆ పయనం ఎక్కడిదాకా వెళ్ళి ఆగింది?

'చతుర' జనవరి సంచికలోని శ్రీ సి.ఎస్. రావు తాజా నవల ''ప్రేమ మజిలీలు'' ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమిస్తుంది. నవల కాక అదనంగా చతుర ప్రపంచం, చతుర కతలు, రెండు రంగుల చిత్రాలతో **132** పేజీల 'చతుర' వెల కేవలం **125** పైసలే!

చతుర


ప్రతి నెలా 1వ తేదీకి వెలువడే నవ నవలా వేదిక

ఉచితం!!

మీ అభిమాన మాస పత్రిక రేపు అందిస్తున్న ఈ సుందరమైన నూతన సంవత్సర కానుకను ఉచితంగా స్వీకరించండి!

24675

- మీరు చందాదారులుగా చేరటానికై ఈ క్రింది కూపనును పూర్తి చేసి పంపించండి. లేదా కార్డుపై మీ చిరునామాను వ్రాసి మాకు పోస్టు చేయండి.
- పోస్టు,ప్యాకింగు ఖర్చులు మేమే భరించి మీకు దాదాపు రూ. 10/- విలువగల ఈ డైరీని ఉచితంగా వి. పి. పి. ద్వారా పంపిస్తాము.
- వి. పి. పి. తెచ్చిన పోస్టుమాన్‌కు 'రేపు' చందా నిమిత్తం రూ. 25/ చెల్లించండి. ఆ తరువాత 'రేపు' మాసపత్రికను మీకు సంవత్సర పాటు పంపిస్తాము.



మీరు ఈ క్రింది కూపనును పూర్తిచేసి పంపితే చాలు



ఇక్కడ కత్తిరించండి

నేను రేపు మాసపత్రికకు చందాదారునిగా చేరగోరుతున్నాను. ఈ సుందరమైన డైరీని ఉచితంగా వి పి పి ద్వారా పంపించండి. వి. పి. పి తెచ్చిన పోస్టుమాన్‌కు రు 25/ చెల్లించుతాను. రేపు మాసపత్రికను సంవత్సరంపాటు ఈ క్రింది అడ్రసుకు పంపండి

పేరు ____________________

చిరునామా ____________________

____

____

సంతకం ____________________


ఇక్కడ కత్తిరించండి

అద్భుతమైన మాస పత్రిక 'రేపు' ఇప్పటికే లక్షలాదిమంది జీవితాల్ని ఉన్నతంగా తీర్చి దిద్దింది. ఒక్క సంవత్సరంలో మీకు నూతన జీవితాన్ని వాగ్దానం చేస్తోంది.

రేపు
విజయవాడ-520 002

'రేపు' మాసపత్రిక, ఏలూరు రోడ్డు, విజయవాడ.





ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
బుధవారం : 4–1–'80
సిద్ధార్థినామ సం. పుష్య బ. విదియ
సంపుటము 73 : సంచిక 19
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక



ముఖచిత్రం

స్నేహం ముఖచిత్రంతో వెలువడిన 14.12.79 నాటి ఆంధ్రపత్రిక చాల ఆకర్షణీయంగా ఉంది. స్వాతి చినుకు, ముడివడిన జీవితాలు కధలు చాలా బాగున్నాయి. ప్రాక్టీసు పెట్టి చూడు సీరియల్ మిక్కిలి హాస్యభరితంగా నున్నది.

మాదల శివరామప్రసాద్, హనుమంతరావు, రవి, [పొన్నూరు]

* * *

14.12.79 ఆంధ్రపత్రిక స్నేహం ముఖచిత్రం వెరైటీగా ఉంది. సీరియల్స్‌లో సుదూర తీరాలు బాగుంది. పాక్టీస్ పెట్టి చూడు ఎంతకూ ముందుకూ కదలడం లేదు. ఈ వారం పత్రికలో కొత్త మొక్కలకై అన్వేషణ విజ్ఞాన దాయకంగా ఉంది ముఖ్యంగా ఆంధ్రపత్రికలో చెప్పుకోదగ్గ శీర్షిక. లోకంపోకడ ఊమెన్ కార్టూన్స్ నేటి రాజకీయ పరిస్థితిపై వ్యంగ్యంగా, సూటిగా ఘాటుగా గుండెల్లో పదిలంగా ఉండే విధంగా వారు చేస్తున్న కృషి అభినందనీయం.

వల్లభనేని హనుమయ్య చౌదరి [వడాలి]

సిరియల

మీ పత్రికలోని సీరియల్ ప్రాక్టీసు పెట్టి చూడు బాగుంది. 21.12.79 పత్రికలో ఎన్‌లార్జ్‌డ్ ప్రొస్టేటు అనే పదము చూశాను. ఇది ఉన్నవారు స్త్రీలను తాకితే కోరిక ఉండదు. అని మా కాలేజిలో చెప్పారు. మరి మీరేమో దానికి వ్యతిరేకముగా ఉన్నది వ్రాశరు ?

డి. బాబూరావు, [కర్నూలు]

* * *

పొరపాటున రాలిన వక్కానికి రాని మొగ్గను మళ్లీ మొక్కకు అతికించి పుష్పింప చేయటం సాధ్యం కాదన్న నిజాన్ని నిరూపించిన. సుదూర తీరాలు నవల ముగింపు ఇంపుగా ఉంది:

కొట్టిశ ఆనందగజపతిరావు [బడ్డమాసింగి]

* * *

14 12 79 తేదీ నాటి మా అభిమాన ఆంధ్ర పవిత్ర వారపత్రికలోని స్వాతి చినుకు, ఫ్లాష్ బ్యాక్ కథలు చాలా బాగున్నాయి. సుదూర తీరాలు సీరియల్ ప్రతీ సారి చదువుతుంటే ఏదో అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. ప్రాక్టీస్ పెట్టి చూడు సీరియల్ పత్రికకే మణిహారం వంటిది. కార్టూన్లు, సినిమా విశేషాలు చాలా బాగున్నాయి.

ఎం. జగన్మోహనరావుపట్నాయక్,
ఎం. వి. నరసింహమూర్తిపట్నాయక్, [విశాఖపట్నం]



భక్తుడెలా ఉండాలి !

దేవతా విగ్రహాలను పూజిస్తున్నవారూ, నిత్యమూ తప్పక దేవాలయానికి వెళ్ళుతున్నవారు, గుడికి ప్రదక్షిణాలు చేస్తున్నవారు, స్తోత్రాలు చదివేవారూ, తాము భక్తులమని అనుకోవడం సరికాదు. మనస్సులో ఏదో కోరిక పెట్టుకొని, అది జరగడం కోసం మొక్కుకుని, ఆ మొక్కుబడి చెల్లించేవారూ సరియైన భక్తులని చెప్పలేము.

భగవద్గీతలోని భక్తియోగంలో భక్తుడు ఎలా ఉండవలసినదీ భగవానుడు ఇలా వివరించి ఉన్నాడు -

'అనపేక్షః శుచిర్దక్షః
ఉదాసీనో గతవ్యథః,
సర్వారంభ పరిత్యాగీ
యో మద్భక్తః సమే ప్రియః

ఏ వస్తువు మీదా స్పృహ లేనివాడు, పరిశుద్ధంగా ఉన్నవాడు, సమర్థుడై అన్ని విషయాలలోను తటస్థుడుగా ఉన్నవాడు, మనస్సులో ఎలాంటి విచారము లేనివాడు, సమస్తమైన కర్మారంభములను విడిచినవాడు భగవద్భక్తుడని చెప్పవలసి ఉన్నది. అట్టి భక్తుడే తనకు ప్రియమైనవాడని భగవానుడు కంఠోక్తిగా చెప్పుతూ ఉన్నాడు.

ఇది పయి గాని అర్థం.

భక్తుడయిన వానికి మనస్సులో ఏ విధమైన కోరిక ఉండకూడదు— అంటే ఏదో కోరిక మనస్సులో పెట్టుకుని భక్తిని చూపకూడదు. తన కోరిక నెరవేరడం కోసం మొక్కులు కట్టినవారు నిజమైన భక్తులు కారు అంతే. అతడు శారీరకంగాను, మానసికంగానూ పరిశుద్ధుడై— పవిత్రుడై ఉండాలి దేహపరిశుద్ధి ఒక్కటే వుంటే చాలదు. అతడు నేర్పు కలిగి ఉండాలి— అంటే సమయస్ఫూర్తి ఉండాలి.

భక్తునికి ఔదాసీన్యం అవసరం. ఏ పక్షానికీ చెందక తటస్థుడుగా ఉండవలసి ఉంటుంది. పక్షపాతం లేకుండా సాక్షిగా మాత్రం ఉండడమే ఉదాసీనుని లక్షణం. అతడు మనోవైకల్యం లేకుండా వుండాలి.

భక్తుడు సర్వారంభ పరిత్యాగియై ఉండాలని శ్లోకంలో ఉన్నది. సర్వ కార్యములనూ విడిచినవాడని అర్థం వస్తున్నది. అతడు కామ్య కర్మలను - అంటే కోరికతో కూడిన కర్మలను ఆరంభించకూడదని అభిప్రాయం. నిష్కామకర్మకు నిషేధం లేదు.

భక్తుడు పయి విధంగా వుండాలని గీతాచార్యుని అభిప్రాయం. ఇలా ఉన్నప్పుడే అతడు భగవంతునికి ఇష్టుడై ఉంటాడు. లేనివాడు నిజమైన భక్తుడు కాడు. అందువల్ల భక్తులయినవారు పయి ఉత్తమ గుణాలను అలవరుచుకోవలసి వుంటుంది.

— బులుసు వేంకటరమణయ్య

ఉత్తరాలు

సుదూర తీరాలు ముగింపు ఆశాభంగంగా ఉంది. రచయిత్రి ముగింపులో పాత పద్ధతిలో కథను నడిపి పొరపాటు చేశారనిపిస్తుంది.

మటికాన ప్రకాష్, [విజయనగరం]

* * *

ఈ వారంతో [21—12—79] ముగిసిన సుదూర తీరాలు సీరియల్‌లో మాధవ్‌ను మొదట విడిచిపెట్టిన మల్లి విధివశాత్తు సూర్యం కామదాహానికి ఆహుతియై చివరకు తన స్వంత గ్రామం చేరటం యెందుకు? చేరినచో, సంఘ సంస్కర్తగా మాధవ్‌ను చిత్రించిన రచయిత్రి మారుతున్న సంఘమునకు మారే స్వభావమున్న మనిషిగా మల్లిని చిత్రించక పోవడమే.

వాడాడ సింహాచలం [వలాస]

* * *

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రస్తుతం నడుస్తున్న రెండు సీరియల్ నవలలు ప్రోత్సాహం పెట్టి చూడు, సుదూర తీరాలు చాలా బాగున్నవి. ఈ రెండింటిలో మొదటిది కడుపుబ్బ నవ్వించే హాస్య నవలైతే, రెండోది వాస్తవంలోని నగ్న సత్యాలను విపులీకరించే నవల. ఈ మధ్య పత్రికలో చాలా మంచి మంచి కథలు ప్రచురిస్తున్నారు.

పి. వి. రామనాథరావు [మధిర]

కథలు

మీ పత్రిక నేను ఊహ తెలిసినప్పటి నుంచి చదువుచున్నాను. ఉద్యోగరీత్యా జబల్‌పూర్ [ఉత్తర హిందూస్థాన్] లో ఉన్నా వారం వారం తెప్పించుకుని చదువుచున్నాను. మీ పత్రికలో ప్రచురించిన అది గౌరవించే వయసా? అనే కథ చదువుచుంటే కంటి వెంట నీరు వచ్చినది. పెద్ద వయసు వచ్చినవారి పరిస్థితి అలాగే ఉంటుందనిపించినది.

శ్రీమతి రూపాకుల త్రిపురాంబ, జబల్‌పూర్ [ఎం. పి]

శీర్షికలు


సైకత భూములనుంచి సిరిసంపదలు అన్న వ్యాసం ఎక్సలెంట్‌గా ఉంది.

చోడవరపు నాగేశ్వరరావు, సికిందరాబాదు.

* * *

సైకత భూముల నుంచి సిరిసంపదలు వ్యాసం చాలా విజ్ఞానదాయకంగా ఉంది. విజ్ఞానదాయకమైన వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు మీకు మా థాంక్స్.

మాదల శివరామప్రసాద్, హనుమంతరావు, పి. బి. ఎస్. కాలేజి [పొన్నూరు]



సీరియల్

ప్రాక్టీసు పెట్టేవాడు



శ్రీరంగం

జరిగినకథ 6: కొత్తగా డిగ్రీ పుచ్చుకున్న డాక్టర్ సుదర్శనం డిస్పెన్సరీ పెడతాడు. కాలనీలో తమ కుటుంబానికి ఇరుగు పొరుగుగా వున్న శివయ్య, వెంకట్రామయ్యల తగాదాకు పరిష్కారం సూచిస్తాడు. ఎంతోమంది డాక్టర్లకు చూపించుకొని, కొన్ని వేల రూపాయలు డబ్బు ఖర్చు పెట్టినా తగ్గని వీరేశం జబ్బుకు డాక్టర్ సుదర్శనం తగ్గే మార్గం చెబుతాడు. ఫీజు క్రింద వీరేశం ఇచ్చిన అయిదు రూపాయలను తీసుకొని 'తన మొదటి సంపాదన' అని ఆనందిస్తాడు సుదర్శనం. తన దగ్గరకు వచ్చే పేషెంట్స్‌తో అనేక సమస్యలను విదుల్చుకొంటూంటాడు డాక్టర్ సుదర్శనం. తన స్నేహితుడు డాక్టర్ హరనాధ్ ఇంటికి వెళ్తాడు డాక్టర్ సుదర్శనం. అక్కడ అతనిభార్య శోభ డాక్టరుభార్యగా తన జీవితం మీద అసంతృప్తిని వెళ్ళడిస్తుంది.

(గత సంచిక తరువాయి)

రోజులు దొర్లిపోతున్నాయి. తను ప్రాక్టీస్ పెట్టి సరిగ్గా నెలరోజులయింది. మొదటి నెల డిస్పెన్సరీ ఖర్చులు పోను యాభైరూపాయలు మిగిలేయి. అంటే రోజుకి రూపాయున్నర దగ్గర దగ్గర గిట్టుబాటు యిందన్నమాట. అలా అనుకోగానే చాలా బాధకలిగించింది. నెలరోజులు వడ్డ కష్టానికి కూలి కూడా గిట్టలేదు. తను సంపాదించింది యిల్లుగలవాళ్ళమ్మా, ఫర్నీచర్ అతన్నీ, మందులషాపు వాళ్ళని సుఖపెట్టేందుకేలాగుంది.

తను యీనెల నించైనా యింటిబాధ్యత తనమీద తీసుకోవాలి అనుకున్నాడు. కానీ యాభైరూపాయలతో ఏం బాధ్యత తీసుకోగలడు? తండ్రి నెలనెలా తన ప్రావిడెంట్ ఫండ్‌లోంచి నాలుగు వందలు తీస్తాడు యింటి ఖర్చుల గురించి. అతను యిచ్చిన చెక్‌ను తనే బాంకివెళ్ళి మార్చుకు వస్తాడు.

ఈసారి చెక్ యివ్వగానే తను 'వొద్దు నాన్నా' అందాం అనుకున్నాడు. కాని తన నోరు తిరగలేదు ఆ మాట అనేందుకు. తనకు యీనెల కలెక్షను ఎక్కువగా లేదు. ఏ అండతో అనగలడు తను. చెక్ తీసుకుని జేబులో పెట్టుకుని క్లీనిక్ మూసింతర్వాత బాంకుకి వెళ్ళేడు. చెక్ అందిస్తే క్లర్కు అయిదు నిముషాల తర్వాత యిచ్చిన డబ్బు లెక్కపెట్టుకుంటే రెండొందలే ఉంది. వాళ్ళు తప్పు ఇచ్చారనుకుని 'రెండు వందలే ఉంది' అన్నాడు తను క్లర్కుతో.

'అవును మీరిచ్చిన చెక్ రెండువందలదే' అన్నాడు క్లర్కు.

తను నమ్మలేదు అని తెలుసుకున్న బాంకి క్లర్కు చెక్ తీసి చూపించేడు. అతను చెప్పినట్టు రెండువందలే ఉంది చెక్‌మీద.

తన కళ్ళు చెదిరిపోయేయి. నెలనెలా నాలుగు వందలకు చెక్ రాసే నాన్న రెండు వందలకే రాయడమా? అతను మరచిపోయి ఉంటాడా? అలా అయివుండదే. మరి అయితే దీని అర్థం ఏంటి? తను అతని ఎకౌంట్‌లో ఎంత బాలెన్సు ఉందో కనుక్కుంటే సంగతి తెలుస్తుంది అనుకుని తండ్రి ఎకౌంట్ నెంబరు చెప్పి యిందులో ఎంత ఉందండీ? అన్నాడు.

అతను ఎకౌంటు పుస్తకం చూసి యిరవై అయిదు రూపాయలు ఉంది అన్నాడు. ఇరవై అయిదు రూపాయలు, తనకడుపులో దేవినట్టయింది. తండ్రి ప్రావిడెంట్ ఫండ్‌లో మిగిలింది యిరవై అయిదు రూపాయలు. చేతి కందివొచ్చి, గౌరవనీయమైన డాక్టర్ వృత్తి చేపట్టిన కొడుకు వుండగా, తండ్రి యింకా తన రిటైరైన డబ్బు బాంకీలోంచి తీస్తున్నాడంటే... నేను యీ మెడిసిన్‌లోకి ఎందుకొచ్చేను? మెట్రిక్యులేషన్‌తో చదువు నిలిపేసి ఏ గుమాస్తాగా వెళ్ళిపోయినా యీ రోజు యింత నికరమైన ఆదాయం అంటూ వుండేది అన్న భావాలో... మనస్సు అంతా చాలా ఆందోళనగా ఉంటే ఆ రోజంతా బాధగా గడిపివేసేడు.

రాత్రి యింట్లో తండ్రికి డబ్బు అందిస్తూంటే చేతులు వొణికేయి. అతని ముఖంలో సూటిగా చూసే ధైర్యం లేక తలదించుకున్నాడు.

మర్నాడు డిస్పెన్సరీ కొస్తూనే తిరిగి డిస్పెన్సరీ కలెక్షను లెక్క పెట్టేడు రెండు వందలయాభై ఉంది.

ఇంటి యజమాని నరసింహం గారితో 'యింకొద్ది రోజుల్లో వచ్చే నెలలో యిస్తాను' అంటే! అతను మొదలే వార్నింగు యిచ్చేడు. పోనీ ఫర్నీచరు, మందుల వాళ్ళకు తర్వాత యిస్తే! ఫర్నీచరు అతను ఊరుకోడు. మందులషాపుకు తను బకాయి పెట్టలేదు.

తను అప్పు తెస్తే— ఎవరిని అడగాలి?

డిస్పెన్సరీ ముందు కారు హారను విని పించింది. తల తిప్పేడు. హరనాధ్ కారు దిగుతూ కనిపించేడు. తన సమస్యకు పరిష్కారం హరనాధ్‌లో కనిపించినట్టయింది.

తను లేచి మెట్లదాకా వస్తూ "ఏంటి హరీ యిలా వొచ్చేసేవు?" అన్నాడు ఆనందంతో. 'ఏంలేదు. యీ వీధిలో ఒక విజిట్ ఉంటే చూసిపోతూ నువ్వు ఖాళీగా కనిపిస్తే'— అంటూ లోనికి వచ్చేడు. కుర్చీలో కూర్చొని హరనాధ్ సిగిరెట్టు తీసి తనకు యిస్తూ 'ఏంటి సంగతులు' అన్నాడు.

'ఏంలేదు', అన్నాడు తను.


డిస్పెన్సరీ అంతా వొకసారి చూసి 'ఎలా వుంది ప్రాక్టీస్, రెస్పాన్సు వస్తూందా?'

'కొద్దిగా నయమనే అనుకున్నాను నిన్నటిదాకా.'

"అయితే యివాళ అభిప్రాయం మార్చుకున్నావేంటి?"

'నా కుటుంబానికి తప్ప మిగిలిన వాళ్ళందరికీ సంపాయించేవని తెలుసుకున్న తర్వాత అభిప్రాయం మార్చుకున్నానులే!'

'యీ ప్రయివేట్ ప్రాక్టీసు బాగా ఆర్థిక స్తోమత ఉన్నవాళ్ళే పెట్టాలి. మొదట్లో ఖర్చులు నిలద్రొక్కుకుని డిస్పెన్సరీ నడిపించేందుకు వెనక ఆస్తి ఉంటేకాని వీలుకాదు. కాని సాధారణంగా తొంభై వొంతులు ఆర్థిక



స్తోమత లేనివాళ్ళే యీ క్లినిక్‌లు పెట్టుకుంటున్నారు.'

'ఏంచేస్తారు చెప్పు, డాక్టర్లకు ఉద్యోగాలు పాస్‌కాగానే రావు. అది వొచ్చే దాకా...'

'గవర్నమెంటు యీ విషయం కొద్దిగా ఆలోచిస్తే మంచిది. ఉత్సాహంగా ఏదో సాధించేమని మెడికల్ కాలేజీలోంచి వచ్చిన ప్రతీ డాక్టరూ నిరుత్సాహపడకుండా ఉంటారు.'

'ఏదో ఆలోచించేరనీ యీ మధ్య విన్నాను. ప్రతీ నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌కీ ఉద్యోగం, గవర్నమెంటు యివ్వగలిగేదాకా యింత నిరుద్యోగ భత్యం అంటూ యిస్తారట.'

'గుడ్డిలో మెల్లనయం అంట. యిది వాళ్ళకు కొంచెం సహాయంగా ఉంటుంది'

ప్రాక్టీసు పెట్టిచూడు

అని 'ఆరోజు నీ పెన్సిలిన్ రియాక్షన్ కేసు ఏలా ఉంది?'

'పెళ్ళి చేసుకుని హనీమూన్‌కి కూడా వెళ్ళి వచ్చింది థాంక్స్‌టుయూ.'

'నా బెటర్, నేనేం చేసేను కానీ పేషంట్సు ఆ రియాక్షన్ ఇన్సిడెంటుని ఏలా తీసుకున్నారు?'

"బ్రహ్మరథం పట్టేలా తీసుకున్నారు. అది కాకముందు నేను మూడేళ్ళనించీ క్లినిక్కుకు వెళుతున్నా యింకా కొత్త డాక్టరు ఏలా యిస్తాడో అనుకునేవారా! ఆరోజు తర్వాత 'చచ్చిపోయిన వాళ్లను కూడా ప్రాణాలకి లాక్కొరాగలిగినంత తెలివి జ్ఞానం ఉన్నాయి' అంటూ అందరూ మెచ్చుకోవడమే. ఆ పిల్ల పెళ్ళిరోజు చూడాలి మీరు రావాలి పెళ్ళికి అంటూ కారు పంపించేరు. నేను వెళ్ళేంతర్వాత ఆ మంటపంలో నాకు జరిగిన మర్యాద తలచుకుంటే వొళ్ళు పులకించి పోతుందనుకో! అందరూ నా చేతులు పట్టుకుని వంగి వంగి తమ కృతజ్ఞత వెళ్ళబరిచేరు. క్రొత్త వాళ్ళతో యీ డాక్టరుగారేనండీ పెళ్ళి కూతురికి ప్రాణంపోసింది—అంటూ అందరికీ ఎడ్వర్టైజ్‌మెంటు యిచ్చేరు. ఆ సంఘటన నా ప్రాక్టీస్‌ని పటిష్టంచేసి పారేసిందనుకో. ఇక అందరికీ మా నాన్నగారిమీద ఎంత గురి ఉందో నా మీదా అంతే గురి కుదిరిపోయింది. ఇదివరకు వచ్చిన ప్రతీవాడూ నాన్నగారు లేరా? అంటూ అడిగేవారు. ఇప్పుడు నేనే కావాలని 'నాన్నగారు లేరండీ' అంటే 'మీరు తక్కువా నాన్నగారికంటే' అనడం మొదలు పెట్టేరు. ఇదంతా ఎందుకు? ఆ వొక్క సంఘటన నించీ ఆరోజేగాని అది బెడిసికొట్టి ఉంటే నేను బోర్డు, డిస్పెన్సరీ పీకి పారేయవలసి వొచ్చేది. నేను అనుకుంటాను ఈ సంఘటనలే కొత్త ప్రాక్టీషనర్‌ని మీదకు తెచ్చేవి. ఇటువంటివి రెండు మూడు జరిగితే ఆ డాక్టరు పేరు మారుమ్రోగిపోతుంది."

'వెల్ గురూ ఇంక వెళ్తాను' అంటూ లేచేడు.

తనూ లేచేడు.

'అప్పుడప్పుడు రా యింటికి- యిప్పటి నించి క్లినిక్కే నా యిల్లు.'


తను సరే అన్నాడు.

'సుదర్శనం నువ్వేం అనుకోకు, వొద్దనకు' అంటూ జేబులోంచి వొక మూడు వచ్చనోట్లు తీసి తన జేబులో కుక్కి మెట్లు దిగిపోయేడు హరనాథ్.

తను హరనాథ్ వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయేడు అతని ఫియట్‌కారు కనుమరుగయేదాకా.

ఈ డబ్బు తండ్రికి యిచ్చి నాన్నా నేను సంపాయించేను అంటూ చెప్పాలి. అతని రెండొందలూ తిరిగి బాంకులో వేసేయాలి. తండ్రితో తనకు నిప్పుడగా అబద్ధం చెప్పవలసిన అవసరం లేకపోయినా- యీ చిన్న అబద్ధం— అతనికి ఈ వృద్ధాప్యంలో బోలెడంత సంతోషం యిస్తుంది తను ఇంటికి డబ్బు ఏమీ యీ నెల యివ్వలేకపోతే తండ్రి మథనపడిపోతాడు. ఈనెల రెండువందలతో గడిపేసేను- వచ్చేనెల యీ రెండువందలు కూడా ఉండవే అనుకుంటూ. తనే యీ మూడు వందలూ- ఆ యాభై కలిపి యిస్తే- ఫర్వాలేదు. మొదటినెలే యింత వొచ్చింది. రెండో నెలనించీ యింతకంటే ఎక్కువే వొస్తుంది- అన్న ధైర్యంతో అతనికి తృప్తి నిస్తుంది.

అసలు యీ నెలే క్రొత్త సమస్యలతో


"స్మార్ట్!"
మీరలాంటి అభినందనలు
కోకొల్లలుగా అందుకునేందుకే మరి
మధురా బట్టలు
మధురా కోట్స్ ఉత్పాదన

ప్రాక్టీసు పెట్టిచూడు

తలెత్తింది. తనకున్న బాధలకు తోడు విమల ఆరోగ్యం కొద్దిగా ఆందోళనగా ఉంది.

విమల మొదట్లో వికారంగా ఉంది అనేది. కాని పదిరోజుల నించీ వాంతులు మొదలయేయి. ఏంతిన్నా నిలవటంలేదు. అది ప్రెగ్నన్సీ వామిటింగ్స్. తను టాబ్లెట్లు వాడేడు. తగ్గలేదు. ఇంజక్షన్లు మొదలు పెట్టేడు. అయినా ఫలితం అంతగా కనిపించటంలేదు. ఆమె ఆరోగ్యం బాగోలేనప్పటినించీ తను రోజూ మధ్యాహ్నం వెళ్ళి వొక రెండు గంటలు యింట్లో కూర్చొని వస్తున్నాడు. విమల కడుపుతో ఉందనీ యింట్లో అందరికీ తెలిసిపోయింది. యింట్లో పిల్లలు ఆమెని విసిగిస్తున్నారు వాళ్ళ అల్లరితో. అమ్మ ఆమెని అసలు మంచం దిగనీయటమేలేదు. ఆమె శరీర స్థితి వొక్కొపూట వొక్కో రకంగా ఉంటుంది. ప్రొద్దున్న తను బయలుదేరే టప్పుడు బాగానే ఉంటుంది. మధ్యాహ్నం తిప్పుతుంది కడుపులో అంటూ మొదలు పెడుతుంది. అప్పుడు కూర్చోలేదూ పడుకోలేదు. చాలా ఆరాటంగా కనిపిస్తుంది తను మందుగానీ మాత్రగానీ యిస్తే—అతికష్టంమీద తీసుకుని యింకా తగ్గలేదండీ? అంటూ కొంచెం సేపు ఏడుస్తుంది.

వొక్కోసారి కొంచెం అన్నం తిని ఆ అన్నాన్ని గొంతుకలో వేళ్ళేసి కక్కుకొనే దాకా మోరీదగ్గరే కూర్చుంటుంది. అయినా ఆమెకు తృప్తి కలగదు అలా గొంతుకలో వేళ్ళు ఉంచి ఏదో కడుపులోంచి తీయాలనే బాధ పడుతూంటుంది. ఆమెకు రెండు కంటే ఎక్కువ వాంతులయేయంటే కళ్ళు తిరిగిపోతాయి. కాళ్ళు తేలిపోతాయి—ఆమె, లో బీపీ మనిషి కాబట్టి.

ఆమె బాధ చూడలేక 'విమలా! నీకు యీ ప్రెగ్నెన్సీ వొద్దు, ఎబార్షన్ చేయించేస్తాను' అనేవాడు.

ఆమె ఏడుస్తూ, అంతమాట అనకండి. నాకు యీ ప్రెగ్నెన్సీ కావాలండీ, నేను తల్లిని కావాలి. నాకు నా బాబు అంటూ వొకడు ఉండాలి అనేది.

'విమలా పడే కష్టాలన్నీ పాప కడుపులో ఉండగానే పడుతున్నావు. ఇక పాప పుట్టేంతర్వాత అన్నీ నీకు సుఖాలే' అని సంతోష పెట్టేందుకు ప్రయత్నం చేశాడు తను.

విమలని తను యిద్దరు ముగ్గురు లేడీ డాక్టర్లకు చూపించేడు. యిప్పుడు వాడు తున్న మందులే వాడండి. అవి వాడినా వాంతులు ఆగకుండా అలా అవుతూంటే ఐవీ సలైన్ ఎక్కించుకోవాలి అన్నారు.

ఒక రోజు బెడ్‌కి అతుక్కుపోయే విమల మరో రోజు బెడ్‌మీదే కనిపించేది కాదు. ఇవాళ తిప్పూ వాంతులూ అసలే లేవండీ! చాలా బాగుందండీ! అనేది. ఇంకో రోజు ప్రొద్దున్న బాగున్న విమల మధ్యాహ్నానికి మొహం అంతా పీక్కుపోయి చాలా జాలి గొలిపేటట్టు కన్పించేది. అందుకే మధ్యాహ్నం రాత్రి తనకు యింటికి వెళ్ళి విమలను చూసేదాకా ఆమె గురించే బెంగ.

తన ఆలోచనల్లో తను వుండగా ఇంటి యజమాని నరసింహం డిస్పెన్సరీలోకి వచ్చి 'ఏం బాబూ బాగున్నావా' అంటూ తన వొచ్చినపని శబ్దాలతో చెప్పేడు.

కూర్చోండి అని జేబులో విడిగా పెట్టుకున్న యింటద్దె తాలూకు డబ్బు తీసి అతని చేతిలో పెట్టేడు.

'మా అమ్మాయి కొద్ది రోజులు మందు తీసుకుందిగా, దాని బిల్లు...'

తను ఏలా చెప్పగలడు బిల్లు నేను తీసుకోను అని. రోజూ లలిత వొచ్చి రోజుకో స్టైలంలో బాధ చెప్పి మందు తీసికెళ్ళేది. కాని వెళ్ళడానికి మొదలు ఏవేవో మాట్లాడేది. రోజూ వొక ఆడపిల్ల రోజుకో విధంగా అలంకరించుకొని వస్తే చుట్టు పక్కల వాళ్ళందరి కళ్ళూ డిస్పెన్సరీ మీదే ఉండేవి. దీనికి తోడు సరిగ్గా ఆమె వొచ్చే టైముకి తన క్లినిక్‌కి ఎదురుగుండా యిద్దరు కుర్ర వాళ్ళు నిలబడడం మొదలు పెట్టేరు. తనకు మొదట యిది ఎబ్బెట్టుగా అనిపించింది. ఆమె వొస్తోంది అన్న ఆలోచనే భయాన్ని కల్గించేది. ఆమె వొచ్చినా కుర్చీలో తిన్నగా కూర్చొనేదే కాదు ఏదో మాట్లాడి పైట జారిపడేలా వచ్చేది. అప్పుడు బయట వాళ్ళ కళ్ళు పెద్దవి చేసుకొని చూసేవాళ్ళు. తను యీ పిల్లని ఎంత తొందరగా పంపిద్దామనుకున్నా ఆ పిల్ల కదిలేదే కాదు. ఏదో వొంకన ఉండిపోయేది.

వొక రోజు ఆమె 'డాక్టర్ నేను రోజూ

మా తలకు వొను వ్వాననుకున్నారేమో! మీ మా తలు పండు రోజులవి. యివిగో' అంటూ తను మొదటి రోజు నించీ యిప్పటి వరకు యిచ్చిన మాత్రలు టేబిల్ మీద పోసి 'మీరు నా మనస్సు తెలుసుకోలేదు' అంటూ జాలిగొలిపే స్వరంతో, కళ్ళ నీరు కమ్ముతూంటే అంది.

వస్తూండే ఆ పిల్లని కన్నీళ్లతో చూస్తే బాధ అనిపించింది. తనలో అప్పటి దాకా ఉన్న భయం కరిగి ఆ స్థానంలో ఉదాత్తమయిన వ్యక్తిత్వం పెరగ్గా గంభీర స్వరంతో 'లలితా' అంటూ పిలిచి 'నీది నిప్పయినా గుడ్డిగా ప్రేమించే వయస్సు. ఆ వయస్సులో భావసంచలనము ఉండవచ్చు. ఇప్పుడు దీన్ని ఆదుపులో పెట్టకపోతే జీవితాంతం చాలా బాధ పడతావు. ఈ స్థితి నాకు తెలుసు, నేనూ అదే స్థితిలో నీ వయస్సులో పయనించిన వాడ్నే. యీ స్థితి నుండి ప్రతీ ఆడపిల్లా మొగపిల్లవాడూ తట్టుకోగలిగితే జీవితాంతం దిగులుతో క్రుంగిపోకుండా ఉండగలరు. నువ్వు యీ ఉద్రేకం చల్లారింతర్వాత నా బలహీన క్షణాల్ని అతను వాడుకున్నాడు—అంటూ మనుషుల మీద నమ్మకం పోయి ఆ స్థానంలో కసి పెంచుకుంటావు. అప్పుడు నువ్వు ఎవర్నీ ప్రేమించలేవు. నీ భవిష్యత్తు పచ్చగా పువ్వులా ఉండాలని కోరే వాడ్ని. అందుకే అమ్మా నీకు నచ్చచెప్పేది' అంటూ బోధించేడు.

లలిత రక్తహీనమైన ముఖంతో తనకు జరిగింది మంచో చెడో కూడా తెలియని అవస్థలో వెళ్ళిపోయింది.

తర్వాత తనకు కనిపించవయినా కనిపించలేదు.

ఇప్పుడు నరసింహంగారు బిల్ తీసుకోమంటూంటే తను ఎలా చెప్పగలడు బిల్ తీసుకోలేననీ, మీ అమ్మాయి మాత్రలు అన్నీ తిరిగియిచ్చిందనీ. అందుకే యింకా బిల్లు చూడలేదు, చూసి పంపిస్తాను అన్నాడు.

'సరే' అంటూ నరసింహం వెళ్ళిపోయేడు.

తర్వాత పేషంట్లు వొకళ్ళ తర్వాత మరొకళ్ళు మెల్లిగా వాళ్ళకు తోచినవిధంగా దాపోగేరు.

రామారావుకు తన మీద గురి కల్గి వుంది. వారం వారం వొచ్చి బ్లడ్ ప్రెషర్ కట్టి చూపించుకుని యివీ అవీ మాట్లాడి వెళ పోతూండే వాడు. ఏ వేళ అయితే యిక చెప్పక్కరలేదు. మూడు రోజులకో నాల్గు రోజులకో వొకసారి వచ్చి చేయి చూడమనే వాడు. నాకు చేయి చూడడం రాదయ్యా అంటే 'యింకా రానంటే ఎట్లా? డాక్టరు వయిపోయేవ్!, చోద్యం కట్టేసేవ్! ఇక నీవు అన్నీ చూడాలి' అని బలవంతంగా తన చేత అతని నాడిని పట్టించి వొక అయిదు రూపాయలు టేబుల్ మీద పెట్టేవాడు.

'మీరు ప్రతి మూడు రోజులకూ అయిదు యివ్వడం ఏంటి? నేను మీకు ఏమీ చెయ్యటం లేదే' అనేవాడు తను.

'అందుకేనయ్యా! నీకు డబ్బిచ్చేది. మీ డాక్టర్లు యీ మందూ ఆ మందూ వాడి పేషంటు వొళ్ళు చెడగొట్టేసే దానికంటే, మిమ్మల్ని దూరంగా ఉంచేందుకు-ఫీజు కట్టకుంటే, శరీరం బాగుపడక పోయినా చెడిపోదు' అంటూ నవ్వుతూ అనేవాడు.


అతను కనీసం రెండు రోజులకొక కొత్త పేషంటుని పంపించేవాడు. ఇక నరహరి చెప్పనే అక్కరలేదు. రోజు కొకసారైనా రాకుండా పోడు. అతను ఎవరినో వొకర్ని పంపించేందుకు ప్రయత్నించేవాడు. అతను పంపించినవాడు వచ్చేడా లేదా అన్న ఆరా తన దగ్గరకు వచ్చి తీసేవాడు. వచ్చినప్పుడల్లా, వొట్టి చేతులతో వెళ్లేవాడు కాదు. ఏ బిళ్లో, లేకపోతే ఆఖరికి యింత కార్బ పేటివ్ మిక్చరో పట్టుకొనెళ్ళేవాడు.

తనకు రోజుకి అయిదో ఆరో కేసులు వస్తాయి. అందులో సగభాగం డాక్టరు గారూ! జీతం వొచ్చిం తర్వాత డబ్బు యిస్తాం అనేవాళ్ళు. వొక్కొక్కరికి వొక్కో రోజు జీతం వొచ్చేలా ఉంది. కొందరు ఫస్టు అంటారు. కొందరు పదో తారీకు వాళ్ళ జీతం అంటారు. కొందరు యిరవై వొకటి అంటారు.

తనకి వీళ్ళని చూస్తే అనిపిస్తూ ఉంటుంది. డిస్పెన్సరీలో మొదటిసారి కాలు పెట్టినవాడికి కూడా డాక్టరు మొఖం చూడగానే రాసుకోండి జీతాలకు యిస్తాం అని అనాలనిపిస్తుందేమో! వీలుపడదు అంటే ముఖం చాలా అసహ్యంగా పెడ్తారు. కొంత మంది అసహ్యంగా 'మేము యీ వీధిలోనే ఉన్నాం. ఈ డబ్బు తీసుకొని పారిపోతాం అనుకున్నావా? అంత అనుమానమైతే ఇల్లు వొచ్చి చూసుకో' అనేవాళ్ళు.

తనకు వాళ్ళతో వాదన పెట్టుకోవాలన్నా ప్రతిసారీ లేదు అని చెప్పాలన్నా చాలా యిబ్బంది అనిపిస్తుంది.

మరో రకం వాళ్ళున్నారు! వాళ్ళు ఫీజు పూర్తిగా యివ్వరు. సగం యిచ్చి మిగతాది రేపు అంటారు. మర్నాడు నిన్నటి సగం యిచ్చి, ఆ రోజు పూర్తి డబ్బు రేపు అంటారు. ఆ రేపు వాళ్ళు అసలికె కనపడరు. తను వాళ్ళని జ్ఞాపకం పెట్టుకుని ఎప్పుడైనా వాళ్ళు వచ్చినప్పుడు



ప్రాక్టీసు పెట్టిచూడు

అడిగితే 'డాక్టరుగారూ నేను యిచ్చేలేగా! ఇచ్చేసేను అనుకున్నావే!' అని 'పోయినసారిదీ యీ సారిదీ రేపు తెచ్చి యిస్తాను' అంటూ మందు పుచ్చుకు పోయేవాళ్ళు.

ఇంకొందరు పరీక్ష చేయించుకుని 'మందులు బయటవి రాసియిచ్చేయ్' అనే వాళ్ళు.

యీ ప్రాక్టీసు అన్నది మరో ప్రపంచం. ఇందులో రకరకాల అనుభవాలు.

'నమస్కారం డాక్టరుగారూ!' అంటూ నరహరి ప్రవేశించేడు. అతనితో పాటె పదమూడేళ్ళ కుర్రాడు ఉన్నాడు.

నరహరి కుర్చీలో కూర్చుంటూ, 'డాక్టరు గారూ వీడు నా మనవడండీ! పేరు రవి, స్కూలు విడిచేసేడు, ఎప్పుడూ రోడ్లమీదే తిరగడం. వెధవలతో కలిసి పూర్తిగా చెడిపోతున్నాడు. మీ దగ్గర గట్టిగా కూర్చోపెడితే కాని దారికిరాడు. మీరు మీ దగ్గర ఉంచుకోండి. మీకు చిన్న పనులు చేసి పెడతాడు. నేర్పిస్తే మాత్రలు కూడా కట్టియిస్తాడు' అంటూ ఆగి తన ముఖంలోకి చూసేడు.

తను నోరు తెరవనీయకుండా 'డాక్టరూ! జీతం అవసరంలేదని మాత్రం చెప్పకు. అది నీ అవసరం కాదు, మా అవసరం. నీవు వీడికి డబ్బు ఏం యివ్వొద్దు. వొక్కపూట భోజనం పెట్టుకుంటే చాలు. నా మాట వినేటట్టు నమ్మకంపోతే నేను వాళ్ళ నాన్నకు మాట యిచ్చేసేను.' అంటూ తన జవాబుకి ఎదురు చూడకుండా 'రోజూ ఉదయం తొమ్మిదింటికి వొచ్చి పన్నెండు దాకా ఉంటాడు. తిరిగి సాయంత్రం నాలుగునించి తొమ్మిది దాకా. యీ మధ్యలో డాక్టరు బాబు చెప్పిన పని చేస్తూంటాడు' అంటూ 'డాక్టర్ కొంచెం పని తొందరగా ఉంది — ఏదైనా మాత్ర' తను మాత్ర ఇవ్వగానే వెళ్ళిపోయేడు నరహరి.

తను రవిని చూసేడు. [illegible] విక్కారూ. గిల్ల చొక్కా, మీద వంకీలు తిరిగిన జుత్తులో స్టైలుగా [illegible]. కళ్ళతో తన్ని కొద్దిగా భయంగా చూస్తున్న రవిని 'స్టూలుమీద కూర్చో' అన్నాడు.

* * *

రోజులు గడుస్తున్నకొద్దీ రవి చాలా

ఉపయోగంగా ఉన్నాయి. అతను తనకంటే ముందలేవచ్చి డిస్పెన్సరీ తీసి క్లినిక్ తుడిచి సిరింజీలు ఉడకబెట్టి ఉంచేవాడు.

అతను చాలా మటుకు తనదగ్గరికి వొచ్చే పేషంట్లని అందర్నీ గుర్తు పట్టేవాడు ప్రతివాడి గురించి తను అడగకుండానే చెప్పేవాడు.

రవి తన దగ్గరకు వొచ్చిన వారం రోజులకి, పేషంట్లు ఎవ్వరూ లేని సమయంలో తను అన్నాడు, యికనించీ రోజూ ట్యూషన్ చెప్తాను అంటూ. చదువు అంటే ముఖం ఎలానో పెట్టుకున్నాడు రవి కాని తను చిన్నచిన్న కథల పుస్తకాలు యిచ్చి వాటిని ఎలా చదవాలో చెబుతూ ఉంటే అతనికి చదువు గురించి అభిప్రాయం మారినట్టుంది. ఎవ్వరూ లేనప్పుడు ట్యూషన్ టైంపాస్ బాగుంది తనకూ రవికి

రోజులు దొర్లి మరో నెల గడిచిపోయింది యీ నెలలో విమల శారీరకంగా యింకా చిక్కిపోయింది. ఆమె వొక్క లిక్విడ్ డైట్ మీదే ఉంటూంది. రెండు నెలల్లో పదిహేను పౌనులు తగ్గింది. మరీ లావుగా లేకపోయినా కొద్దిగా పుష్టిగా ఉండే విమల యీ వాంతులతో పుల్లలాగ అయినా, ఆమె ముఖం మాత్రం క్రొత్త కళతో వెలిగిపోయేది.

రెండో నెలకు రెండు రోజులముందే తన కలెక్షను ఎంత ఉందో చూసుకున్నాడు. యీ నెల అన్ని ఖర్చులూ పోను నూరు రూపాయలు మిగులుతుంది. తండ్రికి యీ వంద, దీనికి మరొక మూడొందలూ కలిపి యింటి ఖర్చుకు అంటూ యివ్వాలి ఎక్కడనించి తేవాలి తను మూడువందలూ? పోయినసారి హరనాధ్ యిచ్చేడు.

యీసారి. యిలా వొక్కసారి కాదు ప్రతీ నెలా తన ప్రాక్టీస్ యింప్రూవ్ అయేదాకా ఏదో చేయాలి. తను ఏం చేయలేడు వొక్కటితప్ప.

(ఇంకా వుంది.)

వనితలకు మనవి

కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలు —సం.

'విషాద' పట్టణం–గీతాలు

ఇక్కడ ప్రతిరోజూ
అంగీకారం కాటువేస్తుంది
గౌరవం దుస్తుల మీద మరక పడుతుంది
వీధివీధినా వెలసిన బ్రాకెట్ బడ్డీల్లో
సందుసందునా డాక్టర్ల మాల్ ప్రాక్టీస్!

* * *

సకల దుర్గంధాలతో పట్టణం గాలి
తగిలీతగలగానే పాపం సముద్రం
వెనక్కి పారిపోతుంది భోరుమంటూ!
పట్నం పాచినిండా రెల్లిభాష...
దాని ఒంటినిండా ప్రభుత్వసారావాసన!
దానితలలో బుఃతువులురాల్చేకుళ్ళినపళ్ళు!!

* * *

యూనివర్సిటీనిండా సూటు వేసుకున్న
ఊసరవెల్లులు
గంగాభాగీరథీ సమానులైన విద్యార్థి కార్మ
దాక్షీకం తప్ప విజ్ఞానం పెరగని
బట్టతలలు...
బట్టతలల పసరిక పాములు–
విద్యకి విప్లవానికీ పౌరోహిత్యులు!

* * *

నిరంతర జాగృతదీపస్తంభం
ప్రదర్శించే నిర్వేదన
నితాంతం
నగరం నరాలలో కదలాడే ఆవేదన...
విషాదపట్నణ విశాల గాథా శోధన!

— *శశికాంత్ శాతకర్ణి.*

వేగంగా చదవటం

మానవుడు చేసే అద్భుతపు ప్రక్రియలలో వేగంగా చదవడం ఒకటి. కొంతమంది అద్భుతమైన వేగంతో చదవగలరు. వేగంగా చదవడంలోగల యిమిడిఉన్న రహస్యాన్ని యింత వరకు శాస్త్రజ్ఞులు కనుక్కోలేకపోయారు. అంతే కాక ఎప్పుడు యీ ప్రక్రియ అర్థమవుతుందో చెప్పలేకపోతున్నారు. చదవటంలో వివిధ దశలున్నాయి. ఒక్కొక్క దశకు సెకనులో వెయ్యో వంతు మాత్రమే పడుతుంది. వేగంగా చదవగలగడంలోగల రహస్యం అర్థమయితే, అది మనస్సులో ఎక్కువ కాలం నిలిచి ఉండటానికి కూడా వినియోగించవచ్చునని మనస్తత్వశాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇటీవల పశ్చిమ జర్మనీలో జరిగిన మనస్తత్వ శాస్త్రవేత్తల సమావేశంలో పై విషయాన్ని చర్చించారు.

మధ్యప్రదేశ్‌లో మరో ఖజురహో




ఖజురహోని పోలిన శిల్ప విన్యాసం

శిథిలమైపోతున్న శిలా సంపద!

భోరమ్‌దేవ్ మహారాజు సంతానం కోసమూ, వారి వంశానికి చెందినవారు ఆరాధించుకోడానికి ఈ మందిరాన్ని కట్టించాడట. ఇది ఈశ్వరాలయం. ఈశ్వరానుగ్రహంవలనే ఆ రాజుగారికి సంతాన ప్రాప్తి కలిగిందని తెలుస్తోంది క్రమంగా ఆలయం పేరు ఆ రాజుగారి పేరుతోనే ప్రసిద్ధి చెందింది.


గర్భ గుడిలో ఈశ్వరుడు, పార్వతి విగ్రహాలు, ఈశ్వరలింగంతోపాటు భోరమ్‌దేవ్ రాజు, రాణి, వినాయకుడు, శక్తి మొదలయిన రాతి శిల్పాలు ఉన్నాయి.



"భోరమ్ మందిరం" ఒక ప్రక్కనుంచి చూస్తే....

భోరమ్‌దేవ మందిరం సుమారు 800 సం॥ల పూర్వం నిర్మితమైంది. మధ్యప్రదేశ్‌లో దుర్గ జిల్లా, కవర్ధా తహసీలులో, కవర్ధా నగరానికి పశ్చిమంగా 16 కి॥ మీ॥, బోండలాకి దక్షిణంగా 9 కి॥ మీ॥ దూరంలో ఉంది దగ్గరలో 'ఛపిరా' అనే చిన్న గ్రామం కూడా ఉంది

''ఛత్తీస్ గడ్‌కే ఖజూరాహో'' అని భోరమ్‌దేవ్ మందిరం ప్రసిద్ధికెక్కింది




మధ్యప్రదేశ్‌లో మరో ఖజురహో

ఆలయానికి ఎదురుగా మూడు కొండలమధ్య ఒక కొలను ఉంది ఈ నీటిని సేద్యానికి వాడుకుంటూ చుట్టుప్రక్కల గ్రామాలు సస్యశ్యామల మవుతున్నాయి

నాగపూర్ – దుర్గ్ మార్గంలో గల రాజనందగాంవ్‌లో బయలుదేరి, సుమారు మూడు గంటలలో ఈ ప్రాంతమంతా చూసి, ఇంటికి చేరుకోవచ్చు.

*

"దారు శిల్పమా ?" అన్నట్లున్న శిల్ప చాతుర్యం



ఎటు చూసినా శిల్ప నైపుణ్యమే !



మందిరానికి చుట్టూ ఎన్నో నల్లని శిలలపై అనేక విగ్రహాలు తగిన రక్షణ లేక ఎండకు ఎండి వానకు తడుస్తూ, విరిగినవి విరిగి, మిగిలినవి శిథిలాలుగాపడి ఉన్నాయి.


గర్భగుడిలో ప్రవేశానికి మూడువైపులనుంచి ద్వారాలున్నాయి. ఆలయ గోపురంమీద, గోడలమీద అన్ని వైపులా రమణీయమైన శిల్ప కళాఖండాలు, స్త్రీ పురుషుల శృంగారం వివిధ భంగిమలలో రాళ్ళపై గోపురంచుట్టూ ఉన్నాయి. కొయ్యమీద నగిషీలు చెక్కినట్లు అనేక శిల్పాలు రాళ్ళపై మలిచి ఉన్నాయి. [''ఖజూరాహో'' మాదిరి]

పాతుడుకట్టి, గోడలు, గోపురం సం॥లు గడుస్తున్నకొద్దీ శిథిలావస్థకు వస్తున్నాయి

వివరాలు . ద్రాక్షవఝల రామకృష్ణారావు
ఫొటోలు కె వి. ఎల్ ఎస్ రావు



'ఆడవాళ్లూ! మీకు జోహార్' లో కృష్ణంరాజు







'శివమెత్తిన సత్యం'లో జయసుధ

సినిమా విశేషాలు

-జి. వి. జి.

మంగళగౌరిలో మూగ గౌరి

వికసించిన ముఖంతో పెళ్ళిబొట్టుతో తులసి పూజ చేసుకుంటూన్న గౌరి (శారద)ని చూసేసరికి జానకిరామయ్య (హేమసుందర్)లో బాధ మరింత ఎక్కువైంది. తండ్రి రాకను గమనించిన గౌరి సిగ్గుతో తలవంచుకుంది. ఆమె బుగ్గనున్న చుక్కను చెరిపేసిన తండ్రి కళ్ళల్లోకి దిగ్భ్రమతో చూసింది. కళ్ళు చెమ్మగిల్లడం చూసి ఆయన భుజాలు కంగారుగా కుదుపుతూ ఏమైందన్నట్టు సైగ చేసింది.

''ఏమని చెప్పనమ్మా? ఎలా చెప్పను? నీ తండ్రి అసమర్థుడని చెప్పనా? నీ నుదుట కల్యాణగీత లేదని చెప్పనా? ఏ జన్మలోనో నే చేసిన పాపం ఈ రూపంలో నన్ను శిక్షిస్తోందే, ఆనందంగా అనుభవించమని చెప్పనా? అభం శుభం తెలియని నీ కన్నెమనసులో లేనిపోని ఆశలు లేపి, ఇప్పుడవన్నీ భ్రమలని చెప్పనా? నీ పెదవులపై చిరునవ్వు, నీ మనసుకు ఆనందం, నీ వయసుకు పరమార్థం -- ఇవేవీ నీకు లేవు ... లేవు ... లేవని కన్నతండ్రిగా నేనెలా చెప్పగలను? ఎలా చెప్పగలనమ్మా?''

తండ్రి గోడు అర్థంకాని గౌరి ఏమిటన్నట్టు మళ్ళీ సైగ చేస్తూ అడిగింది. ఆయన కూడా సైగలు చేస్తూనే ''నీకు . పెళ్ళి . . జరగటం లేదమ్మా!'' అన్నాడు. గౌరి కనుకొలకుల నీటి బిందువులు ఉద్భవించడం చూసి, ''అవునమ్మా అవును. ఈ మాట చెప్పే ఈ నోరు పడిపోవాలను! నీ బుగ్గనున్న చుక్క చెరిపేసిన ఈ చెయ్యి విరిగిపోవాలను. ఆడపిల్ల కనీసపు కోర్కె తీర్చలేని ఈ శరీరం వాడి, మసై పోవాలను. 'నువ్వు ఒక తండ్రివేనా?' అని నా ముఖాన ఉమ్మెయ్యమ్మా! నీ మనసు చల్లబడేవరకు శపించు. ఆనందంగా అనుభవిస్తాను,'' అంటూ విలపిస్తున్న తండ్రి కంటతడిని చీరచెంగుతో తుడిచి, చిరునవ్వుతో అనునయించింది గౌరి.

ఆమె మూగే కాక చెముడు కూడా వుందని తెలియజేశారు డైరెక్టర్ గిరిధర్. వి నాగేశ్వరరావు, ఎం. నరసింహారావు నిర్మించే శ్రీ స్వామి అయ్యప్ప పిక్చర్స్ ''మంగళగౌరి'' వర్ణచిత్రంలో మురళీమోహన్ హీరో. వేటూరి సంభాషణలకర్త. సంగీతం, శిల్పం, ఛాయలను చక్రవర్తి, కొండపనేని రామలింగేశ్వరరావు, పుష్పాల గోపీకృష్ణ నిర్వహిస్తున్నారు.


"ఒక్క రూపాయి"

'తెలుగులో తొలిసారిగా స్టీరియో రికార్డింగ్ జరుపుకున్న ఖ్యాతి మాదే,'' అన్నారు సమ్రాట్ ప్రతాపరుద్ర ప్రొడక్షన్స్ అధినేత కె మోహనరావు. వీరి ''ఒక్క రూపాయి'' వర్ణచిత్రానికి నవంబర్ 22న అరుణాచలం స్టూడియోలో పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది. ఈ రికార్డింగ్ థియేటర్ ఇప్పుడు గాయకుడు జేసుదాసు ఆధ్వర్యంలో ''తరంగిణి'' పేరున నిర్వహించబడుతోంది. రామకృష్ణ, జి ఆనంద్, బి. వసంత పాడిన ఆరు పాటలను ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం నిర్వహించే వనం మధుసూదనరావు రాశారు. బి. వసంతా సుధాకర్ సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. వి కేదారీశ్వర్ నిర్మాణ సారథ్యంతోపాటు సహదర్శకత్వమూ వహిస్తున్నారు. పి. లక్ష్మణ్ ఛాయ, ఎం రంగారావు శిల్పం, సురేందర్‌నాథ్ రెడ్డి కూర్పు, యుగంధర శర్మ సహకార దర్శకత్వం నిర్వహిస్తారు. డిసెంబర్ చివరి వారంలో అన్నపూర్ణ స్టూడియోలో షూటింగ్ మొదలవుతుంది.

శివరంజని స్వర్ణోత్సవం

దాసరి నారాయణరావు చిత్రం ''శివరంజని'' పొరుగు రాష్ట్రంలో యాభై వారాలు దాటి ప్రదర్శింపబడడం గర్వించవలసిన విషయం. ఆశించినంతమేరకు ఆంధ్ర ప్రేక్షకుల ఆదరణ లభించని ఈ చిత్రం కర్నాటక రాష్ట్రంలో ఇంతటి ఘనతను సాధించింది. నవంబర్ 29న బెంగళూరు కావేరీ థియేటర్‌లో ఎన్. టి. ఆర్ అధ్యక్షతన ఈ వేడుకలు భారీయెత్తున జరిగాయి. కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఎ. ఎన్ ఆర్ మెమెంటోలను అందజేశారు. చలన చిత్ర కళకు భాషాభేదాలు అడ్డుగోడగా వుండరాదని సుప్రసిద్ధ దర్శకుడు పుట్టన్న ఉద్ఘాటించారు.

'అక్క' లో నూతన్‌ప్రసాద్





'ఛాలెంజ్ రాముడు'లో ఎన్.టి.ఆర్.

"శంకరాభరణం"లో స్వర సంకరంపై ఆగ్రహం చెందిన శంకరశాస్త్రి

ఆ కాలంలో శాస్త్రి గారికున్న కీర్తి వర్ణనాతీతం. శంకరాభరణం శంకర శాస్త్రి (జె. వి. సోమయాజులు) అంటే దేశం నాలుగు చెరగులా తెలియనివాళ్ళు లేరు రేడియోల్లోనూ, గ్రామఫోన్ రికార్డుల్లోనూ ఆయన పాటలూ, కీర్తనలే పదే పదే వినేవారు

కాలం మారిపోయింది. శంకరశాస్త్రిని మర్చిపోయింది దేశం. ఈ తరంవారికి శాస్త్రి పాటలు నచ్చక — ఆయన పాడిన గ్రామఫోన్ రికార్డులను యాష్‌ట్రేలుగానూ, గోడలకు అందంగా వాడే గుండ్రటి పెయింటింగ్‌లగానూ మారుస్తూ, శాస్త్రిని చాలా బీదవాడ్ని చేశారు ఆయన కూతురు శారద (రాజ్యలక్ష్మి) ఆయన చిరకాలమిత్రుడు మాధవయ్య ఆ రోజు ఒక పెళ్ళి సంబంధం తీసుకొచ్చాడు పెళ్ళికొడుకు పేరు కామేశ్వరరావు (చంద్రమోహన్)

పెళ్ళిచూపుల తంతులో కామేశ్వరరావు బామ్మ "ఒక్క పాట పాడతావామ్మా?" అని అడిగింది శారదను

సినిమా

శారద పాడనా అన్నట్టు తండ్రివంక ప్రశ్నార్థకంగా చూసింది. ఆయన మౌనంగా అనుమతించాక తంబుర తీసుకొని, "సామజవరగమనా" కీర్తనను మృదుమధురంగా అందుకుంది శారద ఆమె ఊహలు ఎటెటో ఎగ్గుకుంటూ వెళ్ళాయి మైమరచి పాడుతూ, స్వరం తప్పింది

శాస్త్రి ఆవేశం పట్టలేక "శారదా! నువ్వు పాడుతున్న రాగమేమిటి? అంటున్న ఆ స్వరమేమిటి? చెప్పు! హిందోళానికి ఆరోహణేమిటి?" అన్నాడు తీక్షణంగా

"స గ మ ద ని స" బెదిరిపోతూనే అంది శారద.

"అవరోహణ?"

"స ని ద మ గ స."

"మరి, ఆ రిషభం ఎక్కడ్నుంచి వచ్చిందే, పాపిష్టిదానా! స్వరసంకరం చెయ్యడానికి బుద్ధి లేదూ?"

శారద చిన్నపాపలా ఏడ్వడం మొదలెట్టింది ఆమెను లోనికి తీసుకెళ్ళారంతా. అక్కడి పరిస్థితిని కాస్త చక్కబరుద్దామని కొద్దిగా సంగీత పరిజ్ఞానమున్న పెళ్ళికొడుకు కామేశ్వరరావు "నిజమేలెండి. హిందోళంలో వృషభం పడితే.." అని చెప్పబోతూండగా శాస్త్రి మళ్ళీ ఆగ్రహంతో "ఏమిటదీ? వృషభమా, రిషభమా?" అని గర్జించాడు.

"రిషభమే—రిషభమేనండీ ఏదో పొరపాటున అన్నాను రిషభం పడితే. మరి హిందోళం కాదు కదా — చారుకేశి అవుతుంది," అంటూ కామేశ్వరరావు సమర్థించబోయాడు

"చారుకేశా?"

"కాదండి. చారుకేశి కాదు ఆఁ.. కాపీ కాపీ అవుతుంది."


"నువ్వెక్కడ్నుంచి లే ముందు! రిషభం అన్న మాట పలకడం చేతకానివాడివి — సంగీతం గురించి మాట్లాడ్డానికి నీకేం అర్హతుందయ్యా? తెలిస్తే తెలిసినట్టుండాలి లేదా — నోరు మూసుకు పడుండాలి," అని శాస్త్రి అరవడంతో కామేశ్వరరావు నిర్ఘాంతపోయాడు.

కె విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో ఏడిద నాగేశ్వరరావు, ఆకాశం శ్రీరాములు నిర్మించిన పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ "శంకరాభరణం" వర్ణాల చిత్రంలో అల్లు రామలింగయ్య, నిర్మల, భార్గవి, పుష్పకుమారి, సాక్షి రంగారావు ఇతర ముఖ్య పాత్రధారులు

"సీతారాములు"

దాసరి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించే జయకృష్ణా మూవీస్ "సీతారాములు" వర్ణాల చిత్రం హీరో కృష్ణంరాజు సమర్పణ. ఆయనతోపాటు సుజాత, సావిత్రి, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, మోహన్‌బాబు, రమాప్రభ, జయమాలిని - పాత్రధారులు సత్యం సంగీత దర్శకుడు వి. ఎస్. ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు "ఇదొక ప్రయోజనాత్మక చిత్రం. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో విశాఖపట్నం పరిసర ప్రాంతాలలో చిత్రీకరణ పూర్తవుతుంది," అన్నారు నిర్మాత జయకృష్ణ

'త్రిలోక సుందరి'లో మోహన్‌బాబు




జగన్మాతా ఆర్ట్స్
శ్రీవినాయక విజయము
దర్శకత్వం
కమలాకర కామేశ్వరరావు
నిర్మాత
జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి
సహనిర్మాతలు:
ఎన్.ఎన్.స్వామి, పిఠాంబాబు
కథ-నిర్వహణ:
బోణం ఆంజనేయులు
లక్ష్మీచిత్ర శ్రీలక్ష్మీచిత్ర
సీడెడ్: ద్వారకా ఫిలింస్
కర్ణాటక: అనంత్ మూవీస్
SREE PUBS

"వెయ్యిళ్ళ పూజారి"

''మళ్ళీ మీరు తెరముందు కనిపించేది ఎప్పుడు ?'' అన్నాను దాసరితో.

''త్వరలోనే మా తారక ప్రభు ఫిల్మ్స్ నిర్మించే 'వెయ్యిళ్ళ పూజారి'లో నటించబోతున్నాను,'' అన్నారాయన కథ, స్క్రీన్‌ప్లే; మాటలు రాసి, దర్శకత్వం వహిస్తారాయన రమేష్ నాయుడు, కె ఎస్ మణి, బాలు, వాస్కరరాజు, బోసుబాబు తెరవెనుక కృషి చేస్తారు

బాపినీడు నేతృత్వంలో భోట్టు – కాటుక

''మీరు ప్రేక్షకులకు తలా ఒక జేబురుమాలు సప్లయ్ చేయాలి,'' అంది రోజారమణి ఛేంబర్స్ థియేటర్‌లో ''బొట్టు – కాటుక'' చిత్రం చూశాక విజయబాపినీడును మనసారా అభినందిస్తూ ''ఒకటి కాదు, రెండు సప్లయ్ చేస్తే మంచిది,'' అన్నాను నేను. ఎందుకని అడిగారు బాపినీడు ''ఒక కంట ఆనందబాష్పాలు, మరో కంట దుఃఖాశ్రువులు తుడుచుకోడానికి,'' అన్నాను నేను ఇందులో అతిశయోక్తి ఏమీలేదు ''బొట్టు — కాటుక'' ఓ వినూత్నమైన ఇతివృత్తం హృదయాల్ని కదిలించివేసే సన్నివేశాలతోపాటు రిలీఫ్ కోసం గిలిగింతలు పెట్టే హాస్యం పెనవేసుకొని ఉండడంవల్ల కథ ఎంతో ఉత్సుకత కలిగించే రీతిలో చకచక సాగిపోతుంది హాస్య (హస్వ) నటుడు వీరయ్యచేత సైతం సున్నితమైన హాస్యాన్ని అందింపచేశారు శ్రీధర్, మురళీమోహన్, ఛవీ, జయంతి, నిర్మల, మాధవి, బేబీగౌరి, పి. ఆర్ వరలక్ష్మి పోటీలుపడి నటించారు బ్లాక్‌మెయిలర్‌గా నూతన్‌ప్రసాద్ ప్రేక్షకుల కరఘోష అందుకునే విధంగా నటించారు జంధ్యాల, చక్రవర్తి, వేటూరి, జాలాది, ఉత్పల, జి. కె. రాము, మారపనేని కళాధర్, సత్యం తమ ప్రతిభా విశేషాలను చూపించారు ఈ చిత్రంతో దుర్గా నాగేశ్వరరావు అగ్రశ్రేణి దర్శకుల జాబితాలో స్థిరపడినట్లే. ఆయన గురువులు గర్వపడేలా ఈ చిత్రాన్ని ఆద్యంతం రసవత్తరంగా రూపొందించారు

''ఇప్పుడు ఎన్నికల సంరంభంలో బిజీగా ఉంటారుగాని, మన రాష్ట్రపతికి ఈ చిత్రాన్ని చూపిస్తే బావుంటుంది,'' అన్నాను బాపినీడుతో. ఎందుకలా అన్నానో ఈ చిత్రం చూసిన వారికి తెలుస్తుంది.

మాగంటి రవీంద్రనాథచౌదరి ఈ చిత్ర నిర్మాత

రిజిస్టర్ చేయబడిన కొత్త చిత్రాల పేర్లు

అరుణోదయ డ్రమెటిక్ పిక్చర్స్ ''జమీందార్ జగ్గారావు'', ప్రతిమ ఆర్ట్స్ ''దేవుడులేని దేవాలయం'', లావణ్య కంబైన్స్ ''లేచింది మహిళాలోకం'', మంజు ఫిలిమ్స్ ''నమ్మలేని నిజాలు'', మురళీకృష్ణా మూవీస్ ''కాలేజ్ చదువు'', శ్రీ గిరి ఎంటర్‌ప్రైసెస్ ''పాపాయమ్మ'', విశ్వతేజ ఫిలిమ్స్ ''ఈ ప్రశ్నకు బదులేది ?'', జి. వి. కె. ప్రొడక్షన్స్ ''రౌడీ మామూలు'', ప్రేమాలయా వారి ''ఆకలి రాజ్యం'', మారుతీ ప్రొడక్షన్స్ ''పైలాపచ్చీసు'', వెంకటేశ్ ఎంటర్‌ప్రైసెస్ ''దారి తప్పిన తండ్రి'', యు ఎం. ప్రొడక్షన్స్ ''శ్రీదేవి'', భార్గవ ఆర్ట్ క్రియేషన్స్ ''చిత్రలేఖ'', ఎస్. బి. ఎస్. ఆర్ట్ పిక్చర్స్ ''డేరింగ్ హీరో కృష్ణ'', శ్రీ రామదూత ప్రొడక్షన్స్ ''దశపురుషుడు'', శ్రీ వాణీ వరలక్ష్మి కంబైన్స్ ''మేనరికం'', శ్రీ సాయిరాం పిక్చర్స్ ''చుక్కలూరు చుక్కమ్మ'', టి. వి ఫిలిమ్స్ ''గుండెల్లో నిద్రపోతా'', శ్రీ సూర్య చంద్ర పిక్చర్స్ ''విలాసవంతుడు'', బి. ఎ ఎస్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ''సినిమాలో సినిమా'', శోభ చిత్ర ''మంచు మండింది'', ఆనంద్ సినీ ఎంటర్‌ప్రైసెస్ ''పతిత'', ఎం ఆర్. మూవీస్ ''పట్టభద్రుడు'', గుప్తా ఫిలిమ్స్ ''శభాష్ మారుతి'', శ్రీ నాగలీలా ఆర్ట్ క్రియేషన్స్ ''తాతలనాటి తగాదాలు'', శ్రీ శక్తి ఇంటర్నేషనల్ ''రంగురంగుల బొమ్మలు'', శ్రీ ఉమాభాస్కర్ ప్రొడక్షన్స్ ''తారకరాముడు'', శ్రీ చరిత చిత్ర ''దొంగ'', శ్రీ కాంతి చిత్ర ''కేడీరాముడు'', శ్రీ అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైసెస్ ''వేషగాడు'', రాజలలితా పిక్చర్స్ ''హృదయమున్న మనిషి''

మరికొన్ని కొత్త చిత్రాల పేర్లు వచ్చే సంచికలో తెలియజేస్తాను.





పైన 'గురు'లో కమలహాసన్, శ్రీదేవి

దిగువ : 'కొత్తపేట రౌడీ'లో ఒక దృశ్యం



daCunha GCM-16 TL

రాహువు – కేతువు

"కృష్ణవేణీ నదీ తీరాన డిసెంబర్ 10 న షూటింగ్ ప్రారంభిస్తున్నాం. జనవరి 10 కల్లా పూర్తవుతుంది," అన్నారు బాలాజీ ఆర్ట్స్ "రాహువు–కేతువు" వన్నెల చిత్రాన్ని సమర్పించే పింజల సుబ్బారావు. "రాహువుగా రావుగోపాలరావు, కేతువుగా నూతన్‌ప్రసాద్, శనిగా అల్లు రామలింగయ్య నటిస్తారు," అన్నారు ఈ చిత్ర దర్శకుడు, రచయిత పేరాల సుబ్రహ్మణ్యం. హలం, ధనశ్రీ కూడా రెండు విశిష్టమైన పాత్రలను ధరిస్తారట. పి. ఎస్. ప్రకాశ్ ఛాయాగ్రాహకుడు. సత్యం స్వరకల్పనలో సి. నారాయణరెడ్డి, కొసరాజు గీతాలు రాశారు. సి. బాలాజీ నిర్మాత.

సినిమా

సినిమా ప్రభావం !

సినిమాలను యువతరం అనుసరించడం ఎంత ఘోరానికి దారి తీస్తుందో – ఇటీవల జరిగిన ఒక సంఘటన రూఢి చేస్తోంది. సెక్స్, హింసాకాండ సన్నివేశాలున్న "శిగప్పు రోజాగళ్" (ఎర్ర గులాబీలు) తమిళ చిత్రంలో కామప్రకోపం గల నాయకుడుగా నటించిన కమలహాసన్ కొందరు యువతులపై అత్యాచారంచేసి చివరికి హతమార్చే సంఘటలున్నాయి. ఇదేవిధంగా ఇటీవల బెంగళూరులో ఇద్దరు బాలికలు హతమార్చబడ్డారు. ఇద్దరూ బడిలో చదువుకునే అమ్మాయిలే. అయిదేళ్ళ వసంత బడికి బయలుదేరినదల్లా ఆ సాయంత్రం ఇంటికి చేరుకోలేదు. ఆ రాత్రి ఆమె మృతశరీరం ఒక బట్టల కార్ఖానా వెనుక మురికిగుంటలో పడివుండగా కనుగొనబడింది. ఆమెపై అత్యాచారం జరిగాక, గొంతును రేజర్ బ్లేడ్‌తో కోసినట్లుంది. ఆ మర్నాడు కూడా ఇలాంటి ఘోరమే జరిగింది. రత్న అనే పేదేళ్ళ అమ్మాయి బలమైన గాయాలతో మూల్గుతూ ఒకచోట పడివుండగా ఒక కార్మికుడు చూశాడు. ఆమె ముక్కు, చెవి తెగ్గోట్టబడ్డాయి. ఆ తర్వాత రెండురోజులకు ఆమె ఆస్పత్రిలో మరణించింది.

స్థానిక ప్రజలు, రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి చేయడంతో పోలీసులు తీవ్రంగా గాలించారు హంతకులకోసం. ఫలితంగా బెంగళూరు శ్రీరామపురం ప్రాంతానికి చెందిన యిద్దరు యువకులు పట్టుబడ్డారు. ప్రభాకర్ (20), కుమార్ (21). వీళ్ళిద్దరూ సినిమాపిచ్చోళ్ళు. "శిగప్పురోజాగళ్" చిత్రాన్ని చాలాసార్లు చూశాక అందలి హీరోను అనుకరించాలని బుద్ధిపుట్టిందట.

సుబ్బారాయుడు – సుబ్బలక్ష్మి

"మా కలర్ పిక్చర్ వినోదాత్మకమైనది," అన్నారు కె. హేమాంబరధరరావు. ఈయన డైరెక్షన్‌లో కె. అనూరాధ, బి. ఏ. నిర్మించే "సుబ్బారాయుడు – సుబ్బలక్ష్మి" చిత్రానికి సత్యం స్వరకల్పనలో బాలు, సుశీల, రామకృష్ణ, జానకి, శైలజ, రమణ, మాధవపెద్ది, రమేష్ పాడిన ఆరు పాటలను పత్రికర్తలకు ప్రత్యేకంగా ప్రదర్శించి వినిపించారు. నూతన్‌ప్రసాద్, కవిత నాయకా నాయికలు. నరసింహరాజు, జ్యోతి, నాగభూషణం, పద్మనాభం, రావికొండలరావు, దాశరథి, హరిబాబు, సాక్షి రంగారావు, పొట్టిప్రసాద్, ఆనందమోహన్, ఝాన్సి, అత్తిలి లక్ష్మి, జయమాలిని ఇతర పాత్రధారులు. భమిడిపాటి రాధాకృష్ణ మాటలు; వేటూరి, వీటూరి, ఆరుద్ర, గోపి గీతాలు రాశారు. పాచూ ఛాయ, కె. ఎస్. రెడ్డి నృత్యాలు; నండూరి గోపాల్ సహకార దర్శకత్వం, కె. బాబూరావు–బాలు ప్రొడక్షన్ నిర్వహిస్తున్నారు.



'తొలికోడి కూసింది'లో సరిత



'బొమ్మల కొలువు'లో జయమాలిని, చంద్రమోహన్

పర్వతనేని సాంబశివరావు దర్శకత్వంలో సత్యనారాయణ, సూర్యనారాయణ నిర్మించే సత్య చిత్ర వారి "కొత్తపేట రౌడీ" వన్నెల చిత్రంలో కృష్ణ హీరో.

అమావాస్య చంద్రుడు

కమలహాసన్ ప్రధాన పాత్ర ధరిస్తూ, సమర్పించే హాసన్ బ్రదర్స్ "అమావాస్య చంద్రుడు" వన్నెల చిత్రానికి నవంబర్ 30న తొలి పాట రికార్డ్ చేయబడింది జంధ్యాల, ఇళయరాజా, ఆత్రేయ, తోట తరణి, కె. వెంకటేశ్వరరావు సాంకేతికవర్గం. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తమిళంలో కూడా తయారవుతూంది చిత్రం

కృష్ణంరాజు, శ్రీదేవి తొలిసారిగా

వి. మధుసూదనరావు దర్శకత్వంలో నాయుడు శేషగిరిరావు నిర్మించే హేరంబ చిత్రమందిర్ వారి వన్నెల చిత్రంలో కృష్ణంరాజు, శ్రీదేవి, జానకి, సావిత్రి ముఖ్య భూమికలు నిర్వహిస్తారు డి. వి. నరసరాజు, చక్రవర్తి, వి. ఎస్. ఆర్. స్వామి, భాస్కరరాజు, జయకృష్ణ తెర వెనుక కృషిచేసే ఈ చిత్రం షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది.

నటీమణి మాలతి దుర్మరణం

"పాతాళభైరవి" నాయికగా అందరికీ చిరపరిచితురాలైన మాలతి (50) నవంబర్ 25న హైదరాబాద్ కాచీగూడా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక సినిమా థియేటర్ గోడ కూలి పడినప్పుడు ఆ శిథిలాలకింద చిక్కుకుని దైవాధీనురాలయ్యారు "మోహిని" తమిళ చిత్రంలో ఎం. జి. ఆర్. సరసన నాయికగా నటించిన ఈమె పదేళ్ళ క్రితం హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకుంది.

కొత్తపేట రౌడీలో కలవరపడ్డ కైలాసం

కైలాసం (నూతన్‌ప్రసాద్) లాన్‌లో కూర్చున్నాడు ఎదురుగా రెండు వాచీలున్నాయి బల్లమీద. ఒక దానికి డయల్ తెరిచి వుంది. అందులో చిన్న చిన్న వజ్రాలున్నాయి. చిన్న భూతద్దంతో వాటిని పరిశీలిస్తూండగా రివ్వున ఓ కారు వచ్చి కీచుమంటూ ఆగింది. తలెత్తకుండానే వజ్రపరీక్ష చేసి, మూతమూసి బెల్టు బిగిస్తూ, "అమ్మడూ, రాధమ్మా! ఎప్పుడో ఆ బ్రేకులు నా ఖర్మకాలి పనిచెయ్యవు. ఆ కారుతో నన్ను గుద్ది చంపేస్తావు. లేదా – గోడ గుద్ది నీకు దెబ్బతగిలినా, నేను గుండె ఆగి చస్తాను రెండూ జరక్కుండా చూడు, తల్లీ! దేవుడుగార్ని నూరేళ్ళు ప్రైమడిగాను," అన్నాడు కైలాసం.

వొయ్యారంగా వచ్చిన రాధ (జయప్రద) మా పెళ్ళైపోతే చెప్పేస్తాను ఆయనతో మాట్లాడి," అంటూ వాచీలు చూసి, "కొత్త వాచీలా? నాకివ్వవూ?" అంది.

"అబ్బె ... చెత్త వాచీలు. నకిలీవి." జేబులో పెట్టుకున్నాడు.

"నేనేవడిగినా చెత్తవని దాచేసుకుంటావు గా!" అని కోపంగా పోబోతున్నప్పుడు ఆమె ఎదురు మీద 'ప్లస్'మార్కు పలాస్త్రీ చూసి, 'అదేమిటే?" అన్నాడు కైలాసం.

ఆగి, కులుకుతూ వెనుతిరిగి నవ్వి, "ఇవాళ రామదండుకీ, రాక్షసమూకకీ ధర్మయుద్ధం జరిగింది. నాకు గోల్డ్ మెడల్ ఇచ్చారు," అంది.


కైలాసం గతుక్కుమన్నాడు. "ఎవరూ...?"

"అదే చిత్రం! శత్రువులు మెచ్చి ఇచ్చారు," అంటూ కదిలింది రాధ.

కైలాసం గుడ్లప్పగించి చూస్తూండి పోయాడు.



'దేవుడిచ్చిన కొడుకు'లో అంజలీదేవి, సత్యనారాయణ



స్వయంవరం

సీరియల్ — చివుకుల పురుషోత్తం

2

(గత సంచిక తరువాయి)

పుండరీకాక్షయ్య ఇంటి ముందు ఆటోరిక్షా ఆగింది

పుండరీకాక్షయ్య ఇంట్లో నుండి చక్కగా అలంకరించుకున్న ఆడవాళ్ళు నలుగురైదుగురు ఆత్రంగా పందిలోకొచ్చి, ఇంటి ముందు ఆగిన ఆటోరిక్షాను చూశారు

ఆటోలో నుండి సంధ్య దిగి, ఆటోవాడికి డబ్బు ఇచ్చి పంపేసి ఇంట్లోకి వచ్చింది

"సంధ్యా! ఇంత ఆలస్యంగానా నీవు వచ్చేది? స్వరూప నీకోసం ఆహతహలాడుతున్నది" అన్నది పుండరీకాక్షయ్య భార్య రుక్మిణమ్మ చిరాకుగా

"పెందలాడే వద్దామనుకున్నాను పిన్నీ! ఏటు అయింది పెండ్లికుమారుడు యింకా రాలేదేమిట్టుందే?" అంటూ గడియారం చూసుకుని "ఆరు సంభ్రైదయింది!" అన్నది

"ఇంకా రాలేదు మీ బాబాయిలిద్దరూ స్టేషన్ కెళ్ళారు అన్నట్లు నీవు గుంటూరు నుండి రైలుకే వచ్చావా?"

'కాదు పిన్నీ! తొందరగా రావాలని బస్ లో వచ్చాను" అన్నది సంధ్య రైలుకొస్తే స్టేషన్ దగ్గర బాబాయిలు కనిపించలేదా? అన్న ప్రశ్నలు పుట్టకుండా

"ఏరే! ఏరే! పద, అమ్మాయి ఇంట్లో ఉంది" అని రుక్మిణమ్మ బజారువంక ఆత్రంగా చూస్తున్నది

సంధ్య ఇంట్లోకి వెళ్ళింది

ముందరి హాలు సినిమా సెట్టింగులాగా అలంకరింపబడివుంది -- రకరకాల సోఫాలతో కుర్చీలతో, చిన్ని రౌండు టేబిల్సుతో, ఫ్లవర్ వాజులతో చాలా చక్కగా తీర్చిదిద్దారు సంధ్య హాలును దాటి స్వరూపరాణి గదిలోకి వెళ్ళింది

స్వరూపరాణి చక్కగా అలంకరింపబడి, గదిమధ్య చాపమీద కూర్చుని ఉన్నది ఆమె చుట్టూ అలంకరణ సామగ్రి, రకరకాల పూలు అస్తవ్యస్తంగా పడివున్నాయి

స్వరూపరాణిని చూడగానే, సంధ్య నివ్వెరపోయింది స్వరూపరాణికి బ్రహ్మాండంగా మేకప్ వేశారు రంగురంగుల జరీ పట్టుచీరా, రవికె ధరింపజేశారు మల్లెపూలతో పూలజడ వేశారు పూలజడమీద తెల్లని జలతారు తీగను, రకరకాల డిజైన్లల్లో వేశారు తెల్లని మల్లెపూల మధ్య, గులాబీలు లైన్‌గా కుట్టారు

స్వరూపరాణి మెడనిండా రకరకాల బంగారు దండలున్నాయి వాటికిమధ్య రాళ్ళ నెక్లెస్ ఉంది చెవులకున్న కమ్మలు గాత్రంగా మెరుస్తున్నాయి రంగు రంగుల కాంతులు కమ్మలలోనుండి బయలుదేరి సూదులవలె సంధ్య కళ్ళల్లో గుచ్చుకున్నాయి చేతులకు రాళ్ళగాజులు, బంగారు గాజులు, దండిగా వేశారు సంధ్య, స్వరూపరాణి ధరించిన నగలలో రుక్మిణమ్మవి ఏవో, స్వరూపరాణి పిన్నివి ఏవో మనసులో నెమరువేసుకుంటున్నది

అన్నింటికంటే ఆశ్చర్యం ఏమంటే, స్వరూపరాణి చామనఛాయపిల్ల అని అసలు అనిపించడంలేదు ముఖానికీ, మెడకూ, చేతులకూ బాగా క్రీం దట్టించినట్లున్నారు -- స్వరూపరాణి ఎప్పుగా ఉన్నట్లు ఎవరికైనా భ్రాంతి కలుగక తప్పదు అనుకుంది సంధ్య ఇన్ని అలంకారాల నడుమా, ఇంత మేకప్పుమీదా, ట్యూబ్‌లైట్ల కాంతిలో స్వరూపరాణిని చూస్తే, ఏ మగాడు, 'స్వరూపరాణి అందగత్తె' అని అనుకోడు? హరికృష్ణకు ఈ పిల్ల నచ్చుతుంది! ప్చ్! ఆడవాళ్ళను కన్నెత్తిచూసే అలవాటు లేని అమాయకుడు సర్వాంగసుందరంగా అలంకరింపబడిన పిల్లను చూసి ఏమనుకుంటాడు? ఆహా! అందగత్తె! అనుకుంటాడు ప్చ్! పోనీ! ఎవరి కర్మలో ఎలా ఉంటే అలా జరుగుతుంది ఇంతకీ ఆ హరికృష్ణలాంటి మెత్తటివాడికి స్వరూపరాణి లాంటి గండాగండి రాసిపెట్టివుంటే ఎవరు ఏట్టుకు ఏంచేస్తారు?

సంధ్యను చూసి, స్వరూపరాణి ముఖం ముడ్చుకుని కొద్ది క్షణాలు మౌనంగా ఉన్నది సంధ్య, స్వరూపరాణి మేకప్పను పరిశీలించడంలో మునిగిపోయింది

"సంధ్యా! ఇప్పుడా రావడం! ఆ పెండ్లికొడుకుతోనే రాకపోయావా?!" అన్నది స్వరూపరాణి కోపంగా

"సారీ! బ్యూటిఫుల్! ఏమైనా పెండ్లికొడుకుకంటే ముందే వచ్చానుగదా?" బ్యూటిఫుల్ అన్న పదాన్ని మనస్సులో పెట్టుకుని "ఏం ఎగతాళి చెయ్యొద్దులే!" అన్నది స్వరూపరాణి బుంగమూతి పెట్టి

"నో! నో! నీవు చాలా అందంగా ఉన్నావు నాకే ముద్దొస్తున్నావు!" అంటూ సంధ్య, స్వరూపరాణి ముందు కూర్చుని, ఆమె బుగ్గను పట్టుకోబోయింది

స్వరూపరాణి చివాలున వెనుకకు వంగి "అహఁ! తాకకు! మేకప్పు చెడిపోతుంది పెండ్లి చూపులయ్యాక కావాలంటే"

"స్వరూపా! ఏంటే హడావిడి? నిన్న సాయంకాలం గుంటూర్లో సంబంధం చూస్తున్నారంటివి! ఈరోజు ఉదయం చెబితివి, సాయంకాలం పెండ్లిచూపులని నీ ధోరణి చూస్తుంటే, రేపు ప్రొద్దున పెండ్లి, మధ్యాహ్నానికి భోజనాలూ, రాత్రికి. "

స్వరూపరాణి, సంధ్య వీపుమీద ఒక్కటిచ్చింది వీపు చుర్రుమనడంతో, "అబ్బా! ఏంటే నీ మోటు సరసం? నోటితో మాట్లాడు, చేతితో మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పాలి? రేపు మొగుడితోగూడా ఈ పద్ధతేనా?!" అన్నది సంధ్య

స్వరూపరాణి మళ్ళీ చెయ్యెత్తింది సంధ్య దూరంగా జరిగింది, అందకుండా

"నేనేం తొందరపడడంలేదు! రేపెల్లుండి, మంచిరోజులు గావట! ఆ తర్వాత మూఢమి అట! అందుకనే సడన్‌గా అరేంజి చేశారు"

"ఇంతకూ పెండ్లికొడుకు ఎలా ఉంటాడట! మీ బాబాయి ప్రివ్యూ ఏమీ ఇవ్వలేదా?"

"తను చాలా హేండ్సం అట!" సిగ్గుగా అన్నది స్వరూపరాణి

"హేండ్సం గాకుంటే నీవూ, మీ అమ్మా ఎవడ్ని గుమ్మం ఎక్కనిస్తార్లే! మిగతా సంగతులు చెప్పు? మేడలూ, గీడలు, కార్లూ, బోర్లూ, స్కూటర్లూ, గీటర్లూ, డబ్బూ దస్కం ఏమైనా ఉన్నాయా?"

స్వరూపరాణి ముఖంమీద విచారమేఘం కమ్ముకుంది "అదొక్కటేనే -- ఈ సంబంధంలోని లోపం! నీవు చెప్పిన లిస్టులో గీడలూ, బోర్లు, గీటర్లు, దస్కం గూడా లేవటనే! 'ఏక్ నిరంజన్!' అన్నట్లు, ఆ ఉద్యోగం తప్ప మరేమిలేదట పైగా తల్లీ! పెండ్లీడు చెల్లీ ఉన్నారట!"

"తండ్రి లేడటనా?"

"ఊహుఁ!"

"అయితే చిక్కే! మామగారి ఆధిపత్యంలేని అత్తగారుంటే ఆమె కోడల్ని బాధించాలనుకుంటే, చాలా ప్రమాదమే! -- మీ అక్కయ్యలాగా!"

స్వరూపరాణి క్షణం వణికింది కట్టుకోని పోయినంత ఆస్తి ఉందని, స్వరూపరాణి అక్కను ఒక భాగ్యవంతుల యువకునికి ఇచ్చారు కానీ, బావగారికి తండ్రి లేరు! తల్లి, ఒక చెల్లి ఉన్నారు బావగారు అమాయకుడు కావటంతో, అత్తా ఆడబిడ్డలూ, స్వరూపరాణి అక్కను బాధిస్తూ ఉండేవారు స్వరూపరాణికి తన అక్క పుట్టింటి నుండి వచ్చినప్పుడల్లా తన కష్టాలు చెప్పుకుని

జరిగిన కథ-1 : సంధ్య, స్వరూపరాణి స్నేహితురాండ్రు సంధ్య గుంటూరులో టైపిస్టుగా పనిచేస్తోంది ఆరోజు స్వరూపరాణి పెండ్లిచూపులు అవటంవలన రోజుకంటే ముందుగా విజయవాడకు వస్తున్న సంధ్య ట్రయిన్‌లో పెండ్లికొడుకు హరికృష్ణను చూసి, అతను స్వరూపరాణికి తగడను కొంటుంది అతన్ని తన ప్రక్కన ఊహించుకొని ఆనందిస్తుంది

ఏడుస్తూ ఉండేది అందుకనే తల్లీ తోడూలేని ఏకాకిగాడు చిక్కాలని తను కోరుకుంది ఏంటో! ఒకటి ఉంటే, మరొటి ఉండదు! అనుకుంది స్వరూపరాణి

"అయినా పర్లేదులేవే! నీవు మీ అక్కయ్య లాగా మెతకదానివి కాదుగదా!"

"ఏమ్మా? నేనంత గండాగొండిదాన్నా?"

'డెఫనెట్లీ! మీ అక్క, అత్తా ఆడబిడ్డల పోరు పడుతుంటే, నీవు వెళ్ళేచోట అత్తా, ఆడబిడ్డలు నీ ధాటికి ఏడుస్తారు!"

"ఛ! నోరుముయ్యవే! నేను మట్టుకు ఎవర్నైనా ఊరకే ఏమంటాను?"

"సరే పోనీవే! ఇంతకీ కథానాయకుడి పేరేంటి?"

'హరికృష్ణ అట!"

"ఫైన్! పేరు బాగుంది! హేండ్సం అంటున్నావు? ఇంక ఏం ఉండి, ఏం లేకున్నా పర్లేదు హరికృష్ణ నామం జపించుకుంటే, ఆయన అందచందాన్ని కంటినిండా చూసుకుంటూ, జీవితం గడిపేయొచ్చు!"

"నోరుముయ్యవే! నేను నీలాగా రొమాంటిక్ భావనలతో బుర్ర ఖరాబు చేసుకోను నేను ప్రాక్టికల్, కాస్త ఎర్రగా బుర్రగా ఉన్నంత మాత్రాన ఒప్పేసుకోడమే! ఇదేమన్నా లవ్వా ఏమన్నానా? ఇది అరేంజ్డ్ మ్యారేజి! స్ట్రిక్ట్‌లీ బిజినెస్! నాన్నగారు పదివేలకు పైన కట్నం ఇవ్వలేనంటారుగాని, మంచి సంబంధం దొరికితే పదిహేనువేలైనా ఇస్తారు అందుకే నేను తొందరపడదల్చుకోలేదు!"

"ఓ కే! కారీ ఆన్! ప్రాక్టికల్ గర్ల్!" అన్నది సంధ్య

ఇంతలో 'పెండ్లికొడుకొచ్చాడు!' పెండ్లికొడుకొచ్చాడు!' అని పంచలో ఉన్న మహిళా బృందం, ఇంట్లోకి పరుగులుపెట్టారు — సింహాన్ని చూచిన లేళ్లమందలా, కర్టెన్ చాటున ఉండి, పెండ్లికొడకుని నక్కి నక్కి చూస్తున్నారు

హాలులో మగాళ్ల మాటలు వినిపించాయి

రుక్మిణమ్మగారు పెండ్లికుమారునికి, కాళ్లకు నీళ్ళు అందించింది ఆమె చెల్లె అద్దం, దువ్వెనా, తీసుకుని వెళ్ళింది

ఆడవాళ్ళు నిశ్శబ్దంగా ఇంట్లో ఉండి, హాలులోని మగాళ్ళ మాటలు వింటున్నారు

"ఏం బాబూ! మీ చెల్లెల్నయినా తీసుకు వస్తావని అనుకున్నాము" పుండరీకాక్షయ్య అన్నాడు

"తీసుకొద్దామనే అనుకున్నాను! ఆఖరు నిముషంలో అమ్మ వద్దన్నది రైలు లేటైతే — ఒకవేళ మీరు స్టేషన్‌కు రాలేకుంటే కొత్తచోట ఆడపిల్లను వెంటేసుకుని ఏం ఇబ్బందిపడుతానో అని అన్నది అమ్మ!"

"ఎంతమాటెంతమాట బాబూ! స్టేషన్ వస్తానని, రాకుండా ఉంటానా?" అని పెద్దగా, ఇంట్లోకి వినబడేలాగా అన్నాడు, పుండరీకాక్షయ్య. "ఏయ్! రుక్మిణీ! అంతా రండి! అబ్బాయిని పరిచయం చేస్తాను!"

సంధ్య, స్వరూపరాణి తప్ప, మిగతా అందరూ హాలులోకి వచ్చారు పుండరీకాక్షయ్య అందర్నీ హరికృష్ణకు పరిచయం చేశాడు హరికృష్ణ కుర్చీలో నుండి లేచి అందరికీ వినయంగా నమస్కరించాడు మరో అయిదు నిముషాలయ్యాక స్వరూపరాణిని తీసుకొని వెళ్లి హాలులో కూర్చోబెట్టారు


సంధ్యను వచ్చి పెండ్లికుమారుని చూడమని ఎవ్వరూ మాటమాత్రంగా గూడా అనలేదు సంధ్య తనూ చూడాలన్న ఉబలాటాన్ని వ్యక్తం చేయలేదు

పెండ్లికొడుకునూ, పెండ్లికుమార్తెనూ 'మాట్లాడుకోండని' శంకరయ్య సూచన చేశాడు గాని, ఇద్దరిలో ఎవ్వరూ ఉత్సాహం చూపలేదు

మరో పావుగంటకల్లా పెండ్లి చూపుల తతంగం అయిపోయింది స్వరూపరాణీ, మిగతా ఆడవాళ్ళు వచ్చి సంధ్య వున్న గదిలో కూర్చున్నారు శంకరయ్య, పుండరీకాక్షయ్యలు హరికృష్ణను బస్టాండుకు తీసుకుని వెళ్లారు

ఆడవాళ్లంతా పెండ్లికుమారుడు అపురూపమైన అందగాడు అని నిర్ణయించారు శంకరయ్య భార్య అలిమేలు మట్టుకు మొట్టమొదటిసారిగా అపస్వరం పలికింది

"అక్కయ్యా! పిల్లవాడు అందగాడే! అందులో ఏమీ అనుమానంలేదు కానీ అంత అందం మగాడికి ఉండడం ఏమిటి? ముఖంలో కాస్త ఆడకళలు గోచరిస్తున్నాయి ఆ పెదవులు చూడు! ఎర్రగా దొండపండ్లలాగా వున్నాయి"



అద్వితీయ విమల్

ఒక్క విమల్ మాత్రమే ప్రతి ఏడాది
60 లక్షల మీటర్లకు పైగా సూటింగ్స్‌ను
మీకు అందచేస్తుంది.
100% పాలియెస్టర్, పాలియెస్టర్/ఊలు,
ఇంకా వివిధ రకాల బ్లెండ్స్‌లో.


ట్రీవాల్


విమల్ వారి పాలియెస్టర్/ఊలు సూటింగ్.
ఈ సీజన్ కై,
200కు పైగా సరిక్రొత్త డిజైన్,
రంగుల కలయికలలో. అన్నీ అద్వితీయమైనవే.

VIMAL®

A RELIANCE PRODUCT

సూటింగ్స్





భారత దేశంలో అత్యంత ఆధునికమైన టెక్స్టైలు
మిలువారి ఉత్పాదన





స్వయంవరం

రుక్మిణమ్మ అన్నది "నాకూ ఆ అనుమానమే వచ్చింది కానీ, మాటమట్టుకు సహజంగా వుంది"

సంధ్య హరికృష్ణ తరఫున అన్నది, "అదేం పెద్ద విశేషంకాదు పిన్నీ! అసలే వస్తువేవాడంటిరి సిగరెట్లు తాగేసే అలవాటులేదేమో? ఎర్రగా వుండివుంటాయి పెదాలు అసలు ఈరోజుల్లో మగాళ్ళు సిగరెట్లు తెగకాలుస్తూ పెదాలు మాడిపోయి వుంటారు అదే మగాడి అందం అని మనం పొరబాటుగా అనుకోగూడదుగదా?!"

ఆ మాటతో అలిమేలు ముఖం ముడుచుకుపోయింది ఎందుకంటే అలిమేలు భర్త శంకరయ్య చైన్‌స్మోకర్

"సరే! పెద్దవాళ్ళు మీ అభిప్రాయాలు చెప్పారు మరి స్వరూప సంగతేంటి?" అన్నది సంధ్య అంతా స్వరూపరాణి వంక చూశారు

స్వరూపరాణి తలవంచుకుని కూర్చున్నది

సంధ్య స్వరూప చుబుకాన్నిపట్టి ఎత్తి "ఊఁ! చెప్పు! ముహూర్తం పెట్టించమంటావా?" అని అడిగింది

స్వరూపరాణి సంధ్య చేతిని తొలిగించి, మళ్ళీ తలవంచుకుని కూర్చున్నది

'అన్నీ బాగున్నాయిగాని, అబ్బాయికి ఉద్యోగం తప్ప మరేమీలేదు పైగా తల్లీ, పెండ్లిగాని చెల్లి!" అని నీళ్ళు నమిలింది రుక్మిణమ్మ

సంధ్యకు ఛర్రున మండుకొనివచ్చింది పెండ్లిచూపులంటే వీళ్ళకు తమాషాగా వున్నట్లుంది అబ్బాయికి ఉద్యోగం తప్ప ఏమీ లేదని ఇంతకుముందే తెలునుగదా? తల్లీ, పెండ్లిగాని చెల్లి వున్నారని ఇప్పుడు అనడం ఎందుకు? పెండ్లిచూపులు అయ్యాక వాళ్ళు మాయం అయిపోవాలా? అంతకాడికి పెండ్లిచూపులకు ఎందుకు పిలిచినట్లు? సంధ్య ఘాటుగా అందామనుకుందిగాని, అయినా ఎందుకులే అని ఊరుకుంది

ఇహా ఓ అరగంట ఆడవాళ్ళ తర్జనభర్జనలు చేశారు స్వరూపరాణి మట్టుకు బెల్లంకొట్టిన రాయిలాగా వుండిపోయింది నచ్చాడనిగాని, నచ్చలేదనిగానీ చెప్పలేదు

ఇంతలో శంకరయ్య, పుండరీకాక్షయ్య ఇంట్లోకొచ్చారు

"అబ్బాయిని బస్‌లో ఎక్కించావారా?" అడిగింది రుక్మిణమ్మ

"ఆ! బస్‌లో ఎక్కించి టిక్కెట్ తీసియిచ్చి, మరీ వచ్చాను సరే! ఇంతకీ ఏం తేల్చారు మహిళామండలివారు?" అని అడిగాడు పుండరీకాక్షయ్య

'ఏమీ తేలలేదు మీరుగూడా చర్చలలో పాల్గొనందే ఒక తీర్మానం వచ్చేలాగాలేదు" అన్నది అలిమేలు పుండరీకాక్షయ్యతో

"అది అంతేలే ఇంతకూ అమ్మాయి ఏమంటుంది?"

"ఏ సంగతీ చెప్పడంలేదు" విచారంగా అన్నది రుక్మిణమ్మ

"చెప్పమ్మా చెప్పు! నీవూ ఇలా సిగ్గుపడితే ఎలాగా?" అడిగాడు పుండరీకాక్షయ్య ఆత్రుతగా

"వాళ్ళేం చెబుతారో ఎదురుచూద్దాం" అన్నది స్వరూపరాణి, నిమ్మకునీరెత్తినట్లుగా

"వాళ్ళు చెప్పేదాకా ఆగడం ఎందుకు? ఇప్పుడేమన్నా నేను పోయి మా అమ్మాయి, అబ్బాయిని నచ్చిందని చెప్పి టాం టాం వేయబోవడంలేదు మనలో మనం అవుననో, కాదనో ఒకమాట అనుకుంటే దాన్నిబట్టి తరువాతి చర్య తీసుకోవాలిగదా?"

స్వరూపరాణి తేల్చిచెప్పలేదు

అలిమేలు అన్నది — "బావగారూ! కట్నం ఎంత అడిగింది ఆ అబ్బాయి తల్లి!"

"కట్నం అడుగలేదుగాని, కంఠ ఉరి వేసినంత పని చేసింది ఆమె!"

"ఏంటండీ! ఏమన్నది అబ్బాయి తల్లి?" ఆదుర్దాగా అడిగింది రుక్మిణమ్మ

'ఆమె పేరు భ్రమరాంబ! చాలా మంచియామేననిపించింది కానీ ఒక సమస్యను నా నెత్తిన పెట్టింది వాళ్ళమ్మాయికి గూడా నేనే సంబంధం చూడాలంట! వాళ్ళది కర్నూలు అయినవాళ్ళకూ, వాళ్ళకు శత్రుత్వాలట! కాబట్టి వాళ్ళ అమ్మాయికి మనం సంబంధం చూడాలట! ఇక కట్నకానుకలూ వగైరాలూ అన్నీ మనం మన అమ్మాయికి యిచ్చే కట్నంలోనే ఎర్నాలట!"

"ఇది చాలా మెడతపేచీలాగా వుందే?" రుక్మిణమ్మ అన్నది అనుమానంగా

"అలాగే తోస్తున్నది మనం పదివేలు ఇచ్చామనుకో! అందులోనే అమ్మాయికి సొమ్మూ వగైరాలు తీసుకోవాలి! మీ అంచనాలప్రకారం అమ్మాయికి ఐదువేలు సొమ్ము చేయించమన్నారు గదా స్వరూపకు?"

"అవును! అన్నాను తప్పేంటి? పదివేలు కట్నం యిచ్చినవాళ్ళను ఐదువేలు సొమ్ము అడుగడం న్యాయం కాదంటారా?" రుక్మిణమ్మ అన్నది రోషంగా

"న్యాయమే! న్యాయమే! కాని సొమ్ము పెట్టాక వాళ్ళకు ఐదువేలు మిగుల్తుంది ఈ పెండ్లి తతంగం అయ్యేప్పటికే వాళ్ళకూ వెయ్యిరూపాయలన్నా ఖర్చు అవుతుంచిగదా? ఇంక నాలుగువేలు మిగుల్తాయి నాలుగువేల రూపాయలు చేతబట్టుకుని గ్రాడ్యుయేట్ పిల్లకు సంబంధాలుచూడమంటే ఏం చావాలి? యిదిఅయ్యే పనేనా?" అన్నాడు పుండరీకాక్షయ్యదిగులుగా

అప్పటిదాకా మౌనంగా వున్న శంకరయ్య అందుకున్నాడు "అన్నయ్యా! పిల్లవాడు మనకు నచ్చాడు మనం అవుననుకుంటే పెండ్లి చేసేద్దాం! ఆ తరువాత తిప్పలు వాళ్ళవి కాకుంటే సంబంధాలు చూస్తూవున్నాం అని బుకాయిద్దాం! నీవన్నట్లూ, ఆ నాలుగువేలతో ఆ పిల్లకు పెండ్లి అయ్యేనా పెట్టేనా?"

శంకరయ్య మాటలలోని వంచనకు అంతా దిగ్భ్రాంతులై మౌనంగా వున్నారు

"ఒద్దండీ! ఈ లిటిగేషన్లు వద్దు! మనం ఇప్పుడు సరేనని, ఆ తరువాత వాళ్ళ పిల్లకు పెండ్లి చేయలేకపోతే పెద్దదానిలాగే దీని కాపురం లోనూ పొరపొచ్చాలు వస్తే?" అంటూ, తన అనుమానాన్ని బయటపెట్టింది రుక్మిణమ్మ

"వదినా! అవన్నీ ఆలోచించి మనసు పాడుచేసుకోకు పెద్దదాని సంగతి వేరు, చిన్నదాని సంగతి వేరు స్వరూపరాణిని ఏడ్పించగల సమర్థులు నాకు ఇంతవరకూ కనిపించలేదు! మనంమట్టుకు ఏంచేస్తాం! వాళ్ళ పిల్ల పెండ్లి చేయించాలని చూస్తాం! కాని చేసిపెడుతాం అని, మనం గ్యారంటీ ఇవ్వడంలేదు!" అన్నాడు శంకరయ్య


అంతా శంకరయ్య మాటలను జీర్ణించుకుంటున్నారు

"ఇదిగో అమ్మాయిలూ, మహిళామణులూ! వినండి! నాకు ఆ అబ్బాయి సంపూర్ణంగా



ఆ మధ్య అమృతాంజనం కంపెనీవారు నిర్వహించిన పోటీలో ఈమె పంపిన ఎంట్రీకి ప్రథమ బహుమతి (ప్రీమియర్ పద్మిని కారు) లభించింది శ్రీమతి ముఖర్జీ ఈ పోటీలో గెలవటానికి కావలసింది స్కిల్ ఈమె భర్త ఇంజనీర్ ఇ సి ఐ ఎల్ కంపెనీలో సెర్వో కంట్రోల్ డివిషన్‌కి ప్రధానాధికారి ముఖర్జీ దంపతుల ఏకైక పుత్రుడు శోఏక్ ముఖర్జీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు ఈమెకు ఎమెచూర్ నాటకాల్లో (బెంగాలీ) వేషాలు వెయ్యడం ముఖ్యమైన హాబీ కొత్తరకం తినుబండారాలు తయారుచెయ్యడం, పెరటితోట పెంపకం శ్రీమతి ముఖర్జీ యితర హాబీలు లేత పసుపురంగు గులాబీలంటే ఈమెకు మహాప్రీతి ముఖర్జీ దంపతుల ఇంట్లో నిత్యావసర వస్తువుగా అమృతాంజనం వాడబడుతూ వుండడం వల్ల ఎంట్రీలతో జతపరచవలసిన కార్టన్స్‌కి తడుముకోవలసిన అవసరం ఈమెకు రాలేదుట!

—[కె ఎస్ కామరాజు]


S. Kumars
మా వస్త్రాల ప్రతి మీటరుపైనా
ముద్రించబడ్డ మా పేరు—విశిష్టతకు చిహ్నం.
ఉత్కృష్టతకి కొలబద్ద. అంటే ప్రతి అంశమూ అతి సూక్ష్మంగా పరీక్షించబడుతుంది. క్లిష్టమైన పరీక్షలు. అంతేకాదు ప్రతిదశలోనూ ధరలు సరసంగా వుండేట్లు చూస్తాం. అందువల్ల వాటి నాణ్యత మా క్లిష్టమైన ప్రమాణాలకు అనుగుణంగా వుంటుంది.
అందుచేతే, సంపూర్ణ విశ్వాసంతో మేము ప్రతి మీటరు పైనా మా పేరు ముద్రిస్తాం. అంటే, మీ డబ్బుకి పూర్తి విలువ లభిస్తుందన్న మాట. వస్త్రాలు కొనేటప్పుడు గుర్తుంచుకోండి—ఎస్. కుమార్స్ పేరు విశిష్టతకు చిహ్నం అని.
ఎస్.కుమార్స్
'టెరీన్'
సూటింగ్స్, షర్టింగ్స్, చీరలు మరియు 'టెరీన్' వోర్‌స్టెడ్ సూటింగ్స్.
"నిరంజన్," 99, మెరిన్ డ్రైవ్, బొంబాయి 400 002
అతి ఉన్నతమైన నాణ్యత అతి తక్కువ ధరకు
Sista's-SK-1022/79 Tel

వచ్చిన పిల్లవాడు బుద్ధిమంతుడు ఇంతే కట్నం ఇవ్వు అంత కట్నం ఇవ్వు, అని పేచీలుపెట్టే రకం లని, అనిపిం లేదు! ప్రపంచంలో అంతా గులాబీలగంలో కళ్ళబడతాయి – మంచివెంబడి చెడు, చెడువెంట మంచి అరటికాయకు తొక్క ఉంటుంది నిమ్మకాయల్లో విత్తులు ఉంటాయి మామిడికాయలో టెంకె ఉంటుంది టెంకలేని మామిడికాయా, విత్తులేని నిమ్మకాయా, తొక్కలులేని అరటిపండు, తెమ్మంటే ఎలాగా? నా దృష్టిలో ఇది మంచి సంబంధం! పిల్లవాడు, నువ్వు కోరినదానికంటే అందగాడు, బుద్ధిమంతుడు కూడా, ఆలోచించి చెప్పు?'' అన్నాడు పుండరీకాక్షయ్య

మళ్లీ అంతా మౌనం వహించారు

పుండరీకాక్షయ్య హఠాత్తుగా సంధ్యవంక చూసి, ''అమ్మా! సంధ్యా నీకు ఈరోజు భోజనం, నిద్ర ఇక్కడే! స్వరూప సంగతేంటో త్వరగా తెలుసుకో! ఊరికే తాత్సారంగా ఉంటే లాభం లేదని చెప్పు ఆ అబ్బాయికోసం చాలా సంబంధాలు వస్తున్నాయి మనం మీనమేషాలు లెక్క పెట్టుకొనేప్పటికే సమయం మించిపోవచ్చు అదీకాక అబ్బాయిని మనం అంతా బాగున్నాడని అనుకున్నాం! కానీ అబ్బాయికి గూడా అమ్మాయి బాగుంది, బాగాలేదు, అనే స్వేచ్ఛ ఉందిగదా! అయితే ఇక్కడ కొద్దిగా అడ్వాంటేజ్ వుంది అమ్మాయి, అబ్బాయికి నచ్చకపోయినా మనం భ్రమరాంబగారి ద్వారా, పిల్లవాడికి నచ్చచెప్పించ వచ్చు నాకు అలా అనిపించింది మరి ఆలోచించుకుని చెప్పండి! సంధ్యా నీవు ఈపూటకు ఇక్కడే ఉండిపోతానని, మీ ఇంటికి కబురుపంపుతాను'' అన్నాడు

ఆ తరువాత ఎటూ తేలని ధోరణిలో చాలా సమయం గడిచింది భోజనాలు అయ్యాయి సంధ్య, స్వరూపరాణి మేడమీది బెడ్రూము వెన్నెట్లో కూర్చున్నారు

''ఊఁ! ఇప్పుడు చెప్పు? ఏం స్వరూపా! ఇప్పటికి నాలుగుసార్లు పెండ్లిచూపులు చూశావు ఎప్పుడుబట్టినా టకా టకా తేల్చి చెప్పేదానివి ఇదేంటి? ఎటూ తేల్చి చెప్పవు?''

''ఏం తేల్చి చెప్పమంటావే? పిల్లవాడు బాగున్నాడు! నచ్చాడని చెప్పమంటావా? పదివేల కట్నం డబ్బులు ఖర్చుపెట్టకుండగానే మాయం అయిపోతాయి ఒక్క హనీమూన్ లేదు! ఫర్నిచర్ కొనుక్కునే సంగతి లేదు ఆ జీతంలోనే బ్రతకాలి! పైగా పెండ్లిగాని చెల్లి, తల్లి ఈ పరిస్థితులు నాకు నచ్చలేదని చెప్పమంటావా?''

''అంటే నచ్చలేదనా?''

''నాకేం తెలియం లేదు!''

''అమ్మాయిగారూ! స్వరూపారాణిగారూ! తమకు తేలేప్పటికే ఆ అబ్బాయికి పెండ్లి అయిపోతుంది! అప్పటికి నీవు తేల్చినా, తేల్చకపోయినా ఉపయోగం లేదు''

''సంధ్యా! చిన్నాయన హైదరాబాద్ సంబంధం ఒకటి చెప్పాడు అతడు ఇంజనీర్ అట తల్లి తండ్రీ, అన్నా, చెల్లి, ఎవ్వరూ లేరట ఒక్క ముసలమ్మ మాత్రం వుందట హైదరాబాద్‌లో స్వంత ఇల్లుందట''

''ఇంకేం? నీవు కోరినటువంటి సంబంధమే! మరి నీ మనస్సు, ఆ ఇంజనీయర్‌గారిమీద వుంటే, ఈ హరికృష్ణగారి నెందుకు ఇబ్బందిపెట్టి, ఇంత దూరం పిలిపించావు?''

''పూర్తిగా వినవేమే? ఆ హైద్రాబాద్ అతడు నాకన్నా ఒక అంగుళం పొట్టిఅట! నల్లని నలుపట!''

''అయితేనేమే? నీవు ప్రాక్టికల్ గర్ల్‌వి! అందచందాలు ఏం కొరుక్కుతింటావు? నన్నడిగితే హరికృష్ణగార్కి గుడ్ బై కొట్టి హైద్రాబాద్ ఇంజనీర్ని పెండ్లిచూపులకు పిలిపించాలి''

''

''ఏం చెప్పు?''

'ఏం చెప్పా?''

''అదే! హరికృష్ణగారి సంబంధం ఎందుకు వద్దన్నావో?''

'ఎలా చెప్పమంటావే! హి ఈజ్ ఎక్సెప్షనలీ హేండ్సం!''

''అయితే నచ్చాడని మీ నాన్నగారికి చెప్పనా?''

''ఆ తల్లి, పెండ్లిగాని చెల్లి వుండి ఆస్తి పాస్తులు లేకపోయాక యెలా నచ్చాలే? పైగా పదివేల రూపాయలు కట్నంగూడా యివ్వాలి''

స్వయం

''ఓ గాడ్! మళ్ళీ మొదటికే వచ్చావు''

స్వరూపరాణి కొద్దిసేపు మౌనంగా వుంది

''సంధ్యా! బాబాయి ఒక్కటి ఒక్కమాట నిజం చెప్పడు హైదరాబాద్ సంబంధాన్ని గురించి అబద్ధాలు చెప్పాడేమోనని నా అనుమానం అసలు సంగతేమంటే హైదరాబాద్ సంబంధంవాళ్ళు పాతికవేల రూపాయలు కట్నం అడుగుతున్నారట! అంత బాబాయికి ఇష్టంలేదు నాన్నగారు గూడా పాతికవేల రూపాయలు కట్నం ఇవ్వలేరు అందుకని హైదరాబాద్ పిల్లవాడు పొట్టి, నలుపు అని అంటున్నాడేమోనని నా అనుమానం''

''ఇంతకీ ఆ అబ్బాయిని మీ నాన్నగారు చూశారా?''

''లేదు''

''మీ బాబాయి చూశాడా?''

'చూశాడట!''

''అయితే నీవూ పిలిపించుకు చూడు సందేహం వదలిపోతుంది''

''సంధ్యా! నీకంతా ఎగతాళే!''


''కాకుంటే ఏమిటే స్వరూపా? ఎదురుగా ఒక సంబంధం చూసి, దాని బాగోగులు తర్కించుకుని నిర్ణయించుకోవాలి గాని, దాన్ని వదలిపెట్టి హైద్రాబాద్ సంబంధాన్ని గురించి ఆలోచించడం ఏం సబబు? అయినా నేను నిన్నొకటి అడుగుతాను ప్రపంచంలో సమస్యలను ఎదుర్కోవడం, ఎదుర్కొని పరిష్కరించడం నేర్చుకోవాలి గాని వాటి నుండి పారిపోవాలనుకోవడం తెలివితక్కువ అలా సమస్యలను ఎదుర్కోక పారిపోవడం నేర్చుకుంటే జీవితం అంతా పారిపోతూనే వుంటావు ఇప్పుడీ హరికృష్ణ సంబంధంలో లోటు ఏమిటి? పెండ్లికాని చెల్లెలు వుందంటావు! అది పెద్ద సమస్య ఎలా అవుతుంది? నీవూ ప్రయత్నించి ఆ పిల్లకు పెండ్లి చెయ్యి లేకుంటే ఏదో ఉద్యోగం చేసుకుని బ్రతుకుతుంది దానికోసం పారిపోవలసినంత గడ్డుసమస్య కాదుగదా?''

''అబ్బా! నీకు అర్థంగాదే! హరికృష్ణ సంబంధంలో కుర్రాడు బాగున్నాడు హైదరాబాద్ సంబంధంలో అతడి బ్యాక్‌గ్రౌండు బాగుంది రెండు సంబంధాలు కంటికి కనిపిస్తుంటే ఏది ఎటు తేల్చుకుని ప్రొసీడవ్వాలో తెలియదు హరికృష్ణనే చేసుకుంటే హైదరాబాద్ సంబంధంలాంటి బ్యాక్‌గ్రౌండు దొరకదు హైదరాబాద్ సంబంధంలాంటి కుర్రవాడూ కనిపించడంటావా?''

సంధ్య దీర్ఘంగా నిట్టూర్చి ''ఇలాంటి స్థితిలో ఏంటి నీవనేది?'' అని అన్నది

''ఏం లేదే! అంత అర్జంటుగా ఎవరూ అంటూరు సంబంధం డిసైడ్ చేయకుంటే ఏమిపోయింది? ఆ హైద్రాబాద్ సంబంధం గూడా చూసి''

''అలాగే మద్రాసు నుండి ఒకటి, కలకత్తా



వరం

నుండి ఒకటి, ఢిల్లీ నుండి ఒకటి, లండన్ నుండి ఒకటైనా పిలిపించి చెబుతాను బాబాయితో. ఎంచక్కా పూలమాల చేతబట్టుకుని ఆ రాకుమారులందర్నీ పరిశీలించి స్వయంవరం జరుపుకుందువుగాని'' అన్నది సంధ్య.

''అబ్బా! సంధ్యా! నా మైండ్ నీకు అర్థంగాదే! ఎంతసేపటికీ నా పరిస్థితుల దృష్టితోనే ఆలోచిస్తే ఎలాగే? మీ నాన్న నీకు ఎలాగూ కట్నం ఇవ్వలేడు. ఎవరో దొరికినవాడ్ని ముడేసుకుందామన్న ఆతృత నాకు లేదు. నాన్నగారు చదివేను, ఇరవై వేలు కట్నం ఇస్తారు. తిరగడానికి నాన్నా, బాబాయీ వున్నారు. కాస్త ఛాయిస్ తీసుకుంటే తప్పేంటే?''

స్వరూపరాణి మాటలు సంధ్యకు బాకులాగా గుచ్చుకున్నాయి. మనస్సు ఉక్రోషంతో మరిగిపోతున్నా మౌనంగా వుంది.

''కోపం వచ్చిందా?'' అడిగింది స్వరూపరాణి వచ్చినా రాకున్నా, ఐ డోంట్ కేర్ అన్నట్లు.

''వచ్చింది!'' అన్నది సంధ్య కటువుగా.

''సారీ! సంధ్యా! కొన్ని కటువు నిజాలు మాట్లాడితే అంతే!''

''అవును! అంతే! నేనూ నీకు కొన్ని కటువు నిజాలు చెబుతాను, వినుకో! నీ అందచందాలు నీకు తెలియనివికావు! ఇలా బెట్టుగా, అతి ఆశలతో నీవు ఉంటే, నీ ఆశలకు తగిన సంబంధాలు చిక్కాలాయా? ఎన్నాళ్ళు మీ నాన్నగారూ, బాబాయీ తిరుగుతారు? సిల్లీపాయింట్లు చూపి, వద్దంటే వాళ్ళకూ విసుగుపుట్టి మానుకుంటారు. నిన్ను చూసినవాళ్ళంతా నిన్ను మెచ్చుతారన్న నమ్మకం నీకుందా?''

ఈ తడవ మౌనంగా ఉడికిపోవడం స్వరూపరాణి వంతు అయింది.

''కాబట్టి తేల్చి చెప్పు? లేకుంటే గుంటూరు సంబంధం ఎగిరిపోతుంది!''

''ఏమీ ఎగిరిపోదు! వాళ్లకు ఏమీ చెప్పం! ఈలోపల త్వరగా హైదరాబాద్ సంబంధం గూడా చూస్తే, ఒక నిర్ణయానికి రావడానికి వీలుండవచ్చు.''

''ఊఁ! ఆ మాటే చెప్పమంటావా బాబాయికి?''

''చెప్పు!''

సంధ్య లేచింది. స్వరూపరాణి, సంధ్యను చెయ్యిపట్టిలాగి కూర్చోబెట్టి, ''ఈ రాత్రికి నా దగ్గరుంటావని అంటివిగదా?'' అని అన్నది.

''నీ నిర్ణయం తెలుసుకోవడానికి తెల్లవారేదాకా, అవస్థపడాలని అనుకున్నాను. ఇప్పుడే తేలిపోయింది. ఆ కాస్త సంగతి బాబాయిగారికి చెప్పి, ఇంటికెళ్తాను. మళ్లీ రేపు గుంటూరెళ్లాలి గదా?'' అన్నది సంధ్య.

''సంధ్యా! నీకు కోపం వచ్చిందిగదూ? సారీ!''

''నాకు కోపం రాలేదు! ఉన్న విషయం అన్నావు నిజమే స్వరూపా! మనం ఎన్నిసార్లు పోట్లాడుకోలేదు? అయినా మన మైత్రికేమైనా ఆటంకం కలిగిందా, మరి వస్తాను.''

''సరే పో! కానీ రేపు సాయంకాలం కంబడకపోతే తంతాను!''

''ఓ కే! రేపు సాయంకాలం కలుద్దాం!'' అంటూ, సంధ్య మేడమెట్లు దిగి క్రిందకువచ్చింది.

హాల్లో పుండరీకాక్షయ్య, శంకరయ్య, రుక్మిణమ్మ, అమేట కూర్చుని పెండ్లి సంబంధాన్ని గురించే మాట్లాడుతున్నారు.

''ఏమ్మా! ఏమంటుంది స్వరూప?'' అని ఆతృతగా అడిగాడు పుండరీకాక్షయ్య. సంధ్య క్లుప్తంగా స్వరూపరాణి నిర్ణయాన్ని తెలిపింది. ఆ నిర్ణయాన్ని విన్న, పుండరీకాక్షయ్య కుర్చీలో నీరుగారిపోయాడు. రుక్మిణమ్మ రెండు చేతులలోకి తల వచ్చింది.

''ఏం అన్నయ్యా! రేపు హైద్రాబాద్ వెళ్లనా?'' అన్నాడు శంకరయ్య.

''బావగార్ని వేరే అడిగేందుకేముందండీ! రేపు ఉదయమే బయలుదేరండి!'' అన్నది అలిమేలు. ఆ ఇంట్లోనుండి బయటపడి సంధ్య ఆలోచించుకుంటూ వెళ్తున్నది.

ఏమైనా స్వరూపరాణి అదృష్టవంతురాలు! ఆమె పెండ్లి చేయాలని, నాలుగు ప్రాణాలు తహతహలాడుతున్నాయి. వేలకొద్దీ డబ్బు, బ్యాంకులో ఎదురుచూస్తున్నది. మరి తన సంగతేంటి? తన పెండ్లిని గురించి ఎవరూ ఆలోచించడంలేదు! హరికృష్ణగారిని చూశాక, తనూ పెండ్లి చేసుకోవాలనిపిస్తున్నది. ఎవరిని? హరికృష్ణనే!

సంధ్య సత్యనారాయణపురం నుండి బయలుదేరింది తన ఇంటికి. రాత్రి పదిగంటలు అయినా బజార్లలో జనసంచారం వున్నది. సంధ్య ఆలోచించుకుంటూ నడుస్తున్నది.

అవును! తను దురదృష్టవంతురాలు! తనకు పెండ్లి చేయాలని అమ్మకు ఒక్కదానికే వుంది. నాన్నా నాయనమ్మా, అరడజన్‌మంది మేనత్తలూ వున్నా ఎవ్వరూ పట్టించుకోరు. నాన్న మెతక, పెత్తనం అంతా నాయనమ్మదే. అదేం ఖర్మమో నాన్న సంతానం అంటే నాయనమ్మకు ప్రేమలేదు. ఎంతసేపూ తన కూతుళ్ళూ, తన అల్లుళ్ళూ, వాళ్ళ సంతానం, వాళ్ళ అభ్యున్నతినే కాంక్షిస్తూ వుంటుంది. ఆ మేనత్తల బృందానికి సంబంధించినవారెవరో ఒకరు రోజూ ఇంటి కొస్తుంటారు. ఏ అల్లుడు ఇంటికొచ్చినా నాయనమ్మ కొత్త అల్లుడికి చేసినంత హడావిడి చేస్తుంది. ఈ అరడజను అత్తగారూ ఏదో ఒక కారణాన్ని పురస్కరించుకొని తమ యింట్లో కనీసం ఓ నెల్లాళ్ళపాటు తిని చీరలు ఎత్తుకొనిపోతుంటారు. చెల్లెళ్ళకు నాన్న పెట్టవలసిందే! కానీ, ఐదుగురు పిల్లలు పుట్టాక గూడా వాళ్ళు పెద్దవాళ్ళు అయ్యాక గూడా ఈ అరడజనుమంది మేనత్తలకూ, వాళ్ళ మొగుళ్ళకూ ఒత్తులువత్తాలంటే ఎలాగా?

ఈ అరడజన్ మేనత్తల పురుడూ పుణ్యాలతో తాతయ్య యిచ్చిన ఆస్తి అంతా కరిగిపోయింది. ఇప్పుడు నాన్న జీతం పెద్దదే అయినా ఏ నెలా వంద రూపాయలు మిగిలినపాపాన పోలేదు. ఇక కట్నం డబ్బు ఏమిస్తాడు నాన్న? అరడజన్ మేనత్తలున్నా తనకు ఈడైన బావను కన్న పాపానపోలేదు ఏ మేనత్తా. అందరికి పెద్దవాళ్ళు ఆడపిల్లలు. వాళ్ళకు పెండ్లి సంబంధాలు చూడడం, వాళ్ళకు పెండ్లి జరిపించడమూ చేస్తూవుండేవాడు నాన్న, నాయనమ్మ బలవంతంవల్ల. దాంతో నాన్నగారు అలసిపోయారు.

అమ్మకు ఇంట్లో గుడ్డిగవ్వ విలువలేదు. వంటమనిషిలాగా ఇంట్లోవాళ్ళకూ, బయటవాళ్ళకూ వండివార్చడమే ఆమె డ్యూటీ! ''సంధ్య పెండ్లి సంగతేం చేశారు?'' అంటుంది అమ్మ, అమావాస్యకూ, పూర్ణిమకూ. ''చూస్తున్నా'' అంటాడు నాన్న. పిచ్చి అమ్మ! నిజమేననుకుని మళ్ళీ పదిరోజులు ఆగి, అదే ప్రశ్న వేస్తుంది. నాన్న అదే సమాధానం చెబుతుంటాడు.

అదృష్టవశాత్తూ నాన్న కన్న సంతానంలో తనొక్కతే పెండ్లీడు కొచ్చింది. తనకు వున్న ఒక్క చెల్లికీ పన్నెండేళ్ళుంటాయి. అన్నయ్య బి.ఏ. తప్పి బలాదూరుగా నాటకాలలో తిరుగుతుంటాడు. తమ్ముళ్ళలో ఒకడు కాలేజీకి వచ్చా, ఇంకోడు హైస్కూలులోనే వున్నాడు.

నాన్న ఇంకో నాలుగేళ్ళలో రిటైర్ అవుతాడు. ఆనాటికి ప్రావిడెంటుఫండుతో తనకు పెండ్లి చేయాలని ఆయనగారి కడుపులోని ఆలోచన. ఈలోపల పెండ్లి చేయడం అసంభవం! ఏమో? ఆ ప్రావిడెంటుఫండుకూ ఎన్ని అవాంతరాలొస్తాయో?

ఇలా ఆలోచించుకుంటూ సంధ్య యిల్లు చేరుకుంది. తలుపు తట్టగానే సంధ్య తల్లి శకుంతలమ్మ తలుపు తీసింది.

''ఏమే! ఈరోజు తమ ఇంట్లో నీవు వుంటావని పుండరీకాక్షయ్య కబురుచేశాడు.''

''ఉందామనే అనుకున్నాను.''

''పెండ్లిచూపులు అయ్యాయా?''

''ఆఁ!''

''అదేంటే? రాత్రి ఏడుగంటలకు పెండ్లిచూపులు పెట్టించారట! ఆ వచ్చినవాళ్ళు రాత్రిపూట ఎలా వచ్చారే!''

''రాత్రి వస్తారు, అర్ధరాత్రి వస్తారు, తెల్లవారుఝాము వస్తారు. స్వరూపరాణి మేలు కోరేవాళ్ళు స్వరూపరాణికి నలుగురున్నారు కాబట్టి అంత శ్రద్ధ తీసుకున్నారు. పగటిపూట చూపిస్తే దాన్నెవడు నచ్చుతాడు?''

''అవందమ్మా! అనండి! అంతా నవ్వేలనండి! ఇరవై ఒక్క ఏళ్ల కూతురు ఎదిగి, ఇంట్లో ఉందని ఆయనకు తెలిస్తేగా! చీమ కుట్టినట్లుగాకూడా లేదు'' అన్నది శకుంతలమ్మ దాదాపు, ఏడుస్తున్నట్లుగా.

సంధ్య నాలుక కరుచుకుంది. ఛ! ఛ! మరీ సిల్లీగా బిహేవ్ చేస్తున్నాను అనుకుని, తల్లిని తియ్యని మాటలతో సమాధానపరచి, తన మంచం వెతుక్కొని, పంచలో వేసుకుంది. పంచలో తమ్ముళ్ళూ, చెల్లి పడుకుని ఉన్నారు. గుంటూరు సంబంధాన్ని గురించి మరికొన్ని విషయాలు తెలుసుకొని, శకుంతలమ్మ ఇంట్లోకెళ్లి తలుపులు వేసుకుంది.

[ఇంకా వుంది]

ప్రశ్నావళి

— కె రామలక్ష్మి

వై హెచ్ ఎస్ ఆర్ — డోర్నకల్

మీ జీవితంలో మరపురాని సంఘటన ఏమిటి?

★ ఇంకా ఏం జరగలేదు సోదరా, అందుకై ఎదురుచూస్తున్నా

మరుమల్లియకన్న తెల్లనిది, మకరందముకన్న తియినిది — ఏమిటో?

★ స్నేహమా? కాదు స్వార్థం!

పి ఎస్ ఎన్ — పూసాల

ఈరోజులలో పరస్త్రీ ముఖం చూడకుండా సత్ప్రవర్తన సత్కర్మలతో కూడిన పునీతమైన మగవాడు ఈ ప్రపంచంలో శూన్యం అంటాను మీరేమంటారు?

★ మీ ఊహే సిల్లీగా వుందంటాను పర స్త్రీ ముఖం కనిపించకుండా పురుషుడే కాదు, పరపురుషుని ముఖం కనబడకుండా స్త్రీలు కూడా వుండడం — కుదరని రోజులివి కలిసి పని చేస్తూ ప్రయాణిస్తూన్న ఈ రెండు తెగల వ్యక్తులూ — ముఖం ముఖం చూసుకోకుండా ఎలా?! అంచేత సత్ప్రవర్తనకి సత్కర్మలకి — ముఖం చూసుకోక పోవడం కాదు — కాంది ఇంకేదో వుండివుండాలి కాస్త ఆలోచించండి!

బి జి ఆర్ — సౌతమావూరు

ఆడదాని ప్రేమకు, ఆల్కహాలుకు ఒక్కసారి అలవడితే అతుక్కుపోయే ప్రమాదం వుందంటాను

★ మానసిక స్థయిర్యం లేనివాళ్ల కంతే

కాలుకు తగిలిన రాయినైనా ఆరాధిస్తారు గాని, కాలుజారిన ఆడదాన్ని పూజించరు ఎందుచేత?

★ ఆడది రాయి కాదు కనుక?

డి ఎమ్ ఎస్ — విజయవాడ

ఇండియాలో నాడకంలో వున్న భాషలలో ఇంగ్లీషు తరువాత హిందీ అని నేను, కాదు తెలుగు అని నా మిత్రుడు అంటున్నాడు

★ లెక్కలే నిజమైతే — ఇంగ్లీషు వదిలేస్తే హిందీ తరువాత—అధిక సంఖ్యాకులు వాడుతున్నది— తెలుగుభాష అని అంటున్నారు కాని అదేం కర్మో ఆంధ్రరాష్ట్రంలో కూడా హిందీని నెత్తిన పెట్టుకొంటున్నారు! నిజానికి భాషాభిమానం విషయంలో తమిళులని చెప్పుకున్నాకే— ఎవరినైనా చెప్పాలి

జి ఎ కె ఏ — కొత్తపల్లి

దైవాజ్ఞ లేనిదే యీ భూప్రపంచంమీద ఏ చిన్న పని జరుగదుకదా, పాపం పుణ్యం కూడా భగవంతుని ఆజ్ఞ మీద చేస్తున్నప్పుడు — ఆత్మలు స్వర్గం నరకాలకి పోవడం ఏమిటి?

★ పాప పుణ్యాలను బేరీజు వేసుకొనే అధికారం మనకే వదిలిన ఘటికుడు భగవంతుడు మన బలహీనతలే — మన దారి నిర్ణయిస్తాయి

జి ఎమ్ ఎస్ — పెనుమంద్ర

మీరెప్పుడైనా ఏప్రిల్ ఫూల్ అనిపించుకున్నారా?

★ ఒక్క ఏప్రిల్ ఒకటనేం కర్మ? ప్రతిరోజూ ఫూల్ అవుతూనేవుంటాను — ఏదో విషయంలో

స్నేహానికి బంధుత్వానికి తేడా ఏమిటి?

★ స్నేహం బంధుత్వానికి దారితీయవచ్చు బంధుత్వంలో — స్నేహం నిలుపుకోడానికి సర్వత్రా తాపత్రయపడుతూనేవుండాలి అదే పెద్ద తేడా

డి ఎన్ ఆర్ — మిట్టపల్లి

పెళ్ళంటే నూరేళ్ళ పంట మరి ప్రేమంటే?

★ క్షణ క్షణం చెలరేగే మంట

ఐ కె — కనిగిరి

ముందు గొయ్యి వెనక నుయ్యి అన్నారు పెద్దలు మరి పక్కనో?

★ పెద్దలు — మనిషి అడ్డపీత నడకలు నడుస్తారని ఊహించివుండరు! అందుకే పక్కల ముళ్ళదారి లని మనం చెప్పుకోవాలి

పి సి ఎస్ — ఆదోని

మగవాడు చెడిన, బాగుపడిన ఒక ఆడదానివల్లే మీరేమంటారు

★ ఆడది బాగుపడడానికి కారణాలు ఏమేనా కావచ్చు గాని చెడిపోడానికిమటుకు కారణం మగవాడే నంటాను దీనికి మీరేమంటారు?

ఎమ్ ఎమ్ — ఇల్లెందు

అస్తవ్యస్థంగా తయారైన నేటి సామాజిక వ్యవస్థ కబంధహస్తాల్లో చిక్కుకున్న మన దేశ రాజకీయాలపై మీ అభిప్రాయం?

★ ఎవరివి కబంధహస్తాలు? రాజకీయాలవా? సమాజానివా? సమాజాన్ని కబంధుడి తమ్ముడిలా తయారుచేసింది ఎవరు? ఈ రాజకీయ కబంధులు కారా? అధికారానికి ముఖంవాచినట్టు నానాగడ్డి కరుస్తూన్న రాజకీయ నాయకుల నుండి — ందు — జనాన్ని రక్షించాలి లేకపోతే గద్దె నెక్కి కూర్చుని — వీళ్ళని మళ్ళీ నల్చుకుతినేస్తారు

బి బి ఆర్ - ఉర్వకల్లు

సిరి నిద్ర మనస్సు యీ మూడింటినీ నష్టపరిచేది సినిమా మీరేమంటారు?

★ ఈ మూడింటికీ ఇంతకంటే విలువైన పనేముంది! ఈ రోజుల్లో — చెప్పండి

ఆర్ ఎన్ ఎస్ ఆర్ - అన్నదేవరపేట

నేను ఒక అమ్మాయిని ప్రేమించాను ఆ విషయం ఆమెకి ఎలా తెలుపాలో అర్థంకాకుండా వుంది

★ మీ వయస్సు ఎంత? మరీ కట్నానికి గుడ్‌బై మనిషిలా మాట్లాడుతున్నారు! వయస్సు వస్తే ప్రేమ — దారి చూపుతుంది అది రాకుండ కోటలు కట్టితే — "నాకు పద్దెనిమిదేళ్లు - ఇంటర్ చదువుతున్నా నేను ప్రేమించి పెళ్లి చేసుకుంటాను — ఏ వికలాంగునో, విధవనో" అంటూ పబ్లిసిటీకి దారి చూపుతుంది అంచేత మిరే తేల్చుకొండి

యు ము — ఎమ్మిగనూరు

ఆశలతో జీవితం గడిపేవారు ఉపవాసాలతో మరణిస్తారా?

★ ఇదేం గొడవండీ బాబూ, మరీ ఆత్రేయ డైలాగులాగ వుంది! ఏం ఆశలుంటే అన్నం సహించదా?!

అధికారంలో వున్నవాడు మృదుమధురంగా మాట్లాడ్డం నేర్చుకోవాలా?

★ మరీ అలా నంగిరిగానా? అక్కర్లేదు అధికారంలో వుండాలనుకొంటే మాట మంచి వుండాలి తన తప్పులు తెలుసుకోవడమేకాదు, ఎదుటివారి తప్పులు మన్నించకల్గాలి

కళ్లజోడు

డా ఆర్. అనంతపద్మనాభరావు

యువతరం సమస్యల తోరణాలు
వీధినిండా అలంకరించారు
ఆ రోజు పూరంతా
అంగరంగ వైభోగంగా వేడుకలు
నిరుద్యోగ సమస్యా వేదికను
నింగిని తాకేలా వేశారు
సభాధ్యక్షుణ్ణి ఎవర్ని చేద్దామనే
సమస్య సభలో కలవరానికి కారణం
'నే' నంటే 'నే' నని నాయకమ్మన్యులు
నెమరువేస్తున్నారు ఘనకార్యాలు
కులాంతర వివాహాలు తమ చేతిమీదుగా
రోజు కొకటి జరిపించిన రావుగార్ని
వేదికపైకి అగ్రాసనాధిపతిగా
విచ్చేయండని ఆహ్వానించారు కార్యకర్తలు
జరీ కండువా మడత సరిజేసుకొంటూ
సజావుగా వేదిక మెట్లెక్కారు రావుగారు
"రావుగారు తమ కుటుంబంలో
వర్ణాంతర వివాహం జరిపించలేదేం?"
సభాసదుల్లోంచి చిక్కుప్రశ్న
సరాసరిగ వినిపించింది మైకులో
'కళ్లజోడు మరిచిపోయా' నన్న నెపంతో
కలకలంలోంచి ఎలానో బయటపడ్డారు రావుగారు

బదిలీ

పి. అరుణా రవిశంకర్



"ఇదిగో భాయ్! నీకూ ఓ లెటర్ వచ్చింది"

తలవంచుకొని రాసుకుంటున్న నా ముందు ఓ కవరును పడేసి వెళ్ళిపోయేడు నా కొలీగ్ బ్రహ్మానందం

పెన్‌ని పక్కగా పెట్టి కవరు చించాను అది నా భార్య మాలతినించి వచ్చిన ఉత్తరం ఆ ఉత్తరంలో ఏం వుంటుందో నాకు తెలుసు.

"శ్రీవారికి,

నమస్కరించి వ్రాయునది పది రోజులనించీ మీ దగ్గరనుండి ఉత్తరంముక్క లేదు ఇంతకీ మీ ట్రాన్స్‌ఫర్ ఏమయ్యింది? వచ్చేట్టుగా వుందని రాశారు గదా? డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు బాగా తీవ్రంగా ప్రయత్నం చెయ్యండి ఈ విషయం గురించి నేను అంతగా మీకు చెప్పవలసింది ఏముంది? పిల్లల గొడవ మామూలే నేను చెప్పిన మాట వినటంలేదు నా ప్రాణాలు తీస్తున్నారు వెంటనే లెటర్ రాయండి వుంటాను మరి

మీ

మాలతి"

ఆ ఉత్తరాన్ని చదివి భారంగా నిట్టూర్చాను నా బొంద ట్రాన్స్‌ఫర్ అవదూ – చావదు – ఆ మధ్య విజయవాడకు ట్రాన్స్‌ఫర్ వచ్చేట్టుగానే అనిపించింది కాని మళ్లీ వెనక్కుపోయింది ఈ విషయం మాలతికి రాయలేకనే వూరుకున్నాను

నా భార్య మాలతి విజయవాడ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో టైపిస్టుగా పనిచేస్తోంది నేను భాగ్యనగిరంలో ఓ గవర్నమెంటాఫీసులో క్లర్కుగా చాకిరి చేస్తున్నాను మాకు ముగ్గురు పిల్లలు ఆ ముగ్గురు పిల్లలూ మాలతి దగ్గరే వున్నారు

భార్య వుండికూడా హోటలు తిండి తినవలసిన ఖర్మ పట్టింది నాకు మాకు మొదటి వాడు పుట్టేవరకూ ఇద్దరం ఒంగోలులోనే ఉద్యోగాలు వెలగబెట్టాము వాడు పుట్టిన పది నెల్లకు ట్రాన్స్‌ఫర్‌లు మొదలయినాయి అప్పటి నించి ఇంతవరకూ మళ్లీ ఇద్దర్నీ ఒక వూళ్లో వెయ్యలేదు 'భార్యాభర్తలిద్దరినీ కలిపి పుణ్యం కట్టుకోండి బాబోయ్!' అని గవర్నమెంటువారికి ఎన్ని అర్జీలు పెట్టుకున్నా అవన్నీ బుట్టదాఖలు అవుతూనే వున్నాయి ఎప్పటికప్పుడు నన్ను బదిలీ చేస్తారనుకోవటం – చెయ్యకపోవడం ఈ రకంగా బాగా విసిగిపోయేను

పోనీ వారానికోసారి వెళ్లివద్దామా అంటే విజయవాడ అంత దగ్గర కాదు యాభై రూపాయలు చార్జీలు అవుతాయి నా జీతంలో సగం అందుకే పోతుంది అందుకే నెలకో రెండు నెల్లకో భార్యను, పిల్లలనూ తనివిదీరా చూసుకు వస్తున్నాను

మా ముగ్గురు పిల్లలూ – పిల్లలు కారు, పిడుగులు వాళ్ళకు నేనంటేనే కొంచెం భయం మాలతి అంటే అసలు లెక్కలేదు పోనీ వాళ్లను నా దగ్గరే వుంచుకుందామంటే వాళ్ల సంరక్షణ అంత ఈజీ కాదు

"ఏమిటి భాయ్! అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావ్ ఉత్తరం చేతిలో పట్టుకొని? ఏమిటి కథ?" నవ్వుతూ అడిగాడు బ్రహ్మానందం

"ఏముందోయ్ మామూలే! మా ఆవిడ నా ట్రాన్స్‌ఫర్ గురించి రాసింది ఏం చెయ్యాలో అర్థం కావటంలేదు" దిగులుగా అన్నాను

"ఒక పనిచెయ్ భాయ్! విజయవాడలో వున్న మన ఆఫీసునించి ఇక్కడకు ఎవరయినా ట్రాన్స్‌ఫర్ మీద రావాలనుకుంటున్నారేమో కనుక్కో అలాంటప్పుడు నీ పని సులభమవుతుంది" అన్నాడతను

నాకు ఆ ఆలోచన బాగానే వున్నట్లనిపించింది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ ఐతే త్వరగా ఐపోయే అవకాశాలు బాగావున్నాయి

ఆ రోజునే మాలతికి ఓ ఉత్తరం రాశాను ఈ విషయం గురించి

రాశానేగానీ నాకు నమ్మకంలేదు విజయవాడ వదులుకొని హైదాబాద్ వరకు ఎవడొస్తాడు?

కాని నాలుగోరోజునే మాలతి దగ్గరినుంచి ఉత్తరం వచ్చింది గోపాల్రావు అనే అతను హైద్రాబాద్ రావాలని అనుకుంటున్నాడుట – నా కిష్టమయితే వెంటనే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు అప్లికేషన్ పెట్టమనీ, తనుకూడా అప్లై చేస్తానన్నాడనీ రాసింది మాలతి

ఆ మరురోజునే నేను అప్లికేషన్ పెట్టాను మాలతికి జవాబు రాశాను

నా అదృష్టం పండింది పనులన్నీ చకచకా జరిగిపోయేయి నాకు విజయవాడకు ట్రాన్స్‌ఫర్ అయింది ఐతే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ మాత్రం కాదు – గోపాల్రావ్‌ని హైద్రాబాద్ వెయ్యలేదు - ఒంగోలు వేశారు ఏదో ఒకటి – ట్రాన్స్‌ఫరయింది - అంతే చాలునుకొని సంతోషంగా మాలతికి ఉత్తరం రాశాను త్వరలో బయల్దేరివస్తున్నానని మన కష్టాలు గట్టెక్కాయి మాలతీ అనీను

నేను మాలతికి ఉత్తరం రాసిన రోజునే నాకు మాలతి దగ్గర్నించి ఓ ఉత్తరం వచ్చింది ఆ ఉత్తరం చదివి తూలి పడబోయేను

"శ్రీవారికి నమస్కరించి వ్రాయునది మన కష్టాలు తీరిపోయాయి మంచి రోజులు వచ్చాయి నాకు హైద్రాబాద్‌కు ట్రాన్స్‌ఫరయింది మీరు వెంటనే మీ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్‌ని క్యాన్సిల్ చేసుకోండి. నేను వారం రోజుల్లో బయల్దేరి వస్తున్నాను"

ఇదీ ఉత్తరం

ఏం చెయ్యగలను? మళ్లీ విషయాన్ని

పెట్రోలు కొరత: కార్లున్నవాళ్ల పాట్లు!

అమెరికా ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు ఆపివేసింది అమెరికాలో ప్రతి ఒక్కరూ రోజూ కనీసం మూడు మైళ్ళ మేరకైనా కార్ల డ్రైవింగు తగ్గించుకోగలిగినట్లయితే రోజుకి 7,00,000 పీపాల పెట్రోలు పొదుపు చేయవచ్చునని అంచనా

నేడు అమెరికన్లు చిన్నకార్లపై దృష్టి మళ్లించారు గృహాలలో కూడా ఇంధనం పొదుపు చేసుకొంటున్నారు పరిశ్రమలలో, ఆఫీసులలో ఇంధన వినియోగంలో వృధా కావటాన్ని నివారించటానికి కట్టుదిట్టమైన చర్యలు జరిపిస్తున్నారు

ఇప్పుడు అమెరికన్లు తమ వాహనాల వేగం తగ్గిస్తున్నారు ప్రయాణాలు కూడా తగ్గించుకొంటున్నారు అవసరమైతేనే కారు డ్రైవు చేస్తున్నారు చాలమంది "పూల్ సిస్టమ్" అనుసరిస్తున్నారు అంటే ఒకే ప్రాంతంలో నివసిస్తూ, ఒకేచోట పనిచేసేవారు ముగ్గురు - నలుగురు కలిసి ఒకే కారులో వెళ్లటం అలవాటు చేసుకొంటున్నారు పలువురు బస్సులలో, రైళ్లలో ప్రయాణం చేస్తున్నారు [ఈ పద్ధతి మన దేశంలో కూడా వుంది -]

గత సంవత్సరం అమెరికన్ కారును వారానికి సగటున 190 మైళ్ళ డ్రైవ్ చేసేవారు కాగా, ఈ యేడు వారానికి సగటున 175 మైళ్ళ మాత్రమే డ్రైవ్ చేస్తున్నారు 1985 నాటికి గ్యాలన్ పెట్రోలుకి 27.5 మైళ్ళ డ్రైవ్ చేయటానికి వీలయ్యే ఇంధన పొదుపు ప్రమాణాలను కార్లలో ఏర్పాటు చేయాలన్న ఆలోచన జరుగుతున్నది ఇప్పటి ప్రమాణం గ్యాలన్‌కి 19 మైళ్ళ మాత్రమే

విన్నవించుకుంటూ ఓ అప్లికేషన్ పెట్టాను నాకు ట్రాన్స్‌ఫర్ వద్దని ఐనా నా మొర వినిపించుకున్న నాధుడే లేడు చచ్చినట్టు విజయవాడ వెళ్లవలసివచ్చింది — మాలతి పరిస్థితీ అంతే — హైదరాబాద్ వెళ్లిపోయింది

మళ్లీ మా కథ మామూలే ప్రభుత్వంవారికి 'భార్యభర్తలను విడదీయకండి — పాపం కలిపి పుణ్యం కట్టుకోండి' అంటూ నా విన్నపాలు మొదలు

నా విన్నపాల కార్యక్రమం ఇలా కొనసాగుతూ వుండగానే ఓ నాలుగునెల్ల తర్వాత మాలతి ఉన్నట్టుండి పిల్లలతో పిడుగులాగా ఇంటిముందు ఆటో దిగింది

"ఏమిటి చిట్టీ! ఇలా వూడిపడ్డావ్? పండక్కి నేనే వద్దామనుకున్నాను" అన్నాను నవ్వుతూ

"ఇంకెక్కడికి వస్తారు? నేనే వచ్చేశాను!" అన్నది

"అంటే?"

> త్వరలో
> 'దిగిరాని స్వర్గాలు'
> సీరియల్!

బదిలీ

"అంటే ఏముంది? వెధవ ఉద్యోగానికి నీళ్లొగిలి మరీ వచ్చాను"

"ఏమిటీ! రిజైన్ చేసి వచ్చావా?"

"అవును - చెయ్యక ఏం చావమంటారు? ఎన్నాళ్ళు ఇలా? మీరిక్కడ — నేనక్కడ — బతికినంతకాలం ఇంతేనా? మీరెప్పుడో ఇన్‌స్పెక్షన్‌కి వచ్చినట్టు నెలకో రెండు నెలలకో రావడం ఈ వెధవలు నన్ను చంపుకుతింటున్నారు నా ఎదురుగానే తాగిపారేసిన సిగరెట్టు పీకలు తెచ్చి ఆటలు ఆడుతున్నారు — తాగుతూ చిన్న చిన్న దొంగతనాలు కూడా మొదలుపెట్టారు ఒక్క వెధవకీ అక్షరాలు రావు మీరు సంపాదించే నాలుగు వందలూ చాలకపోయినా ఫర్వాలేదు ఇంట్లో కూర్చునే అప్పడాలు, వడియాలు చేసి నేనూ సంపాదిస్తాను అంతేగానీ, నేను మిమ్మల్ని వదలి వుండలేను" అని కళ్లనీళ్లు పెట్టుకుంది

మొదట్లో మాలతిమీద కోపం వచ్చినా తర్వాత ఆమె వాదన బాగానే వున్నట్లనిపించింది కానీ, గవర్నమెంటు ఉద్యోగాన్ని వదిలేసినందుకు బాధ కలిగింది గవర్నమెంటువాళ్లు నా మొర ఆలకించినట్లయితే ఇలా చెయ్యవలసివచ్చేది కాదుగదా అనుకున్నాను

ఏమయినా పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని మాలతి తీసుకున్న నిర్ణయం సబబుగానే అనిపించింది ఒకందుకు సంతోషం కలిగింది — ప్రభుత్వంవారికి మమ్మల్ని కలపండి బాబోయ్ అంటూ నా విన్నపాల గొడవలేదు ●

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]



రావ్ డైనింగు టేబుల్ దగ్గర కూర్చున్నాడు

పిల్లలు తల్లిమీదకోప్పడుతున్నారు గోంగూర, కొత్తిమీర కారాల కారం తినలేమని అలాంటి పచ్చళ్ళు చెయ్యొద్దనీను రావ్ వాటికేసి చూశాడు ఆశగా భార్య కమల కళ్ళతోటి వారించి ప్రాధేయపడింది కమలకు తెలుసు తన కవి ఎంతో ఇష్టమని తనకు మామూలుగా చపాతీలు, ఓగ్లాసుడు హార్లిక్సు పెట్టింది కమల కమల మట్టుకు ఇష్టంగా ఆవకాయ, కొత్తిమీర కారం, గోంగూర ఇంకా వేపుడు కూర వీటితో అన్నం తింటోంది పిల్లలుకూడా అవే కొంచెం కొంచెం తింటున్నారు రావ్‌కి గోంగూర, ఆవకాయ చూసేసరికి నోరూరింది కాని వెంటనే డాక్టరు మాటలు గుర్తొచ్చాయి కమల, రావ్‌కేసి జాలిగా జూసింది అవును తను అలాంటివేమీ తినకూడదు రావ్ విధి విచిత్రానికి బాధగా నవ్వుకున్నాడు అన్నీ అందుబాటులో ఉన్నప్పుడు ఏమీ తినకూడదు ఏమీ లేనప్పుడు నక నక ఆకలి పిల్లలు అన్నీ అందుబాటులో ఉన్నాయి కనుక అవి ఇష్టపడటం లేదు అందులో మారుతున్న కాలంలో, తమ ఇప్పటి స్థితిలో అలాంటి పచ్చళ్ళుకూడా తింటున్నామంటే వాళ్ళకి చిన్నతనమేమో రావ్ మనసు కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది

అవి తన చిన్నప్పటి రోజులు తండ్రి బ్రతకలేక బడిపంతులు గంపెడు పిల్లలు తనపై వాళ్ళందరూ అక్కలే తను అయిదోవాడు తన తరువాత ముగ్గురు ఉన్నారు తండ్రి చాలీ చాలని జీతంతో పదిమంది తినాలి అమ్మ తరచుగా గోంగూర పచ్చడే చేసేది ఎందుకంటే బజార్లో చవకగా అదే దొరికేది అయినా ఆ గోంగూర ఎప్పుడి కూడా అందరికీ సరిపడేదికాదు ఒక్కసారి ప్రసాదంలా వడ్డించేది అమ్మ మారడిగితే కసురుకునేది అన్నం కూడా సరిగ్గా పెట్టేది కాదు చాటుగా గుడ్లనీరు కుక్కుకునేది అమ్మ భావాన్ని, భాషనీ తనలేతమనసు ఖచ్చితంగా చదివేది ఎక్కువగా రెట్టించకుండా లేచిపోయేవాడు కాని అక్కయ్యలు, తమ్ముళ్ళు గోలచేసేవారు తండ్రి నాలుగు వడ్డించేవాడు తండ్రి కష్టపడి తల తాకట్టు పెట్టి ముగ్గురు అక్కయ్యలకి పెళ్ళిళ్ళు చేశాడు కాని ఇంకా మిగిలిపోయారు

ఆరోజుల్లో కడగొట్టుది చిట్టికి పాలడబ్బాలు కొనలేక తండ్రి సతమతమయ్యేవాడు ఆ రోజు తనకి బాగా గుర్తు ఆనెల తండ్రి జీతం రాలేదు చిట్టికి పాలడబ్బా లేదు అయిపోయింది తల్లి దగ్గర పాలులేవు పాలవాడు డబ్బివ్వలేదని వాడుక మానేశాడు చిట్టి రాత్రి పగలు గుక్కపెట్టి రెండు రోజులు ఏడ్చింది అమ్మ పంచదార కలిపి ఆరారా నీళ్ళు పోసింది ఆ రోజంతా ఏడుస్తూనే ఉంది తల్లి చిట్టిని చావబాదింది తండ్రి శివమెత్తాడు ఆ రాత్రి చిట్టిని తను కాళ్ళమీదేసుకుని ఆడించాడు చిట్టి ఏడ్చిఏడ్చి నిద్రపోయింది మలురోజు చిట్టి మరి ఏడవలేదు అవి ఆకలి బాధలని, ఆ బాధలోనే చిట్టి ప్రాణాలు పోయాయని తన గుండెలమీద చెరగని ముద్రలు వేశాయి చిట్టి పోయినందుకు కొంచెంసేపు విచారించినా, ఒకరు తగ్గినందుకు అందరిలోనూ నిట్టూర్పుల విడుపే కనపడింది తండ్రి చిట్టినెత్తుకుని వెడుతూంటే తను కాకీ నిక్కరు బొడ్డుపైకి లాక్కుని వెనకగా వెళ్ళి చిట్టి కడసారిగా మట్టిలో కలిసిపోవడం చూశాడు ఆ దృశ్యం మరిచిపోగలడా?

అప్పుడప్పుడు తండ్రిఊళ్ళో వాళ్ళిచ్చిన పండో ఫలమో తెచ్చేవాడు ఒక పండు పది ముక్కలు చేసేసరికి అసలు తిన్నట్టే ఉండేది కాదు ఏదో కలికేవాడు కిళ్ళీ బడ్డీలకి వేలాడదీసిన అరటిపళ్ళకేసి ఆశగా చూసేవాడు చిన్నప్పటినుంచి తను మంచి మార్కులతో ప్యాసయ్యేవాడు బాగా చదివేవాడు అందరూ మెచ్చుకునేవారు భారతక్క చాటు మాటుగా తన వాటాలోవికూడా ఇచ్చి తినిపించేది


ష్ప్వేప్టంచ భంతక్కకు తనంటె ఎంతో ఇష్టం ఎందుకో తెలియదు స్కూలు ఇంటర్వెల్ సై మ లో కలవారి గిరిధారి ఎస్ ఫ్రూట్‌లు, అయ్యరు హోటలులో టిఫిను తింటుంటే తను కేవలం అయ్యరు హోటలు పకోడీ, పెసరట్లసువాసన మాత్రం పీల్చేవాడు అందరూ తనని వెక్కిరించేవారు పేదవాడని లంచ్ అవరులో పంపు నీళ్ళు తాగి కడుపు నింపుకునేవాడు స్కూలు ఆవరణలో గాంధీగారి బొమ్మ ఉండేది ఆ పాదాలకి నమస్కరించేవాడు దీనంగా

ఆ వయసులోనే వచ్చీరాని జ్ఞానంలో గవర్నమెంటు వారి పోస్టర్లు, ఎర్రత్రికోణం గుర్తులు కొంచెం కొంచెం అర్థమయ్యేవి ఒక పండు నలుగురు తినడానికి, పదిమంది తినడానికి ఎంత తేడా? గిరిధారి వాళ్ళ నాన్నకి అమ్మకి అతడొక్కడే సంతానం తండ్రిని మనసులోనే తిట్టుకునేవాడు తన కళ్ళముందు అమ్మ, అక్కయ్య తమ్ముళ్ళ దీనమైన ముఖాలు ఎప్పుడూ తిరుగుతూండేవి

కాలచక్రం అలా ఆగిపోలేదు తాను బి ఏ ఫస్టు క్లాసులో పాసయ్యాడు రంగనాథంగారి మిల్లులో కుదిరాడు ప్రైవేటుగా ఎమ్ ఏ చదివాడు కాలేజీలో లెక్చరరుగా జాయిన్ అయ్యాడు తరువాత కాలేజీలో పని చేస్తూనే డాక్టరేటు తీసుకున్నాడు మిల్లువదిలి కాలేజీలో ప్రవేశించేటప్పుడు ఇంకా ఇంకా పైకిరావాలని రంగనాథంగారు ఆప్యాయంగా దీవించారు అప్పుడే తండ్రి పోవడం జరిగింది నెల నెలా తన జీతంలో మిగిలిన డబ్బుతో, పి ఎఫ్ లోను జతచేసి భారతక్క పెళ్ళి చేశాడు భారతక్క వెడుతూ వెడుతూ తనని దీవించింది "తమ్ముడూ! నీది చాలా గొప్ప మనసురా చిన్నవాడి వయినా చేతులెత్తి నమస్కరించాలి తమ్ముడివయినా బాధ్యతగా నా పెళ్ళి గురించి ఎంతో తాపత్రయ పడ్డావు భగవంతుడు నిన్ను ఆదరిస్తాడురా నా తండ్రీ!" అని "అదేమిటే అక్కా అలా అంటావ్" అని తను కాళ్ళకి నమస్కరించాడు భారతక్క గడ్డం పట్టుకుని హత్తుకుంది

ఆ దీవెనలే ఫలించాయి తను కనులని చేపట్టాడు ఇప్పుడు యూనివర్సిటీలో రీడరుగా పని చేస్తున్నాడు నేడోరేపో ప్రొఫెసరు కాబోతున్నాడు తమ్ముళ్ళని పైకి తెచ్చాడు తల్లి తనతోనే ఉంది జీవితంలో ఎంతో పైకి వచ్చాడు పెద్ద కుటుంబంలోని సాధక బాధకాలు క్షుణ్ణంగా తెలిశాయి అందుకనే రఘు, రమల తర్వాత ఆపరేషను చేయించుకున్నాడు కుటుంబ సంక్షేమ పథకాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మాడు కాని ఒకజబ్బు తరువాత మరొకటి తనకి సంక్రమించాయి ముందుగ ఆపెండిసైటిసు నొప్పి రెండుసార్లు వచ్చి తగ్గింది డాక్టరు ఆకుకూరలు, పీచుగల పదార్థాలు, వేపుళ్ళు తినొద్దన్నాడు తరువాత గేస్ట్రిక్ట్రబుల్ వచ్చింది టీ, కాఫీ, పచ్చళ్ళు, కారం, పులుపు డాక్టరు మానేయమన్నాడు మెల్లిమెల్లిగా తన కిష్టమైన ఆవకాయ, గోంగూర, ఫిల్టరు కాఫీ వీటికి దూరమయ్యాడు తరువాత షుగరు కంప్లైంటు, బ్లడ్ ప్రెషరు వచ్చాయి పంచదార, అన్నం, పొటాటో ఇవన్నీ తగ్గించేశాడు ఇలా ఒక్కటొక్కటేరావడం, ఒక్కొక్కదానికి దూరమవడం జరిగింది ఎప్పుడేనా డాక్టరు మాటల్ని పెడచెవిని పెట్టి ఏ గోంగూరైనా తింటే మలురోజు ఫలితం అనుభవించేవాడు వాటిని తినాలని ఎంత కోరికగా ఉన్నా బలవంతంగా అణచుకున్నాడు

రావ్ వర్తమానంలోకి వచ్చాడు పిల్లలు ఆవకాయ, గోంగూర తినని మారాం చేస్తున్నారు వాటి రుచి ఎలా చెప్తే వీళ్ళకి అర్థమవుతుంది? ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి అన్నట్టు అప్ప్పుడు ఉంటే, అట్టడుగు విలువలు తెలియవు ఆవకాయ, గోంగూర, కొత్తిమీర కారం రావ్‌ని వెక్కిరిస్తున్నాయి నువ్వు నన్ను ముట్టుకోలేవులే అన్నట్టు తనుఇప్పుడు అన్నీ కొనగలడు, కాని అన్నీ తినలేడు రావ్ భారంగా డైనింగు టేబుల్ దగ్గర నుంచి లేచాడు



అరికాళ్లలో ఆరోగ్యం !

మనిషికి వచ్చే ఏ జబ్బయినా అరి పాదాలలో తేడాల వల్ల వస్తుందని, కనుక ఏజబ్బయినా కేవలం పాదాల చికిత్సవల్ల మాన్పవచ్చునని చైనా డాక్టర్లు అంటున్నారట. నిద్రపట్టక అవస్థపడే వారి కాలి బొటనవేళ్ళను సుమారు పదినిముషాలసేపు రోజూ రాత్రి నిద్ర పోయే ముందు మసాజ చేస్తే వారు హాయిగా నిద్ర పోతారని డాక్టర్లు నిరూపించారట. నిద్రమాత్రలు గానీ, ఇంజక్షన్లు గానీ పని లేదట.

లంచానికి శిక్ష !

ఒక ఆదివాసి స్త్రీ వద్ద లంచం అడిగిపుచ్చుకున్న నేరానికి రాంచి జిల్లాకు చెందిన రాణిపోలీసు స్టేషను ఆఫీసరు ఇన్‌చార్జిని ఆ వూరి పెద్దమనుష్యులు పెడరెక్కలు విరిచి కట్టి రాణినుంచి పదహారు కిలోమీటర్ల దూరంలో వున్న లపాపుర వరకూ వూరేగింపుగా నడిపించి అక్కడ మేజిస్ట్రేటుకు అప్పగించారట.

జేబుల్లోనే తేడా !

చైనా సైన్యంలో రెండే తరగతులట. ఒక తరగతి ఆఫీసర్లట. రెండో తరగతి యుద్ధవీరులట అందరికీ ఒకే రకం దుస్తులట. ఆఫీసర్ల చొక్కాలకునాలుగు జేబులూ, యుద్ధ సైనికుల చొక్కాలకు రెండే జేబులు వుంటాయట. ఇంతే తేడట.

నటి మాలతి దుర్మరణం

నటి మాలతి హైదరాబాదులో వో విపత్తులో చని పోయారట. హైదరాబాదు కాచిగూడాలో ఆవిడ యింటి పక్కన కొత్తగా వో సినిమాహాలు కడుతున్నారట. ఆ హాలు కొరకు కట్టిన 20 అడుగుల గోడ కుప్పకూలి, మాలతి యింటిమీద పడి, వాళ్ళ యిల్లు గోడ కూడా కూలిపోయిందట. గోడ నానుకుని కూర్చున్న మాలతి మీద గోడ పడడం వల్ల ఆవిడ ఘోరంగా చని పోయారట.

పెట్రోల్లో సారాయి !

అమెరికాలో కార్లకు 90 శాతం పెట్రోలు పది శాతం సారాయీ కలిపి పోసి కార్లను నడపటం ఆరంభించారట. ఈ మిశ్రమానికి గ్యాసోహోల్ అని పేరు పెట్టారట ఇది చక్కగా పనిచేస్తుందని, వుపయోగించడానికి ప్రెసిడెంట్ కార్టర్ కూడా సమ్మతించారట.

57వ ఏట మ్యాట్రిక్ పాస్ !

అస్సాముకు చెందిన 57 ఏళ్ళ పుఖాన్ మొన్న పరీక్షలో హెచ్. యస్. యల్. సి. పరీక్ష ప్యాసయ్యాడట. రాష్ట్ర పి డబ్ల్యు డి. శాఖలో పనిచేస్తున్న యీయన గత 33 సార్లు యీ పరీక్ష కట్టి తప్పి, విసుగుచెందని విక్రమార్కుణ్ణి తలచుకుని 34వ సారి కట్టి ప్యాసయ్యాడట.



ప్రసవ్రతి పాలైన అన్నదమ్ములు

వోమలగూరుకుచెందిన సెట్టిపాపడిఅనే గ్రామంలో 25 ఏళ్ల అయ్యావారని అతను తన ఎడ్లను తన పొలంలో మేపుతూంటే ఆ ఎడ్లు పక్క పొలంలోకి వెళ్లాయట. వాటిని అదిలించేలోగా పక్కపొలం యజమాని అచ్చప్పన్ వచ్చి ఏంరా నా పొలంలో నీ ఎడ్లు తోలుతున్నావు అని పట్టాడి, పట్లాటలో జయం పొందలేదన్న ఆవేశంతో పరుగున ఇంటికి పోయి తుపాకీ తెచ్చి ఆ అయ్యావారును కాల్చేశారట. అతని తమ్ముడు అడ్డొచ్చేసరికి తుపాకీతో నెత్తిన కొట్టి స్పృహలేని దెబ్బ కొట్టి ఆ అచ్చప్పన్ పారిపోయాడట. చావు బ్రతుకుల మధ్య అయ్యావారు, అతని తమ్ముడు సుబ్రమణ్యం ఆసుపత్రిలో వున్నారట.

అంధకారంలో అగాధంలోపడ్డ లారీ !

ధర్మపురిజిల్లా పెంకనికోట ప్రాంతంలో వో వెదుళ్ళ మోసుకు వెళుతున్న లారీ విపరీతమైన వాన వల్ల ఆగిందట లారీలోని వెదుళ్ళమీద కూర్చున్న 12 మంది పనివాళ్ళనీ డ్రయివరు దిగి, ముందు నడిచి, దారి సరుందో, లేదో చూపమన్నాడట. వారు ముందునడుస్తుంటే లారీ వెనుకనడపనారంభించాడట డ్రయివరు. ఒకచోట ప్రవాహం చాలా వేగంగా వున్నందువల్ల కొంచెం పక్కకు లారీ నడిపేసరికి, సర్రున రోడ్డు చివరిభాగం విరిగి, లారీ 30 అడుగుల అగాతంలోకిదొర్లిందట. ఆ నీటిప్రవాహ వేగానికి, లారీపడ్డవేగానికీ, ముందు నడుస్తూన్న 12 మందీ కొట్టుకుపోయి ఆ లోయలో పడితే వారిమీదవెదుళ్ళు పడిపోయాయట. భయంకరమైన చీకటిలో, అర్ధరాత్రి పెనువర్షంలో వారు సహాయం కోసం అరిస్తే ఎవరూలేనందున వారిలో నలుగురు చనిపోయారట. ఎనమండుగురు స్పృహతప్పిపడివుంటే తెల్లారాక చూసిన పుణ్యాత్ములెవరో వారిని రక్షించి ఆసుపత్రిలో చేర్చారట.

ఎం ఓ లను ఫలహారం చేసిన ఎద్దు !

టిపూరులో అక్టోబరు 21 వ తేదీన నరసింహయ్య వూరు బస్‌స్టాండు ప్రాంతంలో టపా లివ్వడానికి పోతుండగా వో ఎద్దుకు ఆకలివేసి అతని చంకలోంచి వో ఏడు మనియార్డరు ఫారాలను లాక్కుందట టపీమని. ఎగిరి గంతేసి ఆ పోస్టుమాన్ నరసింహయ్యకు చూసరులు సహాయం చేసి, అంతా కలిసి ఆ ఎద్దు నోట్లోంచి మనియార్డరు ఫారాలు లాక్కుందామని విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యారట ఆ ఏడు మనియార్డరు ఫారాలనూ భోంచేసి హాయిగా ఆ ఎద్దు కాఫీకని బయల్దేరిందట.



గిలిన తెల్లదనాలని మైమరపించే స్వచ్ఛమయి:
ల్లదనం యిచ్చే స్కోర్—నీలం డిటర్జెంట్ బిళ్ల
ప్రకాశవంతమయిన తెలుపు. తెల్లని తెలుపు.
సాటిలేని తెలుపు! స్కోర్ నీలం డిటర్జెంట్ బిళ్ల
మీ దుస్తుల మురికిని పోగొట్టి వాటికి
పరిశుభ్రమయిన తెలుపుని యిస్తుంది.
స్కోర్ నీలం డిటర్జెంట్ బిళ్లతో ఎన్నో బట్టలు
ఉతకవచ్చు. ఎంతో తెల్లగా. రంగు దుస్తులకి
కూడా మెరుపుతనం తెస్తుంది.
విజయ సాధనలో
తళ తళ మెరిసే తెలుపు!
స్కోర్
నీలం డిటర్జెంట్ బిళ్ల
కేరళ స్టేట్ డిటర్జెంట్స్ & కెమికల్స్ లిమి.
(ఒక ప్రభుత్వ సంస్థ)
LATEST
Score
BLUE DETERGENT CAKE
విజయ సాధనలో
తళ తళ మెరిసే తెలుపు!
FDS KSDC 3022A TEL

4 1 1980 శుక్రవారం మొదలు 10 1 1980 గురువారం వరకు

మేషం:— ఈవారం మీ రాశి గ్రహస్థితిలో చాలా మార్పులున్నాయి. అవి చాలావరకు వ్యాపార, వ్యవహార, సాంఘిక, రాజకీయ రంగాలకు సంబంధించినవై మీకు అనుకూలత చేకూర్చగలవు. పాతసంగా ఋణాలు, వదికరాలు క్రమంగా చేయగలరు. అత్యవసర ఆటలు కల్పగల గ్రహస్థితిగల వారం. ఆర్థిక లాభమున్నది వృత్తిలో గౌరవం లేకపోవుచుంది లాభప్రాప్తి. స్త్రీలకు ఉద్యోగావకాశాలు చాలామందికి లభించగలవు.

వృషభం:— వ్యాపార విస్తరణ క్రియ ప్రయత్నంలో, వ్యవహారములలో ప్రశాంత స్థితి ఆర్థికంగా లాభదాయకమైన వారం. వార ద్వితీయ భాగంలో సుఖశాంతులుంటాయి. దైవసంబంధ కార్యాలు ప్రోత్సాహకరంగా ఉండగలవు. కుటుంబ వ్యవహారాలు హాయిగా నుండగలవు. శుభ కార్యాలకు వెళ్ళుటకి ప్రయాణం చేయుట సంభవం. ఉద్యోగం చేసేవారికి సంతోషదాయకమైన వార్తలు వినుట సంభవం. స్త్రీలకు సుఖశాంతులకు ఆర్థికంగా ఏమీ లోపం లేదు.

మిథునం:— మీ పై అధికారుల మన్ననలు పొంద గలరు. ఉన్నతవర్గీయులతో మీకు పరిచయమేర్పడ గలదు. భారీ వ్యాపారాలు ఫలించే వారం. పత్రిక, ఫిల్ము, కళారంగాలలోని వారికి గౌరవం పెరుగుతుంది. స్త్రీలకు: పెద్ద ఉద్యోగాలలో గాని, కళా రంగంలో గాని ఉన్న వారికి మహత్తరావకాశాలుంటాయి. క్రొత్తగా చేయవలసిన అగ్రిమెంట్లు కూడా ఉంటాయి.

కర్కాటకం:— ఆరోగ్యలోపం గాని, ఏదైనా ఆందోళన గాని, మానసికంగా బాగా లేకపోవటం గాని, ఈ వారం చెప్పవచ్చు. బాగా ఆలోచించి ఆశించిన ప్రయోజనం అంతగా ఫలించటం అని చెప్పవీలు లేదు. ఆర్థికంగా తగినంత వృద్ధి చెప్పదగినది కాదు వీలు లేదు. వార ద్వితీయ భాగం కొంతలోకొంత మేలు. ఆర్థిక లాభమాశించవచ్చు. స్త్రీలకు ఏవిధంగా చూచిన లోపం రాని వారం. అనుకూల వారం. సర్వాభీష్టాలు నెరవేరగలవు.

సింహం:— మీ స్వ విషయాలను దూరంగా పెట్టి పరుల విషయాలను చేతిన పెట్టుకొని కాలం వ్యయిస్తారు. ముందు మీకు లాభించే మెలగటం ఎంతైనా శ్రేయం. వ్యాపారం బాగుంటుంది. సంఘ వ్యవహారాలలో పేరు ప్రఖ్యాతులను పొందగలరు. ప్రతిభా రచయితలకు కళాకారులకు ఊహ లేని ఆర్థికలాభప్రాప్తి చెప్పవచ్చు. స్త్రీలకు వృత్తి ఉద్యోగాలలో అనుకూలం, వాహన ప్రాప్తి సేకరణ సంభవం.

కన్య:— గృహ సంబంధ చిక్కులుండవే ఉన్నాయి. పాటించినంత కార్యభారం మీ పై ఉన్నది. వృత్తిలో కూడ శ్రమ కరంగా ఉండే వారం. పెద్దల ఆదరాభిమానాలుంటాయి. శుభ

వారఫలం

కార్య సంబంధమైన వ్యాకులాలంత వారం గడుస్తుంది. స్త్రీలకు: ప్రమోషన్ ఉద్యోగంలో, వృత్తిలో ఆదాయం ఆశించదగిన వారం

తుల:— ఈ వారం విద్యా వ్యాసంగాలు ఫలించుటకు, దగ్గరి ప్రయాణం గావించుటకు, వ్యాపారంలో స్వల్ప అనుకూలతకు, సారస్వతరంగములో శక్తి సామర్థ్యాలు వికసించుటకు అనుకూలం. ఏ వ్యాపారం నిర్విఘ్నంగా కొనసాగుతుంది. వృత్తి ఉద్యోగాలు 5, 6 తారీఖులలో సంతృప్తిదాయకంగా ఉంటవి. ఎంతో శుభకార్య ప్రస్తావన కూడా సంభవమయ్యే వారం. స్త్రీలకు క్రమాభివృద్ధి వృత్తి, ఉద్యోగాలలో కనిపించగల వారం.

వృశ్చికం: మీ రాశికి దశమ స్థితుడైన గురు గ్రహానుకూలత వల్ల ఆర్థికరంగంలో మీరు ప్రగతి సాధించనున్నారు. అప్రయత్నంగా ఆర్థిక లాభం 7, 8 తారీఖులందు గలదు. విశాఖనక్షత్ర జాతకులకు ఏవిధమైన లోపం కనిపించదు. రావలసిన ధనం సకాలానికి అందగలదు. మీరు చెల్లించవలసిన బాకీలు క్రమంగా తీర్చే అవకాశమున్నది. స్త్రీలకు: సర్వానుకూలమైన వారం.

ధనుస్సు: ఈ వారమంతా మీరు బహుముఖముగా వ్యాసంగంలో నిమగ్నులవుతారు. కార్యభారం అధికం. శ్రమ కూడా అధికమే. ఇందుమూలాన ఆరోగ్యంలో లోపం కనిపించవచ్చు. కుటుంబ సంబంధమైన చిక్కులుంటాయి. ఉద్దేశించినంత పనులు సానుకూలం కావు. చిక్కులు తీరవు గదా! మూలా నక్షత్ర జాతకులు అధిక ఫలాలు పొందనున్నారు. స్త్రీలకు. ఆరోగ్య లోపం గాని, ఆర్థిక లోపం గాని, సుఖసంతోషాలకు లోపం గాని రాదు.

మకరం:— వార ప్రథమ దినాలు, చాలా మంచివి ఈ రాశి వారలు. దూర ప్రయాణం గావించనున్నారు. శుభకరమైన మొదటి రెండు దినాలలో మీ ఆలోచనలు ఫలించి ఆర్థికంగా అనుకున్న దానికన్న అధికఫలం ఆశ్చర్యజనకంగా అందగలదు. ప్రయాణం మానుకోకండి. అష్టమ శని బాధ నివారణమైనా, వయోవృద్ధులు ఆరోగ్యవిషయములో శ్రద్ధ వహించాలి. స్త్రీలకు: వారమంతా మంచిదే.

కుంభం:— మీకు ధనలాభంలో లోపం లేదు. వ్యాపార విస్తరణకు అనుకూలత గలదు. కళాకారులకు, ఉపన్యాసకులకు, రచయితలకు, పత్రికా రచయితలకు, సినీరంగంలో ప్రవేశం గలవారికి విజయవంతమైన వారం. చాలా మందికి అధికారుల్తో మేలు జరుగనున్నది. స్త్రీలకు విశేషంగా ఉద్యోగంలోని వారికి లాభదాయకం.

కృత్రిమ హస్తం

పశ్చిమ జర్మనీలోని మ్యూనిచ్ క్లినిక్ డాక్టర్లు ఎప్పుడూ సంచలనాన్ని సృష్టిస్తుంటారు. ప్రస్తుతం ఒక రోగి పాదంలోని కొన్ని భాగాలను తీసి అతనికి ఒకచేతిని తయారుచేసి ఇచ్చారు. ఈ రోగి టర్కీలో జరిగిన ఒక ప్రేలుడు ప్రమాదంలో తన రెండు చేతులను పోగొట్టుకున్నాడు. మ్యూనిచ్ డాక్టర్లు అతని రెండు పాదాలలోని కాలి వ్రేళ్లపైన కొన్ని భాగాలను తొలగించి ఒక చేతిని తయారు చేశారు. వ్రేళ్లను జయప్రదంగా చేయడం వీరికి క్రొత్త కాదు. లోగడ ఒక పియానో విద్వాంసురాలు ఒక ప్రమాదంలో తన బొటనవ్రేలిని పోగొట్టుకుంది. మ్యూనిచ్ డాక్టర్లు ఆ వ్రేలిని తయారుచేసి అమర్చారు. అయితే చేతిని పూర్తిగా తయారుచేయడం ఇదే మొదటిసారి.

మీనం:— బాధ్యతాయుతంగా సంచరించే మీకు మీ వ్యాపారంలో గాని, ఉద్యోగంలో గాని, వృత్తిలో గాని ఏలాటి ఇబ్బంది లేదు. క్రమాభివృద్ధి నొందుటకు, వ్యాపారంలో కొన్ని మార్పులు చేయనున్నారు. మిత్ర సహాయం, హితుల ఆదరాభిమానాలుంటాయి. స్త్రీలకు: ఆర్థికంగా అనుకూలం. సుఖసంతోషాలుంటాయి.

— విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

కలెక్టర్ కృష్ణమూర్తి :

అంతర్ముఖులై ఆత్మ సాక్షాత్కారం పొందిన యోగులు ఆత్మ సంతృప్తితో తొణికిసలాడుతుంటారని పెద్దలంటారు. కర్మయోగులలోను ఆ తృప్తి కమనీయత కానవస్తుంది. పరమాత్మ పరోక్షదైవమయితే, కర్మ కన్నెదుట కానవస్తున్న దైవం. మిత్రులు కలెక్టర్ భట్టిప్రోలు కృష్ణమూర్తి అరమోడ్పు గనులతో తమ ఉద్యోగ నిర్వహణానుభవాలు, ఆత్మస్తుతి లేశమయినా లేక చెబుతుంటే ఆయన కర్మ నిష్ఠ, ప్రజాసేవా పరాయణత, మేరునగధీరమయిన నైతికబలం అహమహమికతో మనసు పలుకరిస్తాయి. అవే ఆయన కవితలోను, కథలలోను, నవలల్లోను, వ్యాసాలలోను పొటీపడతాయి. కనుకనే ఆయన మనసులాగే ఆయన కవిత—రచన అంతా పరిణతం

ఆత్మ తత్త్వంతోపాటు సాహిత్య తత్త్వాన్ని నిరంతరం స్వగతంలో తరచి చూస్తుంటారు. కర్మయోగి కృష్ణమూర్తి 1921 ఆగస్టు 27న రాజమండ్రిలో జన్మించారు. నెల్లూరులో, గుంటూరులో, రాజమండ్రిలో, కాకినాడలో చదివారు. రాజమండ్రిలో భమిడిపాటి కామేశ్వరరావు, జయంతి గంగన్న గార్ల వంటి ఉపాధ్యాయుల శిక్షణలో క్రమశిక్షణ అలవరచుకొన్నారు. సాహిత్యాభిరుచిలో పాటాలు నేర్చుకొన్నారు బి. ఎ. చదువుతూ వీలుకాక చదువుమాని వేశారు. అప్పుడే— 1936 ఒరిస్సారాష్ట్రం ఏర్పడింది ఒరిస్సాలోని జయపూర్ సంస్థానంలో పని చేస్తున్న అన్నగారివద్దకు వెళ్లారు. కాకినాడలో కృష్ణశాస్త్రిగారి శిష్యరికంతో కవిత్వం ఒంటబట్టింది గనుక జయపూర్‌లోని జగన్మిత్ర నాటక సమాజం వారు కోరగా, సైరంధ్రి నాటకం వ్రాసి ఇచ్చారు —1939 లో.

కృష్ణమూర్తి జయపూర్ సంస్థానంలో గుమాస్తాగా ప్రవేశించి, పిదప 1944 లో కోరాపుట్టి జిల్లా కలెక్టరేట్‌లో గుమాస్తాగా చేరారు. ప్రైవేటుగా బి. ఎ., బి ఎల్., పరీక్షలలో ఉత్తీర్ణులయి, 1954 లో ఎమర్జెన్సీ రిక్రూట్‌మెంటులో తాసీల్దారు సెలెక్షన్ పరీక్షకు వెళ్లి, వేంయమందిలో ప్రథములు కావడం వల్ల డిప్యూటీ కలెక్టరుగా ఎన్నికయ్యారు. అప్పటినుంచి వివిధ శాఖలలో బాధ్యతగల పదవులు నిర్వహిస్తూ, కలెక్టరయి మొన్నటిజూలైలో ఉద్యోగం నుంచి విరమించారు. కృష్ణమూర్తి అడుగడుగునా ఎదుర్కొన్న ప్రతిపక్షులు అసంఖ్యాకం. కానీ, మనస్వి గనుక, కర్మయోగిగా అన్నిటినీ అధిగమించారు. 1964 లో బంగ్లాదేశ్ యుద్ధం జరిగింది. తండోపతండాలుగా కాందిశీకులు వస్తున్నారు. ఆయన రెవెన్యూ డివిజనల్ ఆఫీసరుగా వున్న బోనైగఢ్ [వనగడం] లోనూ కొందరు కాందిశీకులు వచ్చారు. వారు తమదేశంలోని అత్యాచారాలు ప్రచారం చేయడంతో స్థానికులలో ఉద్రేకాలు పెరిగి మతకలహాలు చెలరేగాయి. కృష్ణమూర్తి కొందరు అధికారులతో పాటు నిరాయుధులుగా అల్లరిమూకల మధ్యకు వెళ్లి, వారిని ప్రబోధించి శాంతపరచి, పరస్పర సామరస్యం కలిగించారు. దానిని శ్రీ జయప్రకాశ్‌నారాయన్ ఇంతటి కారుమేఘాలు క్రమ్ముకున్న సమయంలో బంగారు అంచులులా కృష్ణమూర్తి వంటి అధికారులు కనిపిస్తున్నారు అని ప్రశంసించారు. ఈ ఉదంతాన్ని భూదానయజ్ఞ పత్రిక శాంతికామ్ కీ ఏక్ కహానీ అని విపులంగా ప్రకటించి, అడ్మినిస్ట్రేటర్ మూర్తి నిరాయుధంగా వెళ్ళిన ఉదంతం అఖిలభారత శాంతి కార్యకర్తలకు ఆదర్శం కావాలని ఉద్బోధించింది. ఇలా మధుర స్మృతులు ఎన్నో. రిటైరవుతున్న ఆఖరు క్షణం వరకు కృష్ణమూర్తి తన విధులు నిర్వహిస్తూనే వున్నారు. రిటైరు కావటానికి సంవత్సరం ముందు నుంచే ప్రభుత్వోద్యోగులకు అనాసక్తి యోగం అలవడుతుంది. నిన్నటి సాయంకాలం రిటైరవుతున్న కృష్ణమూర్తిగారు అపరాహ్ణం వరకు నాతో ఎన్నో అంశాలు చర్చించారు. పనిలో శ్రద్ధ వదలలేదు. ఇది యువకులకు ఆదర్శం కావాలి అని వీడ్కోలు సభలో అధ్యక్షత వహించిన ల్యాండ్ రిఫార్మ్స్ కమిషనర్ శ్రీ సుందరరాజన్ ప్రశంసించారు. కృష్ణమూర్తి రచనలకు ఎన్నో బహుమతులు వచ్చాయి. బంగారు సంకెళ్లు నాటకానికి 1961 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. కృష్ణమూర్తి బుర్రకథ మొదలగు ప్రతిసాహిత్య ప్రక్రియను గొప్పగా నిర్వహించారు. గౌరి నవల కన్నడంలోకి అనువాదమయింది. ఈయన సతీమణి శ్రీమతి సుభద్రాదేవి మంచుబొమ్మలు నవలకు 1966 లో ఆంధ్రప్రభ నవలల పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. కుమార్తె శ్రీమతి బాలాదేవికి ఆంధ్రప్రభ ఆంధ్రపత్రిక కథల పోటీలలో బహుమతులువచ్చాయి.

అచ్చయినవి. నవలలు— సూర్యోదయం, నక్షత్రాలు ఆరిపోతాయి, ఒకనాడు, జీవనఝరి, బేబి, గౌరి. నాటకాలు— నాయకరాజు, ఇలాదేవి కథా సంపుటాలు: రాళ్లరత్నాలు, అతిథి. బాలసాహిత్యం— గోరువంక. మధుపు—నేను అనే కవితా సంపుటిని, నీవూ—నేనూ వచన కవితాసంపుటిని త్వరలో ప్రచురిస్తున్నారు.

అవి సహృదయులకు నిండు ఆమెతలు కాగలవనడంలో సందేహంలేదు. జీవితంలో లాగే కవితలోనూ పై అంచులు అందుకుంటూ, మనిషిగా, మనస్విగా ఎదిగిన కర్మయోగి కలెక్టర్ కృష్ణమూర్తి ఇక తమయావత్సమయాన్ని సాహిత్యసేవకు అంకితం చేసి, తమ అనుభవాలను కావ్యాలుగా మలుస్తారని, సార్థకమైన జీవితాన్ని పునస్సార్థకం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

హైదరాబాద్‌లో విశాలాంధ్ర :

విశాలాంధ్ర హైదరాబాద్ ఎడిషనుకుఅక్టోబర్ 31 సాయంకాలం ఎస్. కె. కృష్ణన్ ప్రారంభోత్సవం జరిపారు. విశాలాంధ్ర మొదటి ప్రతిని ఆటోరిక్షా డ్రైవరు శ్రీ ఖుద్రతుల్లాఖాన్ స్వీకరించారు. శ్రీయుతులు గౌతు లచ్చన్న, నీలం రాజశేఖరరెడ్డి, కె. పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర సాంకేతిక శాఖా మంత్రి టి. హయగ్రీవాచారి, శ్రీ రామోజీరావు, శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, శ్రీ బి. నాగేశ్వరరావు, డాక్టర్ రాజాబహదూర్‌గౌడ్, శ్రీ గిరిప్రసాద్, కంభంపాటి సత్యనారాయణ [సీనియర్], విశాలాంధ్ర సంపాదకుడు శ్రీ రాఘవాచారి సంతోషం ప్రకటిస్తూ ప్రసంగించారు.


ఉపశ్రుతి :

'ఏమిటిసార్, ఎందుకీ ప్రయాస?' — అనడిగాను. రెండుసార్లు ఓడిపోయి మూడోసారి ఎన్నికలలో పోటీ చేస్తున్న ఒక పెద్దమనిషిని. "రాజకీయాలలో ఓటమి అనేదే లేదోయ్. గెలిచినా, ఓడినా ప్రజల దృష్టిలో వుండాలి. దూషణో, భూషణో ప్రజలనోట్లో వుండాలని చర్చిల్‌సూక్తి చదువలేదూ?' అని ఎదురుప్రశ్నవేశాడు ఆయన.



ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ అంట్యాకుల పైడిరాజుగారి షష్టిపూర్తి సందర్భమున ఆంధ్రా యూనివర్సిటీ అసెంబ్లీ హాలులో నవంబరు 18 న డా. నేమాని కృష్ణమూర్తి వేసిన తైలవర్ణ చిత్రాన్ని లలిత కళా అకాడమీ సెక్రటరీ శ్రీ పి. టి. రెడ్డి ఆవిష్కరించారు. గౌరవాధ్యక్షులు కళాప్రపూర్ణ శ్రీ పురిపండా అప్పల స్వామి డా. కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం.

సామెతల కథలు



అడుగులకు మడుగులొత్తుట

ఈ సామెతకు బదులు, భక్తితో సేవించటమనీ, అతిగౌరవంగ ఆహ్వానించటమనీ అర్థాలు చెప్పవచ్చు.

పూర్వం, మహాత్ముల, నెవరినైనా ఆహ్వానించటానికి, వారి పాదపద్మాలు, నేలను తాకకుండా, వాటికి దుమ్ము అంటకుండా, లేక కందిపోకుండా, శుభ్రమైన, మెత్తని, తెల్లని బట్టను, వారు నడిచే బాటలో పర్చి, వారిని దానిపై నడిపించుకుని తీసుకెళ్లేవారు. దానిపై వచ్చిందే యీ పలుకుబడి.

ఇప్పుడు స్వాములవార్ని, భక్తులు పూలపై నడిపించటం మనం చూస్తూనే ఉన్నాం. వెనుకటి రాజులూ, రాణీలూ, సకల మర్యాదలతో, అలా నడ్చివెళ్ళటం, సినిమాల్లో చూస్తూనే ఉన్నాం.


దీన్ని యీనాటి రోజుల్లో రెడ్‌కార్పెట్ రిసెప్షన్ అనవచ్చు. ప్రెసిడెంట్లో, ప్రధానులో, మంత్రులో, వస్తే, అతి గౌరవంగా ఆహ్వానించటానికి, కొంత దూరం నుండి, వారు కూర్చునే స్థలం వరకూ రెడ్‌కార్పెట్టు పర్చి దానిపై వారిని నడిపించుకెళ్ళటం మామూలే అయ్యిందిగా.

మడుగులకు బదులు, రెడ్‌కార్పెట్టు నుపయోగించే, యీ ఆహ్వానాన్ని తెలుగులో ఏమంటారో మరి

— *పద్మావతి గంగాధర్*

రసవంతం

వల్చని ఆకుపచ్చ
బలిష్ఠమైన వలపు
కలిపేస్తూ తెలుపు
వెరసి ఎర్రటి ఎరుపు!
సుస్మితమైన మనసు
దారుఢ్యమైన దేహం
కలిపేస్తూ పసుపుతాడు
వెరసి పచ్చని కాపురం!
"తాంబూలమన్నా!
దాంపత్యమన్నా
ఆద్యంతమూ
రసవంతము కాదటోయ్!"
(గురుదేవులు మల్లాది వారికి)
— కె వి యల్. నరసింహశాస్త్రి.



అవీ ఇవీ అన్నీ

మాతలపాటి సాహితీ సత్కారం

కీ.శే. శ్రీ మాతలపాటి గంగాధరం స్మృత్యర్థం ప్రతి సంవత్సరం మే 29న రూ 1,116 లతో జరిగే సాహితీ సత్కారానికి రచనలు పంపదలచిన రచయిత[్రు]లు కి దిగువ చూలు పాటించవలసి ఉదిగా కార్యదర్శి ఎస్. మునిసుందరం ప్రార్థిస్తున్నారు.

ఈ సంవత్సరం ఉత్తమ నవలకు బహుమతి ఇవ్వబడుతుంది. 1.1.77 నుండి 31.12.79 లోగా ఈ మూడేళ్ల వ్యవధిలో ప్రథమ ముద్రణ జరిగిన నవలలు మాత్రమే పరిశీలనకు పంపాలి. పునర్ముద్రణ ప్రతులు పంపరాదు. వ్రాత ప్రతులు స్వీకరించబడవు.

ఇతివృత్తం నేటి తెలుగు సామాజిక జీవితానికి సంబంధించి ఉండాలి. అనువాదాలు పంపరాదు.

ప్రచురణకర్తలు కూడా పుస్తకాలు పంపవచ్చు. అయితే బహుమతి రచయిత[్రి]కే ఇవ్వబడుతుంది.


ఈ పరిశీలనకై నాలుగు ప్రతులు పంపవలసిన ఆఖరుతేది 10—3—80 పంపవలసిన చిరునామా: కార్యదర్శి, గంగాధరం సాహితీ కుటుంబం [రిజి], 3—4—58, గిరింపేట, చిత్తూరు—2.

"నెజ్ఞా" నాటక కళాపరిషత్తు

నెల్లూరు ఫిలిం జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన 1980 ఫిబ్రవరి రెండవ వారంలో నెజ్ఞా నాటక కళాపరిషత్తు పదహారవ వార్షికోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంలో నెల్లూరు టవున్‌హాలులో భారీఎత్తున నాటక, నాటిక, ఏకపాత్రాభినయ పోటీలు రాష్ట్ర స్థాయిలో జరుపబడుతాయి. ప్రవాసాంధ్రులు సైతం ఈ పోటీలలో పాల్గొనవచ్చును. దరఖాస్తులు డిశంబరు 30వ తేదీలోపల చేరాలి అని సెక్రటరి, నెజ్ఞా నాటక కళాపరిషత్, నెల్లూరు కార్యదర్శి తెలుపుతున్నారు..

ఆర్కెస్ట్రా

రాయల కళాగోష్ఠి, అనంతపురంవారు శ్రీశ్రీ షష్ఠిపూర్తి సందర్భంగా ప్రచురించిన ఈవచన కవితా సంకలనంలో డా. కేతు బుచ్చిరెడ్డి, శ్రీయుతులు భూషికృష్ణదాసు, బులుసు వెంకటకామేశ్వరరావు, ఎం. సి. నాగన్న, తామెూవారు కార్తికేయ శర్మల కవితలున్నాయి. 80 పేజీలు గల ఈ పుస్తకం వెల నాలుగు రూపాయలు. ప్రతులకు ప్రచురణకర్తలకు వ్రాయాలి.



ఇది మా పనిలో ఒక భాగం. మీకు రావలసిన మధ్యంతర (ఏంటిసిపేటెడ్) వాయిదా సొమ్ము లేక కాలవ్యవధి పూర్తయాక రావలసిన (మెచ్యూరిటీ) మొత్తాన్ని తీసుకొని మేమే మీ గుమ్మం దగ్గరకు వస్తాము. మీకు వాయిదా సొమ్ము లేక మెచ్యూరిటీ పైకం అందవలసిన తేదీకి దరిదాపు రెండు నెలల ముందే మా కార్యక్రమాన్ని ప్రారంభిస్తాము. మేము మీపేర అడ్వాన్సు రసీదు (డిస్చార్జి ఫారం) పంపుతూ, మిమ్మల్ని అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోమని, త్వరలో పాలసీ తాలూకు సొమ్ము పంపబడుతుందని జ్ఞాపకం చేస్తాము. ఇందుకు మీరు అడ్వాన్సు రసీదు (డిస్చార్జి ఫారం)లో సంతకంచేసి, దానితో బాటు పాలసీ పత్రాన్ని జతచేసి, మాకు త్రిప్పి పంపాలి.

చాలాసార్లు మేము మెచ్యూరిటీ తేదీ లేక మధ్యంతర వాయిదా (ఏంటిసిపేటెడ్) సొమ్ము కట్టవలసిన తేదీకి ముందుగానే–కొద్ది రోజుల తర్వాత మారే (పోస్టు డేటెడ్) చెక్కుద్వారా పంపగలుగుతున్నాము. కాని ఇందుకోసం అవసరమైన ఫారాలు పంపి, చేయవలసిన కార్యాలు సకాలంలో జరపాలి.

ఎంతైనా, మీ పాలసీ మీ కష్టాలను తొలగించాలి, అందుకు కారణం కాగూడదు. మేముకూడా— మీరు మీ సొమ్మును శ్రమలేకుండా, సకాలంలో పొందడానికి అవసరమైన చర్యలను తీసుకుంటూనే వున్నాము.

ఐతే-మాకు కావల్సిందల్లా ఏమిటంటే. మీరు ముఖ్యమైన పత్రాల్ని-అంటే పాలసీకి సంబంధించిన అన్ని పత్రాల్ని జాగ్రత్తగా వుంచాలి. మీ వయోనిర్ధారణ ఇంతవరకుచేసి వుండకపోతే మెచ్యూరిటీ తేదీకి ముందుగానే చెయ్యండి. మీ చిరునామాలో మార్పేదైనా వుంటే వెనువెంటనే మాకు తెలియజేయండి. మీ పాలసీ ప్రీమియాలను (మీరు కట్టవలసిన వాయిదాలను) సక్రమంగా, సకాలంలో, సరైన కార్యాలయంలో కడుతూ వుండండి.

ఈ పనులు మీరు చేసినట్లయితే మీరు మెచ్యూరిటీ లేక మధ్యంతర (ఏంటిసిపేటెడ్) వాయిదా సొమ్ము పొందడంలో ఎటువంటి జాప్యమూ, సమస్యలూ వుండవు. మీ పాలసీయొక్క మెచ్యూరిటీ లేక మధ్యంతర వాయిదా సొమ్ము అందవలసిన తేదీకి ఒక నెల ముందుగా అడ్వాన్సు రశీదు రాకున్నా, (ఈ విధంగా కొన్నిసార్లు మానవ సహజమైన లేక ఉపయోగించే యంత్రంలోని పొరబాటు మూలంగా జరుగుతుంది), ఇంకా మీ పాలసీ మొత్తం చెల్లింపు సంబంధించిన ఏ విధమైన సమస్య కలిగినాకూడా మీరు దయచేసి మా డివిజనల్ కార్యాలయంలోని 'లయసన్ అధికారి'ని లేక క్లెయిమ్స్ శాఖాధికారిని స్వయంగానే. ఉత్తరం మూలంగానో సంప్రదించండి. వారు సంతోషంతో మీకు సహాయం చేస్తారు. మీ పాలసీతోబాటు కొద్దిపాటి శ్రమనుకూడా అంగీకరించడం మా బాధ్యత–మీకు శ్రమ వుండకూడదనే ఉద్దేశంతో.

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

నేడే భీమా చేయండి, రేపటి రక్షణకోసం

dacunha-LIC 66-TEL

అవీ...ఇవీ...అన్నీ

మార్క్సిస్టు పాఠాలు

రచన : వ్యాసాల. 24 పేజీలు, వెల రూపాయి. ప్రతులకు : సాహిత్యనికేతన్, సంగ్రామ్ చౌక్, ఏలూరురోడ్, విజయవాడ—520002

చేతనా

భిలాయి ఉక్కు నగరంలోని సాహిత్య పిపాసువుల సంస్థ చేతనా వెలువరించిన కవితా సంకలనం. చేతనాలో 34 మంది వ్రాసిన 37 కవితలున్నాయి. ఇవన్నీకూడా కేవలం అచ్చులో పేరు చూసుకోడంకోసం వేయించుకున్న రచనలుకావు. ఈనాటి సాహిత్య స్థాయినందుకొని, ఆయా కవితా సంకలనాలనుండి తల ఎత్తుకుని నిలువగలిగే కవితలే ఎక్కువ యిందులో ఉన్నాయి. అన్నీ బాగున్నాయి. బోలెడు వైవిధ్యంకూడ ఉంది. ఈ సంపుటంలో 44 పుటలు. ప్రతులకు (వెల లేదు) చేతనా2—ఏ. స్ట్రీటు నెం. 32, సెక్టర్ 6, భిలాయి 6కి వ్రాయవచ్చును.

వసంతవల్లరి


శ్రీ వారణాసి వెంకటరావు గేయ సంపుటం. వసంతవల్లరిలో 76 గేయాలున్నాయి. పాడుకోడానికి చదువుకోడానికికూడ వీలుగా ఉన్నాయి. గేయ సంపుటంలో 96 పుటలున్నాయి. చక్కని ముఖపత్రం. వెల. 5 రూ. ప్రతులకు ప్రశాంతి పబ్లికేషన్స్, జి.కృష్ణమోహన్, పుష్పమ్మతోట, విజయవాడ—10. ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.

ఏది విషం - ఏది అమృతం?

''ఇదుగో! ఈ ఒక చిన్న సీసాలోని నాలుగు చుక్కలతో మన ప్రేమ జీవితానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగి పోతాయి'' అని ప్రోత్సహించాడతను. అతను స్వయంగా డాక్టరు గనుక అతని మందుకు తిరుగులేదు. కానీ, ఆ మందు బెడిసికొట్టి ఆ అందాలరాశి జీవితాన్నే ఎలా అంతం చేసింది? 'విపుల' జనవరి సంచికలో ప్రచురిస్తున్న సుప్రసిద్ధ ఉర్దూ రచయిత్రి అతియా పర్వీన్ కథ 'త్యాగం'లో చదవండి.

ఈ కథతో పాటు మిమ్మల్నాకట్టుకునే మరెన్నో కథలు తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలీ, మరాఠీ వంటి అనేక సంపన్న భాషలనుండి సేకరించి అందజేస్తోంది విపుల. కథలతో పాటు కార్టూన్లు, జోకులు, విచిత్ర విశ్వ విజ్ఞానం అడుగడుగునా మిమ్మల్నలరిస్తాయి. ప్రతి కథకూ రెండు రంగుల భావస్ఫోరకమైన చిత్రాలు మరో ప్రత్యేకాకర్షణ.



Marketed By
Margadarsi Marketing
PRIVATE LIMITED
Eenadu Compound
Hyderabad-500 004

ప్రతినెలా ఒకటవ తేదీకి
వెలువడే విశ్వకథా విపంచి

విపుల

132 పేజీలు 125 పైసలే.

Regd No H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA